తొలిసారి నామినేషన్ వేస్తున్న నటుడు విజయ్



9

సీఎం రేవంత్‌కు.. కవిత లేఖ



2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - మంగళవారం 31 మార్చి 2026 | సంపుటి: 10 | సంచిక: 84 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


# కేసీఆర్ లేకపోతే నేను లేను..
# ఆయన వల్లే నాకు గుర్తింపు

## హరీష్‌రావు కాలనాగు కంటే ప్రమాదకరం

నిత్యావసరాల అక్రమ నిల్వ హత్యానేరం కంటే ఎక్కువ

**ఆహార కల్తీ నియంత్రణకు ఈగల్, హైడ్రా తరహా కఠిన చట్టం**

సన్న బియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియాకు చెక్ పెట్టినం

**సన్న బియ్యంతో రాష్ట్రంలోని 86 శాతం ప్రజలకు లబ్ది**

సీఎం రేవంత్ రెడ్డి చిట్‌చాట్

**అసెంబ్లీ సెంట్రల్ హాల్‌లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు సన్న బియ్యం లంచ్**



హైదరాబాద్, మార్చి 30 (మనం బ్యూరో): కేసీఆర్ లేకపోతే నేను లేను.. ఆయన వల్లే నాకు రాజకీయంగా గుర్తింపువచ్చిందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. మహాభారతంలో శకుని లేకుంటే కృష్ణుడు లేడనీ, తన రాజకీయ జీవితం కూడా అంతేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో పీడీఎస్ సన్న బియ్యం పంపిణీ ప్రారంభించి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు అసెంబ్లీ సెంట్రల్ హాల్లో సన్న బియ్యం లంచ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ కేసీఆర్ రెస్ట్ తీసుకుంటున్నారని అంతా అనుకుంటున్నారు కానీ, కేసీఆర్‌ను కేటీఆర్ హరీష్ రావు గృహ నిర్బంధం చేశారని వ్యాఖ్యానించారు. హరీష్ రావు కాలనాగు కంటే ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఆహార కల్తీ నియంత్రణకు ఈగల్, హైడ్రా లాగే కఠిన చట్టం తీసుకొస్తామని తెలిపారు. దేశంలోని చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను తీసుకొస్తామని చెప్పారు.రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని దళారులు దోపిడీకి పాల్పడుతున్నారనీ, రైతుల హక్కులను కాపాడేందుకు దేశంలో కాంగ్రెస్ పార్టీ కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చిందని పేర్కొన్నారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువనీ, ప్రజల ఆకలిని సొమ్ము చేసుకునే వాళ్లను నియంత్రించడానికి కాంగ్రెస్ పకడ్బందీ చట్టం తీసుకొచ్చిందన్నారు. రూపాయి కిలో బియ్యం పథకం విజయభాస్కర్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రారంభించిందనీ, ఆ తరువాత ఎన్టీ రామారావు ప్రవేశపెట్టిన ఈ పథకం ప్రజల్లోకి బాగా వెళ్లిందని వ్యాఖ్యానించారు. రేషన్ బియ్యం పంపిణీపై ప్రజల్లో మంచి స్పందన వచ్చిందన్నారు. నలభై ఏళ్లుగా ఈ పథకం కొనసాగుతోందనీ,

...మిగతా 2లో

# నాలుగు బిల్లులకు అసెంబ్లీ ఆమోదం

## వ్యాట్ సవరణ బిల్లును సీఎం తరఫున ప్రవేశపెట్టిన మంత్రి జూపల్లి

హైదరాబాద్, మార్చి 30 (మనం బ్యూరో): రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల చివరి రోజైన సోమవారం శాసనసభ పలు కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది. ఈమేరకు తెలంగాణ విద్వేష ప్రసంగాలు, విద్వేష నేరాల బిల్లు-2026ను సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవేశపెట్టారు. అలాగే, తెలంగాణ వాల్యూ యాడెడ్ టాక్స్,మొబిలిటి సవరణ బిల్లును సీఎం తరఫున మంత్రి జూపల్లి కృష్ణారావు సభ ముందుంచారు. ఇక అసెంబ్లీలో న్యాయవాదులపై దాడులను అరికట్టేందుకు ఉద్దేశించిన అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లును మంత్రి శ్రీధర్ బాబు అసెంబ్లీలో ప్రవేశపెట్టారు.గిగ్ వర్కర్ల హక్కులు, భద్రత కోసం ఉద్దేశించిన గిగ్ వర్కర్ల నమోదు, సామాజిక భద్రత, సంక్షేమ బిల్లును మంత్రి వివేక్ సభ్యుల ఆమోదం కోసం సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లులపై సభ్యుల సుదీర్ఘ చర్చ అనంతరం సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

**● (టివాట్) మొబిలిటి సవరణ బిల్లు-2026**



తెలంగాణ వాల్యూ యాడెడ్ టాక్స్ బిల్లును అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ బిల్లును సీఎం తరఫున మంత్రి జూపల్లి కృష్ణారావు సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటి అమ్మకపు దశలో మాత్రమే పన్ను విధించే నిబంధనను రిలయన్స్ బీపీ మొబిలిటీ లిమిటెడ్ తమ అంతర్గత లావాదేవీల ద్వారా అనుకూలంగా మార్చుకుంటున్నాయని ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఈ లోపాన్ని సరిదిద్ది రాష్ట్ర ఖజానాకు రావాల్సిన పన్ను వాటాను సక్రమంగా రాబట్టేందుకు ఈ సవరణ అనివార్యమైందన్నారు. గత ఏడాది జూన్‌లో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు ఈ బిల్లు ద్వారా చట్టబద్ధత కల్పించేందుకు సవరణ బిల్లును ప్రవేశపెట్టినట్లు మంత్రి వివరించారు. రాష్ట్రం నుంచి కేంద్రం భారీగా పన్నులు వసూలు చేస్తోందనీ, 2018-2025 మధ్య కాలంలో రాష్ట్రం కేంద్రానికి పన్నులు, జీఎస్టీ రూపంలో రూ.4.60 లక్షల కోట్ల ఆదాయాన్ని అందించిందనీ, అయితే, కేంద్రం నుంచి తిరిగి రాష్ట్రం గ్రాంట్ల రూపంలో పొందింది కేవలం రూ.1.36 మాత్రమేనన్నారు. కేంద్రం బీజేపీ పాలిత రాష్ట్రాల పట్ల ఒక రకంగా బీజేపీ యేతర పాలిత రాష్ట్రాల పట్ల మరొకరకంగా వ్యవహరిస్తోందని మంత్రి జూపల్లి విమర్శించారు.



**● అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం**



**న్యాయవాదులపై దాడులు అరికట్టేందుకే: మంత్రి శ్రీధర్ బాబు**

న్యాయ వ్యవస్థలో న్యాయవాదుల పాత్ర కీలకమనీ, వారి రక్షణ

...మిగతా 2లో

కేరళను దోచేస్తున్న ఎల్డీఎఫ్, యూడీఎఫ్

# రాబోయేది ఎన్డీయే సర్కారే

- **అవినీతి డబ్బును రాబట్టి అభివృద్ధి చేస్తాం**
- **పాలక్కాడ్ సభలో ప్రధాని మోదీ**



పాలక్కాడ్, మార్చి 30: వామపక్షాల నేతృత్వంలోని ఎల్డీఎఫ్, కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యూడీఎఫ్‌లు కేరళను దోచుకుంటూ వస్తున్నాయని ప్రధాని నరేంద్రమోడీ ఆరోపించారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఏ ఒక్కరికో బీ టీం కాదని, నిజమైన ఏ టీం అని స్పష్టం చేశారు. ఈసారి ఎన్నికల్లో కేరళలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయబోయేది ఎన్డీయే అని, అవినీతిపరులు దోచుకున్న డబ్బును వసూలుచేసి రాష్ట్రాభివృద్ధికి ఖర్చుచేస్తుందని తెలిపారు. కేరళలోని పాలక్కాడ్‌లో భారీస్థాయి ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ ఈ రాష్ట్రం కొన్ని

...మిగతా 2లో

లష్కరే తోయిబా ఉగ్రవాది

# షబ్బీర్ అహ్మద్ అరెస్ట్

ఢిల్లీ, మార్చి 30: భారత్‌లో దాడులకు కుట్ర పన్నినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న లష్కరే తోయిబా ఆపరేటివ్ షబ్బీర్ అహ్మద్ లోన్‌ను అరెస్టు చేసినట్లు సోమవారం అధికారులు వెల్లడించారు. ఢిల్లీ సమీపంలో అతడిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. షబ్బీర్‌ది జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్ జిల్లా. బంగ్లాదేశ్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. పాకిస్థాన్ ఐఎస్ఐ ఆదేశాల మేరకు లష్కరే తరఫున భారత వ్యతిరేక కార్యకలాపాలు నడుపుతున్నాడు. అందుకోసం భారత్‌లో చట్టవిరుద్ధంగా నివసిస్తోన్న బంగ్లా జాతీయులను నియమించుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పాక్ పేరు బయటకు రాకుండా ఉండేందుకే ఈ ఎత్తుగడ వేసినట్లు అధికారులు వెల్లడించారు. ఆ క్రమంలో ఢిల్లీ పోలీసు విభాగానికి చెందిన స్పెషల్ సెల్ ...మిగతా 2లో



# ప్రజా ప్రతినిధులా.. పంచాయితి పెద్దలా?

- కేటిఆర్..హరీష్ సార్..మమ్మల్ని వదలండి
- కుటుంబ సమస్యను రాజకీయం చేయడం తగదు
- దీనికి మంత్రి శ్రీనివాసరెడ్డికి ఏం సంబంధం?
- వట్టినాగులపల్లి భూ యజమానులు



హైదరాబాద్,మార్చి30(మనం న్యూస్): అన్న,తమ్ములకు సంబంధించిన భూ వివాదంలో ఎలాంటి సంబంధం లేని బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్,హరీష్ రావులు కలుగజేసుకొని రాజకీయం

...మిగతా 2లో

# నక్సలిజం అంతమైంది

## డెడ్‌లైన్ వేళ అమిత్ షా ప్రకటన




ఢిల్లీ, మార్చి 30: మావోయిస్టులకు ఒకప్పుడు కంచుకోటగా ఉన్న ఛతీస్‌గఢ్‌లోని బస్తర్లో నక్సలిజం దాదాపు అంతమైందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. నక్సలిజం నిర్మూలన చర్యలపై సోమవారం ఆయన లోక్‌సభలో మాట్లాడారు. సమాజంలో అన్యాయాలకు పరిష్కార మార్గాలు రాజ్యాంగంలో ఉన్నాయని, ఆయుధాలు చేపట్టడం సరైన మార్గం కాదని చెప్పారు. చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఆయుధాలు పట్టుకుంటే మూల్యం

...మిగతా 2లో

## రెండు విడతల్లో ఏపీ, తెలంగాణలో జనగణన

వివరాలు వెల్లడించిన సెన్సస్ రిజిస్ట్రార్ జనరల్




9

## అసెంబ్లీ నిరవధిక వాయిదా

3

# సహజీవన జంటలకు కుటుంబ హోదా

## జనగణనపై కేంద్రం



ఢిల్లీ, మార్చి 30: దేశవ్యాప్తంగా జనగణనకు సిద్ధమైన కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలకు సంబంధించిన నిబంధనల్లో కీలక మార్పులు చేసింది. ఈసారి సహజీవన జంటలకు కుటుంబ హోదా ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది. చాలాకాలంగా కలిసి ఉంటున్న వారిని ఇకపై ఒకే కుటుంబంగా గుర్తించాలని నిర్ణయం తీసుకున్నట్టు తాజాగా వెల్లడించింది. ఈమేరకు జనగణన ప్రక్రియ వివరాలను రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ సోమవారం మీడియాకు వివరించారు.

ప్రస్తుతం జరగనుంది 16వ జనగణన. ఈ ప్రక్రియ ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానుంది. రెండు దశల్లో దీన్ని చేపట్టనున్నారు. తొలిదశలో భాగంగా గృహ గణన చేపట్టనున్నారు. మొబైల్ యాప్ ద్వారా అధికారులు ఇంటింటికీ వెళ్లి ఇళ్ల వివరాలు సేకరించనున్నారు. రెండో దశలో జనాభా లెక్కల సేకరణ ఉంటుంది. దీన్ని వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభించనున్నారు. ఇంతకుముందెప్పుడూ

...మిగతా 2లో

అమెరికా

# విమానాలకు గగనతలాన్ని మూసేసిన స్పెయిన్

మాడ్రిడ్, మార్చి 30: అమెరికా విమానాలకు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు స్పెయిన్ ప్రకటించింది. ఇరాన్‌తో జరుగుతోన్న యుద్ధంలో పాలుపంచుకొనే విమానాలను అనుమతించమని ఆ దేశ రక్షణ మంత్రి మార్గరెటా రొబెల్స్ సోమవారం వెల్లడించారు. ఇరు దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తోన్న సైనిక స్థావరాలను పశ్చిమాసియా ఘర్షణల కోసం వినియోగించడాన్ని ఇప్పటికే స్పెయిన్ నిరాకరించింది. ''ఇరాన్ యుద్ధానికి సంబంధించిన కార్యకలాపాల కోసం మిలిటరీ స్థావరాలు లేక గగనతలాన్ని వినియోగించడానికి అనుమతి ఇవ్వబోం. ఏకపక్షంగా, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా ప్రారంభించిన యుద్ధంలో సహకరించకూడదని మా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దానిలో భాగంగానే తాజా ప్రకటన వచ్చింది'' అని రక్షణ,

...మిగతా 2లో



# త్వరలో ఒప్పందం కుదరకపోతే
# సర్వనాశనమే

## ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్

వాషింగ్టన్, మార్చి 30: ఇరాన్ వీలైనంత త్వరగా ఒప్పందం చేసుకుని, హర్మూజ్ జలసంధిని తెరవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. త్వరగా ఒప్పందం కుదుర్చుకోకపోతే.. ఇరాన్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని తుడిచిపెట్టేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. ఈమేరకు ట్రూత్ సోషల్లో ఓ పోస్టు పెట్టారు. ''ఇరాన్‌లో మా సైనిక కార్యకలాపాలను ముగించేందుకు తీవ్రమైన చర్చలు జరుపుతున్నాం. ఇప్పటివరకు గొప్ప పురోగతి లభించింది. కానీ ఏ కారణాలతోనైనా త్వరలో ఒప్పందం కుదరకపోతే, హర్మూజ్ జలసంధిని వెంటనే తెరవకపోతే.. ఇరాన్‌లోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని, అన్ని డీశాలినేషన్ ప్లాంట్లను పేల్చివేసి.. సర్వనాశనం చేస్తాం. 47 ఏళ్ల భయంకర పాలనలో ఇరాన్ చేతిలో హతమైన ఎంతోమంది అమెరికన్ సైనికులు, ఇతరుల పేరిట ప్రతీకారంగా ఈ దాడులు చేపడతాం'' అని హెచ్చరించారు.

**400 కేజీల యురేనియంపై ట్రంప్ కన్ను..!**

ఇరాన్ వద్ద ఉన్న 60% శాతం శుద్ధి చేసిన సుమారు 400 కిలోల యురేనియం స్వాధీనంపై అమెరికా దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆ దేశ పత్రిక వాల్‌స్ట్రీట్ కథనం వెలువరించింది. అణ్వాయుధ తయారీకి అవసరమైన స్థాయిలో ఆ యురేనియం శుద్ధి చేసి ఉండటంతో అగ్రరాజ్యం ఆందోళన చెందుతోంది. ఇప్పటికే ఇరాన్‌పై ఒత్తిడి తీసుకొచ్చి ఆ యురేనియంను అప్పగించేందుకు అంగీకరించేలా

...మిగతా 2లో

# బంగారు గని వద్ద కాల్పులు..
# 70 మంది మృతి!



జుబా, మార్చి 30: దక్షిణ సూడాన్ మరోసారి రక్తసిక్తమైంది. రాజధాని జుబా శివార్లలోని ఓ బంగారు గని వద్ద తలెత్తిన వివాదంలో గుర్తుతెలియని సాయుధులు 70 మందికిపైగా ప్రజలను హతమార్చారని పోలీసులు తెలిపారు. '' ఓ బంగారు గనిపై

...మిగతా 2లో

# కేసీఆర్ లేకపోతే నేను లేను.. ఆయన వల్లే నాకు గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

ఆనాటి నుంచి దొడ్డు బియ్యమే ఇస్తున్నారని తెలిపారు. దొడ్డు బియ్యం తినే వారు లేక ఆ బియ్యాన్ని సన్న బియ్యంగా మార్చే మాఫియా పెరిగిపోయిందనీ, ఈ బియ్యం ఇవ్వడం ప్రభుత్వానికి ఖర్చు తప్ప పేదలకు ఉపయోగం లేదని గ్రహించామన్నారు. పేదలకు తినగలిగే సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించి సన్నబియ్యం పథకం ప్రారంభించామనీ, ఇందుకోసం రైతుకు క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చి సన్న వడ్లు పండించాలని ప్రోత్సహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 86 శాతం ప్రజలు అంటే 3 కోట్ల 39 లక్షల మంది సన్న బియ్యం పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్నారనీ, భవిష్యత్తులో ఇది 90 శాతం కూడా కావొచ్చని పేర్కొన్నారు. రైతులకు లబ్ది చేకూర్చడమే కాకుండా పేదల ఆకలి తీరుస్తున్నామనీ, సన్న బియ్యం పంపిణీతో బ్లాక్ బార్కెట్ మాఫియా తగ్గిందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడం ప్రభుత్వ తదుపరి లక్ష్యమనీ, అందుకే వరి ఒక్కటే కాదు, వాణిజ్య పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి చేయడం, అవగాహన కల్పిస్తామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.





## డ్రగ్స్ కేసులో రైల్వే సూపరింటెండెంట్ అరెస్ట్

హైదరాబాద్,మార్చి 30(మనం,ప్రత్యేక ప్రతినిధి): నగర శివారులోని మోకిలా పరిధిలో కొకైన్' విక్రయిస్తూ రైల్వే సూపరింటెండెంట్‌తో పాటు గూగుల్ సంస్థలో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పట్టుబడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. రైల్వే శాఖలో సూపరింటెండెంట్ డ్రగ్స్ దందాకు ప్రధాన సూత్రధారిగా వ్యవహరిస్తున్నాడని తెలిపారు. రైల్వే ఉద్యోగి తరచూ బెంగళూరు, గోవా వంటి ప్రాంతాల నుండి ఖరీదైన కొకైన్‌ను తన సొంతకారులో హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. మోకిలా ప్రాంతంలో నిఘా పెట్టి, డ్రగ్స్ విక్రయిస్తుండగా నిందితులను అదుపులోకి తీసుకున్నామని, అరెస్టయిన వారిలో రైల్వే సూపరింటెండెంట్ , గూగుల్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, మరో ప్రముఖ వ్యాపారవేత్త ఉన్నారన్నారు. వీరి వద్ద నుండి దాదాపు 40 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నామని, అంతర్జాతీయ మార్కెట్లో దీని విలువ లక్షల్లో ఉంటుందన్నారు.

# సీఎం రేవంత్‌కు.. కవిత లేఖ

- **జీవో నంబర్ 317 బాధితుల న్యాయం చేయాలని డిమాండ్**
- **నాడు కేసీఆర్‌కు రాసిన లేఖను గుర్తు చేసిన జాగృతి అధినేత్రి!**



హైదరాబాద్,మార్చి 30(మనం,ప్రత్యేక ప్రతినిధి): జీవో నంబర్ 317 బాధితులను వారి స్వస్థలాలకు బదిలీ చేస్తూ వన్ టైమ్ రిలీఫ్ ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ జాగృతి అధినేత్రి కవిత లేఖ రాశారు. 2021 డిసెంబర్ 6న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.317 ద్వారా వేలాది మంది ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని లేఖలో వివరించారు. వెంటనే ఆ జీవోను రద్దు చేసి ఉద్యోగులకు వారి సొంత జిల్లాలలో పోస్టింగ్స్ ఇవ్వాలని కోరుతూ నాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాసిన లేఖను గుర్తు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే జీవో నం.317ను సమీక్షించి బాధిత ఉద్యోగులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఎన్నికల మేనిఫెస్టోలోనూ నొక్కి చెప్పారని వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులను మానసిక క్షోభకు గురి చేస్తున్న జీవో నం.317 బాధితులకు న్యాయం చేస్తామని పలు సందర్భాల్లో హామీ ఇచ్చారని లేఖలో పేర్కొన్నారు. వెంటనే జీవో నం.317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు వన్ టైం రిలీఫ్ కింద వారి స్థానికత ఆధారంగా వారి స్వస్థలాలకు బదిలీ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కవిత కోరారు.

**స్థానికతలో:**

స్థానికతను గుర్తించే నిబంధనల్లోనూ సమూల మార్పులు చేయాలని కవిత లేఖలో డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత అప్పటికే వివిధ ఉమ్మడి జిల్లాల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రాతిపాదికన కొత్త జిల్లాలలో పోస్టింగ్స్ ఇచ్చారని తెలిపారు. సీనియారిటీకి ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో ఎనిమిదేళ్లు, అంతకన్నా తక్కువ సర్వీస్ ఉన్న ఉద్యోగులు, టీచర్లు ఆయా ఉమ్మడి జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన ఏదో ఒక జిల్లాకు అలాట్ అయ్యారని వివరించారు. ఉద్యోగులను కొత్త జిల్లాల వారీగా సర్దుబాటు చేయడానికి తీసుకువచ్చినదే జీవో నం.317 అని, 2021 డిసెంబర్ 6న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.317 ద్వారా వేలాది మంది ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారన్నారని తెలిపారు.

**హామీ.. నెరవేర్చండి:**

2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే జీవో నం.317ను సమీక్షించి బాధిత ఉద్యోగులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని సీఎంకు గుర్తు చేశారు. ప్రస్తుతం మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు ప్రభుత్వ ఉద్యోగులను మానసిక క్షోభకు గురి చేస్తున్న జీవో నం.317 బాధితులకు న్యాయం చేస్తామని పలు సందర్భాల్లో హామీ ఇచ్చారన్నారు. జీవో నం.317 బాధితుల సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకు అప్పటి సీఎస్ శాంతి కుమారి ఆధ్వర్యంలో సబ్ కమిటీని ఏర్పాటు చేశారని, అయితే ఇప్పటి వరకు ఆ సబ్ కమిటీ నివేదిక ఏమయ్యిందో అర్థంకాని పరిస్థితి నెలకొందన్నారు. శాంతి కుమారి కమిటీ ఇచ్చిన నివేదిక బయట పెడితే తప్ప జీవో నం.317 బాధితులు ఎంతమంది అనే విషయంపై స్పష్టత వచ్చే అవకాశం లేదదని, సబ్ కమిటీ తన నివేదిక సమర్పించి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం దానిని బయట పెట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలని లేఖలో కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 20 వేల మందికి పైగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు రిటైర్ అయ్యారన్నారు. ఆయా ఖాళీ స్థానాల్లో నిరుద్యోగులకు ఏమాత్రం నష్టం కలుగకుండా అర్హులైన జీవో నం.317 బాధితులకు పోస్టింగ్స్ ఇవ్వాలని కవిత సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

# రాబోయేది ఎన్డీయే సర్కారే

(మొదటి పేజీ తరువాయి)

దశాబ్దాలుగా స్వార్థ రాజకీయాలతో నలిగిపోతోందని చెప్పారు. కుంభకోణాల మధ్య ఎల్డీఎఫ్, యూడీఎఫ్‌లు అధికారాన్ని మార్చుకుంటూ.. జేబులు నింపుకొంటూ వచ్చాయని, ఒకదానిపై ఒకటి ఎన్నడూ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కేరళ ప్రజలు అధికార మార్పు కోరుకుంటున్నారని, ఆ సంకేతం స్పష్టంగా కనిపిస్తోందని ప్రధాని మోడీ చెప్పారు. కేరళను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఎన్డీయే తీర్చిదిద్దుతుందని, 'మోదీ హామీల గ్యారంటీ'లతో రాష్ట్రం ముందుకు సాగుతుందని తెలిపారు. ''కేరళ ఇప్పుడు రూ.5 లక్షల కోట్లకు పైగా రుణభారంతో సతమతమవుతోంది. ఉద్యోగులకు సమయానికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావాల్సిన నిధులు, తమ కఠోర శ్రమ ఎక్కడికి పోతున్నట్లు అని ప్రజలు అడుగుతున్నారు. దానికి సమాధానం ఒక్కటే.. అది ఎల్డీఎఫ్ (సీఎం పినరయి విజయన్ ప్రభుత్వం) జేబుల్లోకి వెళ్తోంది'' అని ఆరోపించారు.

''కాంగ్రెస్, వామపక్షాలు ఎక్కడ అధికారంలోకి వచ్చినా అంతా నాశనం చేస్తాయనే ట్రాక్ రికార్డ్ ఉంది. బెంగాల్, త్రిపురలను కమ్యూనిస్టులు ఏం చేశారో దేశం మొత్తానికి తెలుసు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఏం చేసిందో అందరూ చూశారు. అవే దుర్మార్గపు పథకాలతో కేరళను కూడా నాశనం చేశారు. జాతీయ స్థాయిలో, అనేక రాష్ట్రాల్లో ఈ రెండు కూటములు కలిసి పనిచేస్తాయి. రాష్ట్రంలో మాత్రం ప్రత్యర్థులుగా నటిస్తాయి.

కాంగ్రెస్ అధికారంలో ఉన్నచోట కూడా పరిస్థితి దారుణంగానే ఉంది'' అని మోడీ విమర్శించారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం సాధ్యమైనంత తక్కువగా పడేలా తమ ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తుంటే కాంగ్రెస్ మాత్రం రాజకీయ లబ్ధికోసం ప్రవాస గల్ఫ్‌వాసుల జీవితాలను ప్రమాదంలో పడేస్తోందని ఆరోపించారు. తొలుత వేదికపై కేరళ సంప్రదాయ వాయిద్యం 'చెండా'ను వాయించి ప్రజల్ని ఉత్సాహపరిచారు. పాలక్కాడ్ నుంచి త్రిశ్శూర్కు చేరుకున్న మోడీ పెద్దఎత్తున రోడ్ షో నిర్వహించారు.

# సహజీవన జంటలకు కుటుంబ హోదా జనగణనపై కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

లేనివిధంగా తొలిసారి స్వయంగా వివరాల నమోదుకు కేంద్రం ఈసారి అవకాశం కల్పించింది. జనగణన కోసం 33 ప్రశ్నలతో ఓ ప్రశ్నావళిని రూపొందించారు. ఇంటి యజమాని, అతని వ్యక్తిగత వివరాలు, కులం, కమ్యూనిటీకి సంబంధించిన వివరాలను ఇవ్వాల్సిఉంటుంది. ఇంట్లో ఉండే వారి సంఖ్య, వారి వయసు వంటి వివరాలను అధికారులు నమోదు చేసుకుంటారు. ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్, స్కూటర్, బైక్, కారు, జీపు, వ్యాన్), గృహోపకరణాలు (రేడియో, టీవీ) వంటి వస్తువుల యాజమాన్యం గురించి ప్రజలను అడుగుతారు. తృణధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, మరుగుదొడ్ల వాడకం, వంటగది సౌకర్యాలు, వంటకు వినియోగించే ఇంధనం వివరాలు సేకరిస్తారు. ఈ వివరాలన్నీ అత్యంత గోప్యంగా ఉంటాయని రిజిస్ట్రార్ జనరల్ వెల్లడించారు. మన దేశంలో సాధారణంగా పదేళ్లకోసారి జనగణన నిర్వహిస్తారు. ఆఖరిగా 2011లో జనాభా లెక్కలు సేకరించారు. కొవిడ్ కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనగణనకు ఆటంకం ఏర్పడింది.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీల సస్పెన్షన్

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణ శాసనమండలిలో కీలక పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సభ నుంచి సస్పెండ్ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లక్ష్యంగా ప్రతిపక్షం చేపట్టిన నిరసన చివరకు సభ్యుల బహిష్కరణకు దారితీసింది. సభ ప్రారంభం కాగానే బీఆర్ఎస్ సభ్యులు మంత్రి పొంగులేటి వ్యవహారంపై చర్చకు పట్టుబట్టారు. చైర్మన్ అనుమతించకపోవడంతో సభ్యులందరూ ఒక్కసారిగా పోడియం వద్దకు దూసుకువెళ్లారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీల తీరుపై మండలి చైర్మన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులు సీట్లలోకి వెళ్లాలని పదే పదే విజ్ఞప్తి చేసినా వినకపోవడంతో సభలో గందరగోళం నెలకొంది. పోడియం వద్ద ఆందోళన చేస్తున్న సభ్యులను అడ్డుకునేందుకు మార్షల్స్ రంగంలోకి దిగారు. ఈ క్రమంలో మార్షల్స్ - బీఆర్ఎస్ ఎమ్మెల్సీల మధ్య తీవ్ర స్థాయిలో తోపులాట చోటుచేసుకుంది. సభ్యుల ప్రవర్తన సభా నియమావళికి విరుద్ధమని భావించిన చైర్మన్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు అందరినీ ఒకరోజు పాటు సభ నుండి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

# మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయండి

**గవర్నర్‌ను కోరిన బీఆర్ఎస్ నేతలు**

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై అక్రమ మైనింగ్, భూ కబ్జా ఆరోపణలున్నాయని, ఆయన్ను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం సోమవారంనాడు గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిసి వినతి పత్రం సమర్పించారు. మంత్రికి సంబంధించిన అక్రమ మైనింగ్, భూ కబ్జాలపై ఆధారాలను గవర్నర్‌కు సమర్పించినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. మంత్రికి సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ ఆరోపించింది. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు నోటీసులు ఇచ్చినట్లు ప్రభుత్వం సభలో అంగీకరించడమే అక్రమాలకు నిదర్శనమని వారు వెల్లడించారు.

ఈ సందర్భంగా గవర్నర్‌తో భేటీ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ వ్యవహారంపై సిట్టింగ్ హైకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వద్దే హోం శాఖ ఉన్నందున సీఐడీ వంటి రాష్ట్ర ఏజెన్సీలపై తమకు నమ్మకం లేదన్నారు. పొంగులేటి మంత్రిగా కొనసాగితే విచారణను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని, కాబట్టి ఆయన్ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని కోరారు. అవినీతి ఆరోపణలపై విచారణ జరిపిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని కేటీఆర్ ప్రశ్నించారు.

# నాలుగు బిల్లులకు అసెంబ్లీ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

మనందరి బాధ్యత అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం అసెంబ్లీలో అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లును మంత్రి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంథని నియోజకవర్గంలో గట్టు వామన రావు దంపతులను అతి కిరాతకంగా హత్య చేశారనీ, ఇప్పటికీ అసలు దోషులను గుర్తించలేదనీ, సీబీఐ విచారణ ఇంకా కొనసాగుతోందన్నారు. ఈ ఘటన తరువాత తమ ప్రొటెక్షన్ కోసం ఓ ప్రత్యేక చట్టం కావాలని న్యాయవాదులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదనీ, న్యాయవాదులపై దాడులు జరిగినా స్పందించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయవాదుల సంరక్షణకు కట్టుబడి ఉందనీ, అందుకే ఇచ్చిన మాటకు కట్టుబడి అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లును సభలో ఆమోదింపజేసుకున్నామనీ, ఒక న్యాయవాదిగా ఇది నాకు సంతృప్తిని ఇచ్చే అంశమని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

**గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమ బిల్లుకు ఆమోదం**

గిగ్ వర్కర్ల హక్కులు, భద్రత కోసం ప్రభుత్వం కీలక అడుగు వేసింది. తెలంగాణ ప్లాట్ ఫాం ఆధారిత గిగ్ వర్కర్ల నమోదు, సామాజిక భద్రత, సంక్షేమ బిల్లును సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ గిగ్ వర్కర్స్‌కు భద్రత కల్పించాలని ప్రభుత్వం బిల్ తీసుకొచ్చిందనీ, డ్రాఫ్ట్ బిల్ సిద్ధం చేసి 30 రోజులు పబ్లిక్ డొమైన్‌లో పెట్టామని తెలిపారు. 65 సలహాలు వచ్చాయనీ, వాటిని కమిటీ డ్రాఫ్ట్‌లో మెన్షన్ చేసిందని వివరించారు. తాను మంత్రిని అయ్యాక ఐదు సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. కమిటీలో గిగ్ వర్కర్స్ రిజిస్ట్రేషన్ చేసుకుంటే యూనిక్ ఐడీ వస్తుందనీ, స్విగ్గీ, జొమాటో ఇలా అన్ని కంపెనీలకు ఒకే ఐడీ ఉంటుందన్నారు. గిగ్ వర్కర్లు తమ సమస్యలు కమిటీకి చెప్పుకోవచ్చనీ, ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రత్యేక అధికారులతో పాటు ప్లాట్ ఫార్మ్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

**తెలంగాణ విద్వేష ప్రసంగాలు, విద్వేష నేరాల బిల్లు**

సెలక్ట్ కమిటీకి రిఫర్ చేసిన స్పీకర్

తెలంగాణ విద్వేష ప్రసంగాలు, విద్వేష నేరాల బిల్లు-2026ను సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏ వ్యక్తి సమూహం, లేదా సంస్థపై అయినా ద్వేషాన్ని రెచ్చగొట్టే విద్వేషపూరిత ప్రసంగాల వ్యాప్తిని, ప్రచురణను, ప్రచారాన్ని అరికట్టం, నివారించడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమన్నారు. మనల్ని విభజించాలని చూసిన వారు చట్టం యొక్క పూర్తి బలాన్ని ఎదుర్కొనేలా కఠినమైన, నిరోధక శిక్షను అందించడానికి అవకాశం కలుగుతుందన్నారు. సెక్షన్ 2 కింద గాయం లేదా ద్వేషాన్ని కలిగించే ఉద్దేశంతో ఉన్న పదాలు, సంకేతాలు, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్లను కలుపుకుని విద్వేషపూరిత ప్రసంగానికి ప్రభుత్వం ఒక సమగ్ర నిర్వచనాన్ని అందించిందని పేర్కొన్నారు.

## అమెరికా విమానాలకు గగనతలాన్ని మూసేసిన స్పెయిన్

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక మంత్రులు స్థానిక మీడియాకు వెల్లడించారు. ఇరాన్ పై అమెరికా-ఇజ్రాయెల్ చేస్తోన్న యుద్ధాన్ని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ తొలి నుంచీ వ్యతిరేకిస్తున్నారు. అందుకే ఈ దేశంపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఆ దేశంతో వాణిజ్యాన్ని నిలిపేస్తామని హెచ్చరించారు.



## నక్సలిజం అంతమైంది

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించుకోవాల్సి ఉంటుందని నక్సలిజాన్ని సమర్థించే వారు తెలుసుకోవాలన్నారు.

కాంగ్రెస్ సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్నా.. ఆదివాసీల జీవితాల్లో మార్పు రాలేదని అమిత్ షా విమర్శించారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి ఎందుకు సాధించలేదని ప్రశ్నించారు. పేదరికం వల్ల నక్సలిజం విస్తరించలేదని, వామపక్ష తీవ్రవాదమే ఈ ప్రాంతమంతటినీ ఏళ్ల తరబడి పేదరికంలో ఉంచిందని ఆరోపించారు. మావోయిస్టులు సమాంతర ప్రభుత్వాన్ని నడిపారని, అభివృద్ధి పనులను అడ్డుకున్నారని, ప్రజలను ఓటు వేయకుండా నిరోధించారని చెప్పారు.

ఎన్డీయే వచ్చాకే గిరిజనుల జీవితాల్లో మార్పులు వచ్చాయని చెప్పారు. నక్సలిజాన్ని దెబ్బతీసిన ఘనత ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలకే దక్కుతుందన్నారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని తుడిచిపెడతామని కేంద్రం ప్రకటిస్తూ వస్తోన్న విషయం తెలిసిందే. ఈ డెడ్‌లైన్ సమీపించిన వేళ అమిత్ షా ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.

## లష్కరే తయ్యిబా ఉగ్రవాది షబ్బీర్ అహ్మద్ అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు 2007లో లోన్ను అరెస్టు చేశారు. అప్పుడు అతడి నుంచి భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. 26/11 మాస్టర్‌మైండ్ హఫీజ్ సయీద్‌తో సంబంధాలున్నాయని గుర్తించారు. 2018 వరకు తిహాడ్ జైల్లో ఉన్న అతడికి బెయిల్ లభించడంతో బయటకు వచ్చాడు. తర్వాత మళ్లీ బంగ్లాకు వెళ్లిపోయాడు. మళ్లీ తన లష్కరే నెట్‌వర్క్‌ను పునర్నిర్మించాడు. అతడి కార్యకలాపాలపై నిఘా ఉంచిన అధికారులు తాజాగా అరెస్టు చేశారు.

## త్వరలో ఒప్పందం కుదరకపోతే సర్వనాశనమే

(మొదటి పేజీ తరువాయి)

చేయడం యుద్ధ ముగింపు నిబంధనల్లో ఒకటిగా చేర్చమని ఒత్తిడి చేస్తున్నారు. దీంతోపాటు తన రాజకీయ మిత్రుల వద్ద కూడా టెహ్రాన్ అణు మెటీరియల్ ఉంచుకోకూడదని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ ఇరాన్ వాటిని చర్చల సమయంలో అప్పగించేందుకు అంగీకరించకపోతే.. బలవంతంగా స్వాధీనం చేసుకొనే అంశాన్ని కూడా ఆయన చర్చించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పాకిస్థాన్, ఈజిప్ట్, తుర్కియేలకు చెందిన మధ్యవర్తుల బృందం అమెరికా, ఇరాన్లతో పరోక్షంగా చర్చలు జరుపుతోంది. కాకపోతే ఇప్పటివరకు దీనిపై అమెరికా-ఇరాన్ నేరుగా చర్చలు జరపలేదు. యుద్ధం మొదలైన నాటినుంచి ట్రంప్ తన లక్ష్యాలను మారుస్తూనే ఉన్నారు. కానీ, ఆయన టెహ్రాన్ న్యూక్లియర్ బాంబు విషయంలో మాత్రం స్థిరమైన వైఖరిని అవలంభిస్తున్నారు. ఈ నేపథ్యంలో వీటికోసం ఆయన ఎంతవరకైనా వెళతారన్న విషయం ఆసక్తికరంగా మారింది. పశ్చిమాసియాకు అమెరికా భారీ సంఖ్యలో సైనికులను తరలిస్తోంది. ఇప్పటికే 3,500 మెరైన్లను పంపిన అమెరికా తాజాగా పెద్ద సంఖ్యలో కమాండోలు, ఆర్మీ రేంజర్లు, నేవీ సీల్స్ను కూడా అక్కడికి తరలిస్తున్నట్లు పెంటగాన్ వర్గాలు వెల్లడించాయి. వీరిని హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు వాడతారా.. లేదా ఖర్గ్ ద్వీపం స్వాధీనం ఆపరేషన్లో వినియోగిస్తారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

## బంగారు గని వద్ద కాల్పులు.. 70 మంది మృతి!

(మొదటి పేజీ తరువాయి)

గుర్తుతెలియని సాయుధులు దాడి చేశారు. ఈ ఘటనలో 70 మందికిపైగా మరణించారు. అనేక మంది గాయపడ్డారు'' అని పోలీసులు తెలిపారు. దక్షిణ సూడాన్ ప్రతిపక్ష పార్టీ 'సూడాన్ పీపుల్స్ లిబరేషన్ మూవ్మెంట్ ఇన్ అపోజిషన్' ఈ దాడిని ఖండించింది. ప్రభుత్వ బలగాలే ఈ దుశ్చర్యకు పాల్పడ్డాయని ఆరోపించింది. 'ఎస్పీఎల్ఎం-ఐవో' పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్న రియెక్ మచార్ మద్దతుదారులకు, దక్షిణ సూడాన్ అధ్యక్షుడు సల్వా కియిర్కు మధ్య అంతర్యుద్ధం సాగుతోంది.

సెంట్రల్ ఈక్వటోరియా రాష్ట్రంలోని జెబెల్ ఇరాక్‌లో ఉన్న ఈ బంగారు గని ప్రాంతంలో గతంలోనూ అక్రమ గనుల తవ్వకందారులు, మైనింగ్ కంపెనీల మధ్య హింసాత్మక ఘర్షణలు చోటుచేసుకున్నాయి.



# ప్రజా ప్రతినిధులా.. పంచాయితి పెద్దలా?

(మొదటి పేజీ తరువాయి)

చేయటం తగదని వట్టినాగులపల్లి భూ యజమానులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కేటీఆర్,హరీష్‌రావులు ప్రజా ప్రతినిధులా...? లేక పంచాయితీ పెద్దలా అంటూ వారు ఆవేదనను వెల్లగక్కారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం, వట్టినాగులపల్లి గ్రామంలో గల సర్వే నెంబర్ 245 వ్యవసాయ భూమిలో జరుగుతున్న భూ వివాదానికి సంబంధం లేని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అంటగట్టడం ఏపాటి న్యాయమని వారు ప్రశ్నించారు. ఈ భూవివాదంలో మంత్రి కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని,రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు తాము ఏలాంటి డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేయలేదని వట్టినాగులపల్లి యజమానులు స్పష్టం చేశారు. మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి తన అధికార బలాన్ని ఉపయోగించి స్థలాన్ని కబ్జా చేయడానికి యత్నిస్తున్నారనే బిఆర్ఎస్ నాయకుల ఆరోపణలో ఏమాత్రం వాస్తవం లేదన్నారు.ఈ భూవివాదంలో మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డిని, రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌ని ఎందుకు లాగుతున్నారో అర్థం కావడం లేదన్నారు.మా కుటుంబానికి సంబంధించిన స్థలాల సరిహద్దుల విషయంలో మాకు వివాదం ఉందని,దీనికి సంబంధించిన విషయాలను పూర్తి ఆధారాలతో మీడియా ముందు ఉంచుతున్నామని వారు వెల్లడించారు. భూమి విలువపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అదే భూమిని రూ.600 కోట్లకు కేటీఆర్‌కు భేషరతుగా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని,నిజంగా విలువ అంత ఉంటే కొనుగోలు చేయడానికి మీరు సిద్ధమా అని భూ యజమానులు అవినవ్ షా, సుధీర్ కుమార్ షా, అక్షయ్ షా, న్యూజెన్ డెవెలపర్స్ ఎండీ సిద్దార్థ్ గాదె ప్రశ్నించారు.

**ఎవరిని బెదిరించ లేదు:**

రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం వట్టినాగులపల్లిలోని సర్వే నెంబర్ 259లో తనకు ఒక ఎకరం భూమి ఉందని, సతీష్ షా తనకు తండ్రి సమానులని అవినవ్ షా పేర్కొన్నారు. గత పదేళ్లుగా ఆయన సలహాతోనే పని చేస్తున్నానని, భూమిని డెవలప్‌మెంట్‌కు ఇచ్చే ముందు కూడా ఆయనను సంప్రదించానని తెలిపారు. ఇది కేవలం కుటుంబ వివాదమని, దీనిని ఎందుకు రాజకీయం చేస్తున్నారో అర్థం కావడం లేదని అవినవ్ షా ఆవేదన వ్యక్తం చేశారు. హరీశ్ రావు, కేటీఆర్ గార్లు కేవలం ఒకవైపే కాకుండా తమ వాదన కూడా వినాలని కోరారు. 2020 నుంచి తాను భూ సర్వే చేయిస్తున్నానని, హైకోర్టు ఆదేశాల ప్రకారం సబ్ డివిజన్, డిమార్కింగ్ జరగాలని కోరుతున్నట్లు ఆయన తెలిపారు. భువన్ యాప్ ద్వారా వివరాలు సరిచూసుకోవచ్చని, సర్వే చేయించి ఎవరి భూమి వారికి అప్పగించాలని డిమాండ్ చేశారు. సతీష్ షా అక్రమ రోడ్డు నిర్మించారని, తాను ఆయనను బెదిరించానన్నది అబద్ధమని భగవంతుడి సాక్షిగా చెప్పారు. కేసీఆర్ లేదా రేవంత్ రెడ్డి ఎవరిని పిలిచినా సరే, భూ సర్వే చేయించి నిజానిజాలు తేల్చాలని, అనవసరంగా కుటుంబంలో చీలికలు తీసుకురావద్దని భూ యజమాని అవినవ్ షా కోరారు.

**కుటుంబ వివాదం:**

వ్యవస్థలను నిష్పక్షపాతంగా సర్వే చేయనివ్వాలని, ఇది పూర్తిగా కుటుంబ వివాదమని అక్షయ్ షా స్పష్టం చేశారు. రాజకీయ ప్రమేయం వద్దని తాము గతంలోనే కోరామని గుర్తు చేశారు. హరీశ్ రావు, కేటీఆర్ పట్ల గౌరవం ఉన్నప్పటికీ, వారు మాకు వ్యతిరేకంగా అవతలి వ్యక్తి సతీష్ వైపు నిలిచి ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని అభిప్రాయపడ్డారు. తాము కేవలం సర్వే చేయించమని మాత్రమే కోరుతున్నామని, ఇందులో కేటిఆర్,హరీష్‌రావుల రాజకీయం ఎందుకని ప్రశ్నించారు. సరిహద్దులను తేల్చి ఎవరి భూమి వారికి అప్పగిస్తే సమస్య పరిష్కారమవుతుందని భూయజమాని అక్షయ్ షా,పేర్కొన్నారు. వట్టినాగులపల్లి భూమి తమ కుటుంబానికి చెందినదని, 1969 నుంచి ఈ ఆస్తి కుటుంబం మధ్యనే ఉందని సుధీర్ కుమార్ షా వివరించారు. అన్నదమ్ముల మధ్య భూమి పంపకాల్లో కొంచెం తక్కువ, ఎక్కువ ఉండటం సహజమని, ఏడీ లేదా శాటిలైట్ సర్వే ద్వారా సరిహద్దులు తేలితే వివాదం ముగుస్తుందని చెప్పారు. సర్వే నెంబర్లు 259, 245, 262లలో సర్వే చేయిస్తే, ఎక్కువ ఉన్న వారు వదులుకుంటారని, తక్కువ ఉన్న వారు తీసుకుంటారని తెలిపారు. తమ లక్ష్యం ఒక్కటేనని, భూమిని స్పష్టం చేసుకొని డెవలపర్‌కు ఇవ్వాలని సుధీర్ కుమార్ షా,స్పష్టం చేశారు.

**తప్పడు ప్రచారం తగదు:**

కేటీఆర్, హరీశ్ రావు వంటి నాయకులు భూవివాదల్లో తలదూర్చి వారి రాజకీయ పబ్బం గడుపుకోవడానికి మమ్మల్ని సమిధలను చేయటం సరికాదని గాదే సిద్ధార్థ అన్నారు. తమ సంస్థలో పొంగులేటి హర్ష ఒక భాగస్వామి మాత్రమేనని, రాజకీయంగా తప్పుడు ప్రచారం వల్ల కంపెనీ ఇమేజ్ దెబ్బతినడంతో పాటు తమ ఉద్యోగులు, భాగస్వాములు ఇబ్బంది పడుతున్నారని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. రాఘవ కన్స్టక్షన్స్ పేరును అనవసరంగా వివాదంలోకి లాగుతున్నారని,కాంట్రాక్ట్ తీసుకున్నది న్యూజెన్ కంపెనీ అని స్పష్టం చేశారు. కేటీఆర్ భూమి విలువ రూ.1200 కోట్లు అని చెబుతున్న వారు, అవినవ్ షా కు రూ.600 కోట్లు ఇస్తే అగ్రిమెంట్ క్యాన్సిల్ చేసుకుంటామని అన్నారని గాదె వెల్లడించారు. రాజకీయ ఎజెండాతో ఇతరులను ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సబబో నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలని కేటిఆర్,హరీష్ రావులకు సిద్ధార్థ సూచించారు.

# పుర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి



సూర్యాపేట మార్చి 30 (మనం ప్రతినిధి): మున్సిపల్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం సూర్యాపేట పట్టణ కేంద్రంలోని రవి మహల్ కన్వెన్షన్ హాల్ నందు మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, చైర్ పర్సన్ నివేదిత, వైస్ చైర్ పర్సన్ షఫీ ఉల్లా లతో కలిసి సూర్యాపేట మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్థానిక సంస్థల అభివృద్ధికి బడ్జెట్ ప్రణాళికలు సమర్థవంతంగా రూపొందించి అమలు చేయాలని తెలిపారు. వివిధ అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, త్రాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించి సమావేశంలో మొదటిసారిగా నిర్వహించే బడ్జెట్ సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులకు అభినందనలు తెలిపారు.

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని మున్సిపాలిటీలలో సమర్థవంతంగా నిర్వహించాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ సిబ్బంది కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు వార్డుల్లో పర్యటించి కాలనీల్లో చెత్త తొలగింపు, డ్రైనేజీల శుభ్రపరచడం, రోడ్లను శుభ్రంగా ఉంచడం వంటి పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు.పట్టణాన్ని పరిశుభ్రంగా మరియు అందంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పనిచేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జనగణను సమర్థవంతంగా నిర్వర్తించి తీరాలి

## క్షేత్రస్థాయిలో శిక్షణ తరగతులను సమర్థంగా నిర్వర్తించండి....

## నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్...



ఉమ్మడి మహబూబ్ నగర్ మార్చి 30 (మనం బ్యూరో): నాగర్ కర్నూల్ జిల్లాలో నిర్వహించే జనగణన విధులను సక్రమంగా నిర్వహించాలని, ప్రక్రియ నిర్వహణ, సాంకేతికత వినియోగంపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి యాప్ ద్వారా జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వర్తించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు.

సోమవారం జనగణన 2027 ఫేస్ - 1 గృహాల జాబితా, గృహ గణన్డ (హెచ్ ఎల్ ఓ) నిర్వహణలో భాగంగా, సెన్సెస్ ఫీల్ ట్రేన్నర్స్ కు హైదరాబాదు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లు ఫీల్ ట్రైనర్లకు డిజిటల్ శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి, జిల్లాల కలెక్టర్లు తో శిక్షణ కార్యక్రమాలో, నాగర్ కర్నూలు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ మందిరము నుంచి అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, మాట్లాడుతూ ......, నాగర్ కర్నూల్ జిల్లాలో జనగణన నాణ్యత క్షేత్రస్థాయి కార్యకర్తలపైనే ఆధారపడి ఉంటుందని వారికి సమర్థవంతంగా శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఫీల్ శిక్షణ టీమ్లను కోరారు. క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చే బాధ్యత వారిపైనే ఉంటుంది కాబట్టి, శిక్షణా మాడ్యూల్ను సమర్థవంతంగా అర్థం చేసుకోవాలన్నారు. జనాభా గణన ప్రక్రియ సమయంలో వారు సజావైన సమన్వయాన్ని కూడా పాటించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 20 మండలాల ప్రణాళిక గణాంక అధికారులు చార్జ్ క్లర్క్, అసిస్టెంట్ ఛార్జ్ క్లర్క్ లుగా, కంప్యూటర్ ఆపరేటర్లు సాంకేతిక సహాయకులుగా తమకు నిర్దేశించిన విధులను సమర్థవంతంగా నిర్వహించేలా శిక్షణ తరగతులను అందించాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్డులు, పట్టణ ప్రాంతాల్లో ప్రతి కాలనీ, , అపార్ట్మెంట్లు, చిన్నచిన్న వీధి ప్రాంతాల్లో నివసించే ప్రతి ఇంటిని ఇంటిలోని ప్రతి ఒకరి జనగణన విధిగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. ఏ ఒక్క ప్రాంతం, ఏ ఒక్కరినీ కూడా వదలకుండా, డూప్లికేషన్ లేకుండా వంద శాతం కచ్చితత్వంతో పూర్తి చేయడమే తమ లక్ష్యంతో జనగణన చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలోని మారుమూల గిరిజన తండాలు, ఆవాస ప్రాంతాలు హ్యాబిటేషన్లు, గ్రామాలు, మండలాలు, పట్టణ ప్రాంతాలు, జిల్లా స్థాయి వరకు జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వర్తించేలా కచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు నాగర్ కర్నూల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో శిక్షణా కార్యక్రమౌలో డిజిటల్ విధానం సాంకేతిక సమస్యలు తదితర అంశాలపై సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిని సుజాత, మాస్టర్ ట్రైనర్ విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ నిరవధిక వాయిదా

- 10 రోజులు...

## 10 బిల్లులకు ఆమోదం

హైదరాబాద్, మార్చి 30(మనం బ్యూరో ): రాష్ట్ర శాసనసభ సోమవారం నిరవధికంగా వాయిదా పడింది. మొత్తం 10 రోజులు సమావేశాలు జరిగాయి. సమావేశాలలో భాగంగా 82 గంటల 47 నిమిషాల పాటు పలు అంశాలపై వాడి వేడిగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా పది బిల్లులపై చర్చ జరుగగా సభ వాటన్నింటిని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్ను ఈ సమావేశాలలో సభ ఆమోదించింది.

# భారీ షాట్లతో ఎమ్మెల్యే మేఘారెడ్డి జట్టు ఘనవిజయం

వనపర్తి మార్చి 30 (మనం ప్రతినిధి): హైదరాబాద్ నాంపల్లి స్టేడియంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు నిర్వహించిన క్రికెట్ క్రీడా పోటీలలో వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి భారీ షాట్లు కొట్టి తన జట్టును విజయపథంలో ముందుకు తీసుకెళ్లారు. ఒత్తిడితో ఉండే ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు దేహదారుఢ్యం, ఆరోగ్యం, ఏకాగ్రత పెంచేందుకు రెండు రోజులపాటు క్రీడా పోటీలలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి క్రికెట్ టీం కు సారథ్యం వహించి భారీ షాట్లతో విజయం సాధించడంతో సీఎం రేవంత్ రెడ్డి అభినందిస్తూ మేఘారెడ్డి టీం సభ్యులకు తన స్వహస్తాలతో కప్ అందజేశారు.



# ఢిల్లీలో జరుగుతున్న దేశవ్యాప్త కార్మికుల ధర్నాకు సంఘీభావంగా

హనుమకొండ జిల్లా మార్చి 30 న్యూస్: సింగరేణి విశ్రాంతి పెన్షనర్స్ కడార్ల ప్రకాష్ చారి అధ్యక్షతన జరిగినది అధ్యక్షులు మాట్లాడుతూ డి ఎ తో కూడిన కనీస పెన్షన్ రూపాయలు 15000 ఇవ్వాలి

గత 28 సంవత్సరాల నుండి పెన్షన్ సవరణ జరగలేదు కావున తక్షణమే సవరణ చేయాలి ప్రతి మూడు సంవత్సరం లకు ఒకసారి పెన్షన్ రివైజ్ చేయాలి డిమాండ్ చేశారు మరియు ప్రధాన కార్యదర్శి సిహెచ్ సత్యనారాయణ మాట్లాడుతూ పెన్షన్ విధానము వేజ్ బోర్డులో కలపాలి ఇ ౖ ఖ ક ఖి వైద్యము అపరిమితము చేయాలి అని డిమాండ్ చేశారు. నాలుబాల దామోదర్ మాట్లాడుతూ చాలీచాలని పెన్షన్తో జీవిస్తున్న విశ్రాంతి ఈ కార్మికులను ఆదుకోవాలని అన్నారు. సమావేశంలో పాల్గొన్న వారిలో నాగపురి రమేష్ బాబు, ఎం రమేష్ కుమార్, అద్దంకి సారంగ చారి, ఎస్ ప్రభాకర్,రామోజు రామ్మూర్తి, కొలనుపాక సాంబయ్య, మాధవరావు, ఎస్ఎస్ శాస్త్రి, తదితరులు 60 మంది పాల్గొని ఢిల్లీలో జరుగుతున్న ధర్నాకు సంఘీభావం తెలిపారు

# ఉదండాపూర్ నిర్వాసితులకు మరో రూ.150 కోట్లు మంజూరు

## ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద విడుదల చేసిన ప్రభుత్వం

## నిధుల చెల్లింపు మొత్తం రూ.400 కోట్లకు చేరిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ

## సీఎం రేవంత్, మంత్రులు ఉత్తమ్, భట్టికి ధన్యవాదాలు తెలిపిన అనిరుధ్ రెడ్డి

## మిగిలిన మొత్తాన్నీ ఏప్రిల్ లో తీసుకురావడానికి కృషి చేస్తానన్న ఎమ్మెల్యే




ఉమ్మడి మహబూబ్ నగర్ మార్చి 30( మనం బ్యూరో): ఉదండాపూర్ ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ కింద ప్రభుత్వం మరో రూ.150 కోట్లను విడుదల చేసిందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. దీంతో ఇప్పటి వరకూ ఉదండాపూర్ నిర్వాసితులకు ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద విడుదల చేసిన మొత్తం రూ.400 కోట్లకు చేరిందని తెలిపారు. ఉదండాపూర్ నిర్వాసితులకు చెల్లించాల్సిన మిగిలిన బకాయి మొత్తాన్ని ఏప్రిల్ నెలలో ప్రభుత్వం నుంచి తీసుకురావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. హైదరాబాద్ లోని జలసౌద లో ఈనెల 8న పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్ పై జరిగిన అధికారిక సమీక్షా సమావేశం లో ఉదండాపూర్ నిర్వాసితులకు చెల్లించాల్సిన బకాయిల విషయం గురించి చర్చించిన విషయాన్ని సోమవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో అనిరుధ్ రెడ్డి గుర్తు చేసారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ లో భాగంగా ఉదండాపూర్ నిర్వాసితులకు ఇచ్చే పరిహారాన్ని రూ.18 లక్షలకు పెంచడం, ఈ కారణంగా నిర్వాసితులకు అదనంగా రూ.146 కోట్ల రూపాయల మొత్తాన్ని చెల్లించడానికి ప్రభుత్వం గతంలోనే అంగీకరించిందని, పెంచిన ఈ పరిహారం తో కలిసి ప్రస్తుతం ఉదండాపూర్ నిర్వాసితులకు ఇంకా రూ.338 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉందని చెప్పారు. ఈ మొత్తాన్ని రెండు నెలల్లో నిర్వాసితులకు అందజేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ కూడా ఇచ్చారని తెలిపారు. రెండు నెలల్లోపుగా ఉదండాపూర్ నిర్వాసితులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగానే మార్చి నెలలో విడుదల చేయాల్సిన రూ.150 కోట్లను ప్రస్తుతం విడుదల చేసిందని వెల్లడించారు. నిర్వాసితులకు చెల్లించాల్సిన మిగిలిన బకాయి మొత్తాన్ని కూడా ఏప్రిల్ నెలలో తీసుకురావడానికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారంగా ప్రస్తుతం ఉదండాపూర్ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.150 కోట్లు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆర్థిక శాఖా మంత్రి భట్టి విక్రమార్కలకు అనిరుధ్ రెడ్డి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉదండాపూర్ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఒక్క రుపాయి కూడా చెల్లించకుండా నిర్వాసితులను రోడ్లపాలు చేసారని విమర్శించారు. రాష్ట్రంలో తమ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడచిన ఏడాది కాలంలోనే ఇప్పటి వరకూ రూ.250 కోట్లను విడుదల చేసారని, ప్రస్తుతం విడుదల చేసిన రూ.150 కోట్లతో కలిపి ఈ మొత్తం ఇప్పుడు రూ.400 కోట్లకు చేరిందని అనిరుధ్ రెడ్డి వివరించారు. ఉదండాపూర్ నిర్వాసితులలో మరింత ఎక్కువ పరిహారాన్ని కోరుతూ కొంత మంది కోర్టుకు వెళ్ళడం జరిగిందని వారితో కూడా మాట్లాడి వారికి రావాల్సిన పరిహారాన్ని కూడా అందరితో పాటు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని ఇది వరకే మంత్రి ఉత్తమ్ ను కోరామని తెలిపారు. ఉదండాపూర్ నిర్వాసితులకు రావాల్సిన బకాయిలను పూర్తిగా ఇప్పించడంతో పాటుగా గతంలో మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ నిర్వాసితులకు వారికి కేటాయించిన ప్లాట్లను రిజిస్టర్ చేసి ఇవ్వడం జరిగిందని అదే విధంగా ఉదండాపూర్ నిర్వాసితులకు ఇస్తున్న ప్లాట్లను కూడా రిజిస్టర్ చేసి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరామని చెప్పారు. ఈ విషయం గురించి ఇదివరకే జిల్లా కలెక్టర్ తో కూడా మాట్లాడానని అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు.



# శోభాయాత్రను ప్రశాంతంగా జరుపుకోవాలి

- అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు

రంగారెడ్డి మార్చి 30 (మనం న్యూస్) హనుమాన్ జయంతి శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో జరుపుటకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎల్బీనగర్ జోన్ ఎడిషనల్ డిసిపి కోటేశ్వరరావు అన్నారు. హనుమాన్ జయంతి శోభాయాత్ర నిర్వహణకు సంబంధించి నిర్వాహకులతో సోమవారము సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్బీనగర్ జోన్ పరిధిలో ప్రశాంతంగా సజావుగా నిర్వహించేందుకు అవసరమైన సూచన చేశారు. నిర్వాహకుల వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ వనస్థలిపురం ఏసీపిలు కృష్ణయ్య, కాశిరెడ్డి, ట్రాఫిక్ ఏసిపి నవీన్ రెడ్డి, సీఐలు వినోద్ కుమార్, నాగరాజుగౌడ్, రవిబాబు, సైదులు, శ్రీశైలం, మక్బూల్ జానీ, ట్రాఫిక్ సిఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ వర్సిటీకి నిధులు కేటాయింపు

## సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు: వీసీ ప్రొ. చక్రపాణి

హైదరాబాద్, మనం ప్రతినిధి : అంబేద్కర్ వర్సిటీ అభివృద్ధికి తాజా బడ్జెట్లో నిధుల కేటాయింపునకు సంబంధించి వీ.సీ ప్రొ.ఘంటా చక్రపాణి, వర్సిటీ అన్ని విభాగాల డైరెక్టర్లు ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అంబేద్కర్ అంతర్జాతీయ పరిశోధనా కేంద్రం భవన నిర్మాణం కోసం రూ. 100 కోట్లు, పలు అభివృద్ధి పనుల కోసం రూ. 50 కోట్ల గ్రాంటును, అదేవిధంగా ఉద్యోగుల జీత భత్యాల కోసం రూ. 24.30 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ సందర్భంగా సోమవారం నాడు యూనివర్సిటీలో నిర్వహించిన అన్ని విభాగాల అధిపతుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి డా.యోగితా రాణా, ఐఏఎస్లకు ధన్యవాదాలు తెలిపారు.

ఈ నిధులను విద్యార్థులకు ఉపయోగపడేలా మౌళిక వసతుల కల్పనకు ఉపయోగించనున్నట్లు వీసీ ప్రొ.ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ డా. ఎల్వీకే రెడ్డి పేర్కొన్నారు.

# సోమవారం ప్రజావాణికి 41 దరఖాస్తుల స్వీకరణ

- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్....



ఉమ్మడి మహబూబ్ నగర్ మార్చి 30 (మనం బ్యూరో): సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు జీవి శ్యాంప్రసాద్ లాల్, రెవెన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ తో కలిసి హాజరై ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఎంతైనా ఉందన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 41 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

# తెలంగాణలో కాంగ్రెస్ కబ్జాల పర్వం: కేటీఆర్



హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ భూ కబ్జాల పర్వం కొనసాగిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో సోమవారంనాడు ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

వట్టినాగులపల్లిలో సతీష్ షా కుటుంబానికి చెందిన 27 ఎకరాల భూమిపై మంత్రి పొంగులేటి కన్ను పడిందని కేటీఆర్ ఆరోపించారు. సుమారు రూ. 1,400 కోట్ల విలువ చేసే ఈ భూమిని దక్కించుకోవడానికి జేసీబీలతో వచ్చి గోశాలను, కాంపౌండ్ వాల్ను కూల్చివేశారని మండిపడ్డారు. భూమి ఇవ్వకపోతే సజీవంగా పాతిపెడతామని బాధితులను బెదిరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు రక్షణ కల్పించిన నిజాయతీ గల పోలీస్ అధికారి అజీబుల్లా ఖాన్ను మరుసటి రోజే బదిలీ చేయడం ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు నిదర్శనమని విమర్శించారు.

రాష్ట్ర వ్యాప్తంగా కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కేటీఆర్ ఆరోపించారు. నిజాం కాలం నాటి భూములను కూడా ఈ జాబితాలోకి చేర్చి, రైతులను భయాందోళనలకు గురిచేసి, భూములు గుంజుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు త్వరలోనే గవర్నర్ను కలుస్తామని, అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

కాగా, మంత్రి పొంగులేటి అక్రమ మైనింగ్, భూ కుంభకోణాలపై కేవలం సీబీసీఐడీ విచారణ సరిపోదని, వెంటనే సభా సంఘాన్ని (హౌస్ కమిటీ) వేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మంత్రి పదవిలో ఉంటే విచారణ నిష్పక్షపాతంగా జరగదని... పొంగులేటి తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీబీసీఐడీ విచారణ పేరుతో మంత్రిని కాపాడే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. ఇదే సమయంలో పోలీసులకు కేటీఆర్ హెచ్చరికలు జారీ చేశారు. 'పాలకుల ఒత్తిడికి లొంగి అక్రమాలకు సహకరిస్తే భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదు' అని హెచ్చరించారు. అక్రమాలకు అండగా నిలవవద్దని, ప్రజల పక్షాన ఉండాలని పోలీసులను కోరారు. బాధితుల పేర్లు బయటపెట్టకుండా బీఆర్ఎస్ లీగల్ సెల్ ద్వారా వారికి ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. భూ కబ్జాలకు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఈ పర్యటనలో కేటీఆర్ వెంట పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.




# దాతలు ఇచ్చిన డబ్బులు స్వాహా చేసిన ధర్మకర్తలపై చర్యలు తీసుకోవాలి

రంగారెడ్డి మార్చి 30 (మనం న్యూస్) కర్మన్ ఘాట్ ధ్యానాంజనేయ ఆలయ అభివృద్ధి కోసం పలువురు దాతలు ఇచ్చిన డబ్బులను అభివృద్ధి ఖర్చు చేయకుండా ధర్మకర్తలు తమ సొంత ఖర్చులకు వాడుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆలయ ఈవో లావణ్య కు స్థానిక ధ్యానాంజనేయ భక్తులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ సిబ్బందిపై కొంతమంది ధర్మకర్తలు అజమాయిసు చేస్తూ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని అన్నారు. ఆలయంలో పార్కింగ్ నిర్వహిస్తున్న నిర్వాహకుని దగ్గర, కొబ్బరి చిప్పలు సేకరించుకున్న నిర్వాహకుల దగ్గర పలువురు ఆలయ అర్చకుల పై ఒత్తిడి చేసి డబ్బులు వసూలు చేసిన విషయాన్ని కూడా తమ దృష్టికి వచ్చిందని ఫిర్యాదును పేర్కొన్నారు. అభివృద్ధికి భక్తులకు వ్యతిరేకంగా వివరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఐజేయు జాతీయ ఉపాధ్యక్షులుగా వై నరేందర్ రెడ్డి



రంగారెడ్డి మార్చి 30 (మనం న్యూస్)ఫ జర్నలిస్ట్ లకు అన్ని విధా లుగా అండగా ఉంటానని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ ఉపాధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన వై నరేందర్ రెడ్డి అన్నారు. ఐజెయు జాతీయ ఉపాధ్యక్షులుగా ఎన్నికైనా వై నరేందర్ రెడ్డి ఎల్బీనగర్ వనస్థలిపురం లో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రంగారెడ్డి యూనిట్, ఎల్ బీ నగర్ నియోజకవర్గ జర్నలిస్టుల తరపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి ఐజెయు నిరంతరం పోరాడుతుందన్నారు. జర్నలిస్టుల సమస్యలపై జాతీయ స్థాయిలో గలమెత్తుతామని అన్నారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టు యూనియన్ జాతీయ కార్యవర్గంలో రంగారెడ్డి జిల్లాకు పెద్దపీట దక్కిం దన్నారు. నరేందర్ రెడ్డి జాతీయ ఉపాధ్యక్షులుగా ఎన్నిక కావటం మనకు గర్వకారణమన్నారు.జిల్లా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ సలీమ్ పాషా, మేకల సత్యనారాయణలు మాట్లాడుతూ జాతీయ కమిటీలో రంగారెడ్డి జిల్లాకు అత్యంత ప్రముఖమైన స్థానం కల్పించిన ఐజేయూ నాయకత్వానికి ధన్యవాదములు తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు జాతీయ కౌన్సిల్ సభ్యులకు, వివిధ రాష్ట్రాల అధ్యక్ష కార్యదర్శులకు ధన్యవాదములు తెలిపారు.జిల్లా జర్నలిస్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు ప్రవీణ్ కుమార్, శివకుమార్, జిల్లా కోశాధికారి శశిపాల్ రెడ్డి, ఆరోగ్య శిబిరం కన్వీనర్ రాచ శేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్యామ్ ప్రసాద్, బెల్లిమల్లేష్ యాదవ్,సీనియర్ జర్నలిసులు కిసరి మల్లేష్ గౌడ్, వెంపటి గణేష్, శ్రీనివాస్, రఫీ, చంద్రశేఖర్ గౌడ్, రాజశేఖర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# జోనల్ కార్యాలయాన్ని మార్చాలి

రంగారెడ్డి మార్చి 30 (మనం న్యూస్) ఎల్బీనగర్ జోనల్ కార్యాలయాన్ని సరూర్ నగర్ సర్కిల్ కార్యాలయంలోకి వెంటనే మార్చాలని సోమవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ ని సరూర్ నగర్ డివిజన్ కాలనీ సంక్షేమ సంఘాల జేఏసీ చైర్మన్ బేర బాలకిషన్, సరూర్ నగర్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ ఆకుల అరవింద్ కుమార్, కర్మన్ ఘాట్ హనుమాన్ టెంపుల్ మాజీ డైరెక్టర్ బబ్బురి ఆనంద్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరూర్ నగర్ , ఎల్బీనగర్ , హయత్ నగర్ సర్కిల్ నాగోల్( పెద్ద అంబర్పేట్ ) సర్కిల్ ప్రజలకు ప్రస్తుతం చైతన్యపురి మెట్రో స్టేషన్ సమీపంలో ఉన్న జోనల్ కార్యాలయం చిన్నదిగా ఉండటం వల్ల పార్కింగ్ సౌకర్యం లేకపోవడం వల్ల.సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు కష్టాలు ఎదురవుతున్నాయని అన్నారు. నాలుగు సర్కిళ్ల ప్రజలకు జోనల్ కార్యాలయం సరూర్ నగర్కు మార్చడం వల్ల అందరికీ అందుబాటులో ఉంటుం దని. జోనల్ అధికారుల రివ్యూ మీటింగ్ లో కూడా సరూర్ నగర్ సర్కిల్ కార్యాలయం పూర్తిగా అందుబాటులో ఉంటుందని వెంటనే జోనల్ కార్యాలయాన్ని సరూర్ నగర్ కు మార్చాలని వారు జోనల్ కమిషనర్ కు వివరించారు.

## 'తిరుగుబాటు' ఓ హెచ్చరిక..!

కొన్ని తరాలు..నిశ్శబ్దంగా తరలిపోవచ్చు
కొన్ని దేశాలు
నిర్మలంగా నిద్రపోవచ్చు
కొన్ని పాలనలు అలవోకగా
చరిత్రలో కీర్తికెక్కవచ్చు
కానీ.... కొన్ని తిరుగుబాట్లు
హెచ్చరికలను జారీ చేసి వెళ్ళిపోతాయి
కారణం చిన్నదైనా..పెద్దదైనా..
కాలం నత్తనడకల ఆనవాళ్లను చించుకొని
వేగపు పిడికిళ్లను ఎత్తుకుంటుంది
కొన్ని జనరేషన్లు అంతే..
ఇప్పుడు జనం యుద్ధ విముక్త ప్రపంచాన్ని
తనువెల్లా..మనసెల్లా స్వాగతిస్తున్నారు
కొత్తతరం ఇప్పుడు
ఉడుకు నెత్తుర్ల ఊపును నింపుకుంది
అధికార పెత్తనాలనూ ..మోసాలనూ
ఉపేక్షించే నైజాన్ని వొదిలేసింది
బీభత్సం సమైక్య నినాదమైన చోట
అన్నీ అదుపుతప్పి పోతాయి
రాజ్యాంగాన్ని మార్చాల్సి రావొచ్చు
ఆస్తుల్ని జాతీయం చెయ్యాల్సి రావొచ్చు
కర్ఫ్యూలూ ఆందోళనలూ...
నిషేధాలూ.. సడలింపులూ...
వెర్రిచేష్టల్లా వెక్కిరించవచ్చు
అవినీతి..బంధుప్రీతి ఆంక్షల ఉక్కు పాదాలకు
సామాన్యుడు సైతం ఉగ్రుడైపోవచ్చు
నేతలైనా..అధినేతలైనా
ప్రాణభయంతో పారిపోవాల్సి రావొచ్చు
నిరుద్యోగ ఆకళ్ళు నినాదాలు కావచ్చు
సంస్కరణలు చేపట్టే లోపే
వ్యవస్థలు నిట్టనిలువుగా కూలిపోవచ్చు
అది అగ్రరాజ్య అమెరికా ఐనా
వంత పాడిన ఇజ్రాయిల్ ఐనా...
నో కింగ్స్ నిరసనై పెళ్ళుబుకుతుంది
మూర్ఖపు యుద్ధాన్ని ఎండగట్టి
ప్రజాస్వామ్య నినాదాలు గగన మెక్కుతాయి
నియంతలకు గుణపాఠాలు నేర్పుతాయి
సందర్భాన్ని బట్టి సమరాన్ని బట్టి
పిల్లులు పులులవుతుంటాయి
ఆగ్రహం పెల్లుబికి నప్పుడు
ఏ రాజ్యాంగ సూత్రాలూ నిలువరించవూ..
తస్మాత్ జాగ్రత్త..!

**- డా. కటుకోఝ్వల రమేష్**
9949083327

# వ్యవసాయం సంక్షేమంతో ముందుకు..

భారతదేశంలో వ్యవసాయ రంగం గ్రామీణ జనజీవనానికి, దేశ ఆర్థిక స్థిరత్వానికి మరియు ఆహార భద్రతకు ప్రధాన మూలస్తంభంగా నిలుస్తోంది. దేశ స్థూల విలువలో సుమారు 20 శాతం వాటా కలిగి ఉండటంతో పాటు, సుమారు 46.1 శాతం కార్మికులకు ఉపాధి కల్పిస్తూ, దాదాపు 55 శాతం జనాభాకు జీవనాధారంగా ఉంది. గత ఐదు సంవత్సరాల్లో ఈ రంగం సగటు 4.4 శాతం వృద్ధిని నమోదు చేయడం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాంకేతిక వినియోగం మరియు స్థిరమైన ఉత్పత్తి విధానాల ఫలితంగా సాధ్యమైంది. రైతుల సంక్షేమానికి అనేక ప్రభుత్వ పథకాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, మరియు స్థిరమైన వ్యవసాయ విధానాలు ఈ పురోగతికి బలంగా నిలిచాయి.

2024-25 వ్యవసాయ సంవత్సరంలో భారత్ 357.73 మిలియన్ మెట్రిక్ టన్నుల ఆహార ధాన్య ఉత్పత్తిని సాధించి కొత్త రికార్డు సృష్టించింది. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 25.43 మిలియన్ టన్నుల పెరుగుదల. బియ్యం, గోధుమలు, మొక్కజొన్న వంటి ప్రధాన ధాన్యాల ఉత్పత్తి పెరుగుదలతో పాటు, చిరుధాన్యాల ప్రోత్సాహం కూడా ఈ వృద్ధికి దోహద పడింది. దీని ఫలితంగా 18.59 మిలియన్ టన్నుల చిరు ధాన్యాల ఉత్పత్తి నమోదైంది.



తోటపంటల (హార్టికల్చర్) రంగం కూడా వేగంగా అభివృద్ధి చెందుతోంది. 2024-25లో ఈ రంగం 362.08 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించింది. ఇందులో 114.51 మిలియన్ టన్నుల పండ్లు, 219.67 మిలియన్ టన్నుల కూరగాయలు ఉన్నాయి. ఇది అధిక విలువ కలిగిన పంటల వైపు భారత వ్యవసాయం మారుతున్నదనడానికి స్పష్టమైన సంకేతం.

ప్రపంచ వ్యవసాయ మార్కెట్లో కూడా భారత్ తన స్థానాన్ని బలోపేతం చేసుకుంటోంది. 2020లో 34.5 బిలియన్ డాలర్లుగా ఉన్న వ్యవసాయ ఎగుమతులు, 2025 నాటికి 51.1 బిలియన్ డాలర్లకు పెరిగాయి. మొత్తం ఎగుమతుల్లో వ్యవసాయ ఉత్పత్తుల వాటా 11.2 శాతంగా నమోదైంది. ముఖ్యంగా ప్రాసెస్ చేయబడిన ఆహార ఉత్పత్తుల ఎగుమతులు 14.9 శాతం నుండి 20.4 శాతానికి పెరగడం, విలువ ఆధారిత వ్యవసాయం వైపు దేశం అడుగులు వేస్తున్నదనడానికి నిదర్శనం. బియ్యం, గోధుమలు, మసాలాలు, టీ, కాఫీ వంటి ఉత్పత్తులలో భారత్ అగ్రస్థానంలో ఉంది.

దేశంలో బియ్యం, గోధుమల ఉత్పత్తి కూడా గణనీయంగా పెరిగింది. 2024-25లో 150.18 మిలియన్ టన్నుల బియ్యం, 117.94 మిలియన్ టన్నుల గోధుమలు ఉత్పత్తి అయ్యాయి. పప్పు దినుసుల ఉత్పత్తి 25.68 మిలియన్ టన్నులకు చేరింది. ఉత్తరప్రదేశ్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు బియ్యం ఉత్పత్తిలో ముందుండగా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్ గోధుమల ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్నాయి. పండ్ల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు, కూరగాయల ఉత్పత్తిలో ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి.

ఇతర అధిక విలువ కలిగిన పంటల ఉత్పత్తి కూడా గణనీయంగా పెరిగింది. చెరకు ఉత్పత్తి 454.61 మిలియన్ టన్నులు, పత్తి 5.05 మిలియన్ టన్నులు, టీ 1.203 మిలియన్ టన్నులు, మసాలాలు 12 మిలియన్ టన్నులు, కొబ్బరి 21.3 బిలియన్ గింజలు, కాఫీ 0.36 మిలియన్ టన్నులుగా నమోదయ్యాయి. ఇవి దేశ వ్యవసాయ వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు కూడా పెరుగుతున్నాయి. 2013-14లో రూ.21,933 కోట్లుగా ఉన్న వ్యవసాయ బడ్జెట్, 2025-26లో రూ.1,27,290 కోట్లకు, 2026-27లో రూ.1,30,561 కోట్లకు పెరిగింది. ఇది రైతుల సంక్షేమం మరియు వ్యవసాయ అభివృద్ధిపై ప్రభుత్వ దీర్ఘకాలిక దృష్టిని స్పష్టంగా తెలియజేస్తోంది. సాంకేతికత, మెరుగైన విత్తనాలు, నీటి నిర్వహణ, స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై ప్రత్యేక దృష్టి పెట్టబడింది.

స్థిరమైన వ్యవసాయం కోసం మట్టి ఆరోగ్యం, నీటి నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వబడింది. ఇప్పటివరకు 25.55 కోట్ల సాయిల్ హెల్త్ కార్డులు రైతులకు పంపిణీ చేయబడ్డాయి. దేశంలో సాగు భూమిలో 55.8 శాతం నీటి పారుదల సౌకర్యం కల్పించబడింది. 6.85 లక్షల సీడ్ విలేజ్లు ఏర్పాటు చేయబడ్డాయి. వ్యవసాయ రుణాలు రూ.28.67 లక్షల కోట్లకు చేరగా, 7.72 కోట్ల కిసాన్ క్రెడిట్ కార్డు ఖాతాలు ఉన్నాయి. యంత్రీకరణ కోసం 27,554 కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేయబడ్డాయి.

సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు 6.39 లక్షల హెక్టార్లలో సాగు జరుగుతుండగా, 15.79 లక్షల మంది రైతులు ఇందులో భాగస్వాములయ్యారు. కిసాన్ కాల్ సెంటర్ల ద్వారా రైతుల సందేహాలకు సమాధానాలు అందించబడుతూ, ఇప్పటివరకు 30.65 లక్షల ప్రశ్నలకు స్పందించారు.

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు భద్రతా పథకాలను అమలు చేస్తోంది. కనీస మద్దతు ధర ఉత్పత్తి ఖర్చు కంటే 1.5 రెట్లు నిర్ధారించబడింది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద రూ.4.27 లక్షల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయబడ్డాయి. ప్రధానమంత్రి కిసాన్ మాన్ ధన్ యోజనలో 24.95 లక్షల మంది రైతులు చేరగా, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా 4.19 కోట్ల రైతులు బీమా రక్షణ పొందారు. రూ.1.90 లక్షల కోట్లకు పైగా క్లెయిమ్లు చెల్లించడం రైతులకు పెద్ద ఉపశమనంగా నిలిచింది.

వ్యవసాయ మార్కెటింగ్ మరియు విలువ గొలుసును బలోపేతం చేసేందుకు సహకార వ్యవస్థలను అభివృద్ధి చేశారు. దేశవ్యాప్తంగా 67,930 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కంప్యూటరీకరించబడ్డాయి. 18,183 కొత్త సహకార సంఘాలు ఏర్పడ్డాయి. నిల్వ సదుపాయాల కోసం 500 కొత్త గోదాములు నిర్మించబడుతున్నాయి. ఈ-నామ్ వంటి డిజిటల్ మార్కెట్ వేదికలు రైతులకు మెరుగైన ధరలు పొందేందుకు సహాయపడుతున్నాయి.

ముగింపుగా, భారత వ్యవసాయం ఇప్పుడు కేవలం ఉత్పత్తి పెంపుపైనే కాకుండా, స్థిరత్వం, సాంకేతికత, విలువ ఆధారిత వృద్ధి మరియు రైతుల సంక్షేమంపై దృష్టి సారిస్తోంది. పొలం నుంచి మార్కెట్ వరకు అనే సమగ్ర దృక్పథంతో దేశం ముందుకు సాగుతోంది.

రికార్డు స్థాయి ఉత్పత్తి, పెరుగుతున్న ఎగుమతులు, రైతులకు అందుతున్న ఆర్థిక భద్రత, మెరుగైన మౌలిక సదుపాయాలు-ఇవి భారత వ్యవసాయం భవిష్యత్తు మరింత ప్రకాశవంతంగా ఉందని సూచిస్తున్నాయి. స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, వాతావరణ అనుకూలత, మరియు డిజిటల్ సాంకేతికతలతో ఈ రంగం దేశ ఆర్థిక వృద్ధికి, గ్రామీణాభివృద్ధికి కీలకంగా నిలవనుంది.

**- డా. ఏలూరి యాదయ్య**

# అభివృద్ధికి జనాభా విధానాల బలోపేతం



ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి గౌరవనీయులు ఎన్. చంద్రబాబు భారతదేశంలో తొలిసారిగా జనాభా నిర్వహణ విధానానికి సంబంధించి ఒక చిత్తు ప్రతి (డ్రాఫ్ట్) ప్రవేశపెట్టారు. గతంలో కుటుంబ నియంత్రణను ప్రోత్సహించిన రాష్ట్ర విధానాలకు భిన్నంగా, ఈ కొత్త విధానం కుటుంబాలు ఎక్కువ మంది పిల్లలను కనడానికి ప్రోత్సాహకాలను అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విధానం ప్రస్తుతం ఒక నెలపాటు ప్రజాభిప్రాయం కోసం అందుబాటులో ఉంచబడింది. దీనిని 2026 ఏప్రిల్ 1 నుండి అమలు చేయాలని నిర్ణయించారు. జనాభా నిర్వహణ విధానం అనేది ప్రభుత్వాలు జనాభా పరిమాణం, వృద్ధిరేటు పంపిణీని నియంత్రించడానికి అనుసరించే వ్యూహాలు చర్యలను సూచిస్తుంది. దీని ప్రధాన లక్ష్యాలు ఆర్థిక అభివృద్ధి, వనరుల సమతుల్యత, జీవన ప్రమాణాలు, సామాజిక సంక్షేమాన్ని మెరుగుపరచడం. ఈ విధానాలు దేశ అవసరాల ఆధారంగా జనాభా వృద్ధిని తగ్గించే (ఆంటీ-నాటలిస్ట్) లేదా పెంచే (ప్రో-నాటలిస్ట్) లక్ష్యాలతో రూపొందించబడతాయి. ఉదాహరణకు, చైనా వేగంగా పెరుగుతున్న జనాభాను నియంత్రించడానికి ఒక్కరే చాలు విధానాన్ని అమలు చేసింది. జనాభా నియంత్రణ భావన థామస్ రాబర్ట్ మాల్థస్ ప్రతిపాదించిన మాల్థుసియన్ జనాభా సిద్ధాంతంతో సంబంధం కలిగి ఉంది. ఆయన ప్రకారం, జనాభా గణిత శ్రేణిలో పెరుగుతుంటే, ఆహార ఉత్పత్తి సరళ శ్రేణిలో మాత్రమే పెరుగుతుంది. ప్రస్తుతం భారతదేశం మధ్యంతర దశ (అధిక జననాల రేటు -తక్కువ మరణాల రేటు)లో ఉండగా, జపాన్ చివరి దశలో తక్కువ జనాభా వృద్ధితో ఉంది.



జనాభా నిర్వహణ విధానాల ఆర్థిక ప్రయోజనాలను ప్రపంచ స్థాయి గణాంకాలు బలంగా సమర్థిస్తున్నాయి. మొదటగా, నియంత్రిత జనాభా వృద్ధి డెమోగ్రాఫిక్ డివిడెండ్ను సృష్టిస్తుంది, అంటే పని చేయగల వయస్సు గల జనాభా శాతం పెరుగుతుంది. ఉదాహరణకు చైనా 1980-2015 మధ్య తన జనాభా నియంత్రణ విధానాల వల్ల భారీగా లాభపడింది. ఈ కాలంలో పని వయస్సు గల జనాభా సుమారు 70%కి పెరిగి, దేశం సంవత్సరానికి సగటున 9-10% స్థూల దేశీయోత్పత్తి(జిడిపి) వృద్ధిని సాధించింది. అలాగే, దక్షిణ కొరియా 1960లలో బలమైన కుటుంబ నియంత్రణ విధానాలను అమలు చేసింది. దాంతో వ్యక్తిగత ఆదాయం 200 డాలర్ల కన్నా తక్కువ నుంచి 30,000 డాలర్లకు పైగా పెరిగింది. భారత దేశంలో కూడా కుటుంబ నియంత్రణ కార్యక్రమాల వల్ల జనన రేటు 1950లలో 5.9 నుంచి ప్రస్తుతం సుమారు 2.0కి తగ్గింది. ప్రస్తుతం సుమారు 65% జనాభా పని వయస్సులో ఉండటం వల్ల స్థూల దేశీయోత్పత్తి వృద్ధికి, కార్మిక శక్తి విస్తరణకు దోహదపడుతోంది. ఉదాహరణకు, నైజీరియాలో జనన రేటు సుమారు 5.3గా ఉండి, ఆర్థిక అవకాశాలు ఉన్నప్పటికీ నిరుద్యోగం, వనరులపై ఒత్తిడి వంటి సమస్యలు పెరిగి, వ్యక్తిగత ఆదాయం పెరుగుదల పరిమితం అవుతోంది. అయితే, అతిగా జనాభా నియంత్రణ కూడా సమస్యలను సృష్టించవచ్చు. జపాన్ జర్మనీ వంటి దేశాలలో వరుసగా 28% మరియు 22% జనాభా 65 సంవత్సరాలకు పైబడినవారే ఉండటం వల్ల కార్మిక లోటు, పెన్షన్ భారం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఆంధ్రప్రదేశ్లో జనాభా విధానం గురించి ముఖ్యమైన వ్యాఖ్యలు చేశారు. ఆయన ప్రకారం, జనాభాను భారంగా కాకుండా ఆర్థిక ఆస్తిగా చూడాలి. అభివృద్ధి చెందిన దేశాలు ప్రస్తుతం వృద్ధ జనాభా, కార్మిక లోప సమస్యలను ఎదుర్కొంటున్నాయని, భారతదేశం ఆ తప్పులను పునరావృతం చేయకూడదని ఆయన సూచించారు. చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రతిపాదించిన జనాభా విధానం ఆంధ్రప్రదేశ్ ఆర్థిక అభివృద్ధికి ఎంతో ఉపయోగకరంగా ఉండగలదు. ఇది రాష్ట్రంలో తగ్గుతున్న జనాభా వృద్ధి, భవిష్యత్తులో కార్మిక లోప సమస్యను నేరుగా పరిష్కరించడంపై దృష్టి పెడుతుంది. రాష్ట్రంలో మొత్తం ఫర్టిలిటీ రేటు 1993లో 3.0 నుండి ప్రస్తుతం సుమారు 1.5కి పడిపోయింది. ఈ ధోరణి కొనసాగితే, పని వయస్సు గల జనాభా తగ్గి ఉత్పాదకత ఆర్థిక వృద్ధి దెబ్బతింటాయి. రెండవ/మూడవ పిల్లల కోసం ₹25,000 ప్రోత్సాహకం నెలవారీ సహాయం వంటి చర్యల ద్వారా ఈ విధానం జననాలను పెంచి స్థిరమైన కార్మిక శక్తిని కల్పించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం కేవలం 9% కుటుంబాలు మాత్రమే రెండు పిల్లలకంటే ఎక్కువ పిల్లలను కలిగి ఉండగా, 58% కుటుంబాలు ఒక పిల్లతోనే ఆగిపోతున్నాయి. తక్కువ ఫర్టిలిటీ కొనసాగితే 2047 నాటికి సుమారు 23% జనాభా వృద్ధులుగా మారే అవకాశం ఉంది. ఇది పెన్షన్ ఆరోగ్య ఖర్చులను పెంచి ఆర్థిక వృద్ధిని మందగింప జేస్తుంది. ఇప్పుడే జననాలను పెంచడం ద్వారా యువ-వృద్ధ జనాభా సమతుల్యతను కాపాడవచ్చు. నాలుగవది, జనాభా పెరుగుదల ఆర్థిక విస్తరణకు మద్దతు ఇస్తుంది. పెద్ద కార్మిక శక్తి పరిశ్రమలను ఆకర్షించి ఉత్పత్తిని పెంచుతుంది.

ఆంధ్రప్రదేశ్లో జనాభా పెంచే ప్రో-నేటలిస్టు విధానానికి వ్యతిరేకంగా అనేక అంశాలు ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం ఫర్టిలిటీ రేటు ఇప్పటికే 1.5గా తక్కువగా ఉన్నప్పటికీ, ఇది మెరుగైన విద్య, పట్టణీకరణ అభివృద్ధి ఫలితంగా ఏర్పడింది కాబట్టి దీన్ని తిరిగి పెంచాల్సిన అవసరం లేదని భావిస్తున్నారు. అదనపు పిల్లల కోసం ₹25,000 వంటి ప్రోత్సాహకాలు ఇవ్వడం రాష్ట్ర బడ్జెట్ భారం పెంచవచ్చు. ముఖ్యంగా సంక్షేమ ఖర్చులు ఇప్పటికే ఎక్కువగా ఉన్న సందర్భంలో. సుమారు 58% కుటుంబాలు ఒకే పిల్లతో ఆగిపోవడం చిన్న కుటుంబాలపై సమాజంలో ఉన్న బలమైన అభిరుచిని చూపిస్తుంది, అందువల్ల విధానం ప్రజల ప్రవర్తనను పెద్దగా మార్చకపోవచ్చు. ప్రస్తుతం మహిళల ఉద్యోగాల్లో పాల్గొనడం కేవలం 31% మాత్రమే ఉండటం వల్ల, జననాల పెంపు కంటే ఉపాధి అవకాశాల పెంపుపై దృష్టి పెట్టడం అవసరం. తక్కువ ఫర్టిలిటీ అనేది పట్టణీకరణ, అధిక ఆదాయం, విద్య వంటి అభివృద్ధి సూచికల ఫలితమేనని నిపుణులు చెబుతున్నారు. అదనంగా, జనాభా పెరుగుదల నీరు, గృహాలు, ఆరోగ్య వసతుల వంటి పరిమిత వనరులపై ఒత్తిడిని పెంచవచ్చు. రాష్ట్రంలో ఇప్పటికే సంవత్సరానికి సుమారు 6.7 లక్షల జననాలు నమోదవుతున్నాయి కాబట్టి వేగంగా జనాభా పెరిగితే ప్రజా సేవలపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉంది. అందువల్ల, జనాభా పెంపు కంటే నైపుణ్యాభివృద్ధి, ఉత్పాదకత పెంపు, వృద్ధాప్య సంరక్షణపై దృష్టి పెట్టడం దీర్ఘకాలికంగా మరింత స్థిరమైన పరిష్కారంగా నిపుణులు సూచిస్తున్నారు. అవగాహన ఆధారిత విధానాలు దీర్ఘకాలంలో మంచి ఫలితాలను ఇస్తాయి. సమగ్ర అభివృద్ధిని ఆధారంగా చేసుకున్న వ్యూహమే ఆంధ్రప్రదేశ్కు అనుకూలమైన జనాభా నిర్వహణ మార్గం.

**- డాక్టర్. పి.ఎస్. చారి**
8309082823

# కంచే చేను మేస్తే కాపాడేదెవరు?



నిర్మల్ జిల్లా నుండి నారాయణపేట వరకు నేడు ప్రభుత్వ పాఠశాలలు విద్యాబుద్ధులు నేర్పే ఆలయాలుగా కాకుండా కొందరు కామ పిశాచాల క్రీడా రంగాలుగా మారుతుండటం సభ్య సమాజం తల దించుకోవాల్సిన విషయం. మెరుగైన సమాజ నిర్మాణంలో మూలస్తంభాలుగా ఉండాల్సిన ఉపాధ్యాయులే నైతికతను విస్మరించి రాక్షసుల్లా ప్రవర్తిస్తుంటే రేపటి తరం భవిష్యత్తు ఏమైపోవాలి అన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువులే దారి తప్పి తండ్రి తర్వాత తండ్రి లాంటి హోదాలో ఉండి అభం శుభం తెలియని చిన్నారుల జీవితాలతో చెలగాటమాడుతుండటం అత్యంత ఘోరం. నారాయణపేట జిల్లా మద్దూరు ప్రభుత్వ పాఠశాలలో చోటుచేసుకున్న ఘటన ఉపాధ్యాయ వృత్తికే మాయని మచ్చగా మిగిలింది. విలువలు నేర్పాల్సిన టీచర్ స్వామి కంప్యూటర్ ల్యాబ్లో చదువు కుంటున్న పదో తరగతి విద్యార్థిని పట్ల ప్రవర్తించిన తీరు అత్యంత హేయమైనది. తెలిసీ తెలియని ఆ వయస్సులో ఏవైనా పొరపాట్లు జరిగితే తప్పు అని చెప్పాల్సిన వ్యక్తే ఆ బాలికను అమాంతం ముద్దు పెట్టుకుని తన కామవాంఛను తీర్చుకోవాలని చూడటం అమానుషం. సీసీటీవీ ఫుటేజీలో ఈ స్వామి అసభ్య ప్రవర్తన బయట పడటంతో డీఈఓ సస్పెన్షన్ వేటు వేశారు కానీ కేవలం సస్పెన్షన్ చేస్తే సరిపోతుందా అన్నదే నేడు అసలైన ప్రశ్న.



ఇలాంటి ఘటనలు ఒక్క నారాయణపేటకే పరిమితం కాలేదు. గతంలో నిర్మల్ జిల్లా నర్సాపూర్ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు విద్యార్థినుల పట్ల కీచక పర్వం సాగించి పోక్సో కేసులకు గురయ్యారు. తాజాగా నిర్మల్ రూరల్ పరిధిలోని కొండాపూర్ పాఠశాల విద్యార్థినులపై కూడా ఒత్తిడి తెచ్చి లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదైంది. కుబీర్ మండలంలోనూ ఇలాంటి ఛాయలే గతంలో వెలుగుచూశాయి. వరుసగా ఇన్ని ఉదంతాలు వెలుగుచూస్తున్నాయంటే కీచక గురువులకు చట్టం అన్నా వ్యవస్థ అన్నా భయం లేకుండా పోయిందని స్పష్టమవుతోంది. కంచే చేను మేసినట్లుగా ప్రభుత్వ పాఠశాలలను దేవుడి గుడిలా కాపాడాల్సిన ఉపాధ్యాయులే భక్షకులుగా మారుతుంటే ఇక పేద విద్యార్థులు ఎవరికి మొరపెట్టుకోవాలి.

సాధారణంగా ఇలాంటి అకృత్యాలు జరిగినప్పుడు విద్యాశాఖ తక్షణమే సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసి చేతులు దులుపుకుంటుంది. కానీ సస్పెన్షన్ అంటే అది శిక్ష కాదు కేవలం విచారణ పూర్తయ్యే వరకు విధులకు దూరం పెట్టడం మాత్రమే.

పోక్సో కేసులు పెట్టినా కొన్నాళ్లకు బెయిల్ మీద బయటకు వచ్చి కోర్టుల్లో ఏళ్ల తరబడి సాగే విచారణను అడ్డం పెట్టుకుని రాజకీయ పైరవీలతో మళ్ళీ అదే ఉద్యోగాల్లోకి చేరుతున్న దాఖలాలు మన కళ్లముందే ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగం నుండి పూర్తిగా రిమూవ్ చేస్తే తప్ప ఇలాంటి వారికి బుద్ధి రాదు.

ఒక విద్యార్థిని జీవితంతో ఆడుకున్న వ్యక్తికి మళ్ళీ ఉపాధ్యాయుడిగా కొనసాగే అర్హత లేదని చట్టాలు గట్టిగా చెప్పాలి. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేది అత్యధికంగా పేద బహుజన వర్గాల పిల్లలే. తల్లిదండ్రులు తమ పిల్లలు కష్టపడి చదువుకుని ప్రయోజకులు అవుతారని నమ్మి పంపిస్తుంటే అక్కడ కామ పిశాచాలు కాచుకుని కూర్చున్నాయన్న భయం ఇప్పుడు తల్లిదండ్రులను వెంటాడుతోంది.

ఇలాంటి ఘటనల వల్ల ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు వెళ్లడానికే భయపడే పరిస్థితి ఏర్పడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖ ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించకుండా ప్రతి పాఠశాలలో విద్యార్థినుల రక్షణ కోసం ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలి. కేవలం సీసీటీవీలు ఉంటే సరిపోదు వాటి ఫుటేజీని ప్రతిరోజూ పర్యవేక్షించే జవాబుదారీతనం ఉండాలి.

నారాయణపేట స్వామి అయినా నిర్మల్ కీచక గురువులైనా ఎవరైనా సరే విచారణను వేగవంతం చేసి వారిని కఠిన కారాగారానికి పంపాలి. పోక్సో చట్టం కింద కఠిన శిక్షలు పడేలా చూడటమే కాకుండా వారిని ప్రభుత్వ సర్వీసు నుండి శాశ్వతంగా బహిష్కరించాలి. అప్పుడే మరో ఉపాధ్యాయుడు విద్యార్థినుల వైపు కన్నెత్తి చూడటానికి భయపడతాడు. గురువు అనే పదానికి గౌరవం దక్కాలంటే ఈ రాక్షసులను విద్యా వ్యవస్థ నుండి తరిమికొట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మన చట్టాలు కూడా దోషులను రక్షించే విధంగా ఉండకూడదు. బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలి. కేవలం అక్షరాలు నేర్పడం మాత్రమే కాదు నైతిక విలువల ప్రాతిపదికన ఉపాధ్యాయుల నియామకం జరగాలి. ఏ ఒక్క ఉపాధ్యాయుడి ప్రవర్తన కూడా అనుమానాస్పదంగా ఉన్నా వెంటనే చర్యలు తీసుకునే హక్కు విద్యార్థినులకు వారి తల్లిదండ్రులకు ఉండాలి. సమాజంలో గురువుకు ఉన్న ఉన్నతమైన స్థానాన్ని కొందరు కామాంధులు నాశనం చేస్తుంటే మిగిలిన ఉపాధ్యాయ లోకం మౌనంగా ఉండటం కూడా నేరమే.

కీచక గురువుల అరాచకాలపై గొంతెత్తి పోరాడాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది. ఈ వ్యవస్థను ప్రక్షాళన చేయకపోతే భావి భారత పౌరులను తీర్చిదిద్దాల్సిన విద్యాలయాలు అంధకారంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. అప్పుడే ఆ చిన్నారులకు నిజమైన న్యాయం జరుగుతుంది విద్యాలయాల్లో చదువుల వెలుగు నిండుతుంది.

**- వెంక గారి భూమయ్య**
9848559863

# ఇరాన్ షరతులు సహేతుకమే

యుద్ధం తో అతలాకుతలమవుతున్న అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మరియు గల్ఫ్ లోని కొన్ని దేశాలు తీవ్ర నష్టాన్ని చవిచూశాయి. అటు అమెరికా, ఇటు ఇజ్రాయెల్ పాలు పోని స్థితి లో ఉండగా. మరోవైపు ఇరాన్ కు మద్దతుగా హెజ్బుల్లా ఇజ్రాయెల్ పై దాడి చేసి కనివినని నష్టం చేకూర్చింది. ఇజ్రాయెల్ లోని బీర్ షెబ లోని ఓ రసాయనిక ప్లాంట్ లో విపరీతంగా మంటలు అలుముకున్నాయి. ఈ దాడితో ఇజ్రాయెల్ కలవరపడి ఉంటుంది. మరోవైపు చర్చలు అంటూ ట్రంప్ ఆలోచన ధోరణి ఉంది. కానీ ఇరాన్ అసెంబ్లీ స్పీకర్ ట్రంప్ ను నమ్మడం లేదు. అయితే త్వరలో పాక్ లోని ఇస్లామాబాద్ లో అమెరికా, ఇరాన్ చర్చలు వుంటాయని పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ వెల్లడిచేశాడు. చర్చలలో ఈజిప్ట్, తుర్కియే, సౌదిఅరేబియా కూడా పాల్గొంటాయని, మేము ఇరువైపులా రాజీకి ప్రయత్నిస్తామని ఇషాక్ దార్ చెప్పడం గమనార్హం. యుద్ధం దేశ ప్రగతికి, పురోగతి కి, పురోభివృద్ధికి అడ్డంకి అని ఇరాన్ భావించింది. అమెరికా తో శాంతి చర్చలకు కొన్ని షరతులు, నిబంధనలు పెట్టింది. మా షరతులకు అంగీకరిస్తేనే ముందుకు వస్తామని తేల్చి చెప్పింది.అమెరికా కూడా యుద్ధం వలన ఆర్థిక నష్టం, ప్రజా వ్యతిరేకం తెలుసుకుని ఇరాన్ తో చర్చలకు సుముఖత వ్యక్తం చేసింది. ఇరాన్ పెట్టిన షరతులు ప్రముఖంగా ఐదు. అవన్నీ చూసి అమెరికా, ఇరాన్ తో సందికి సై అన్నట్లు భోగట్ట. ఇంతకీ ఇరాన్ ఐదు షరతులు ఏవంటే..ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ఆపాలి.. మరెప్పుడు కూడా ఇరాన్ పై దాడులు చేయబోమని అమెరికా, ఇజ్రాయెల్ నుంచి హామీ పొందాలి..ఇరాన్ డిమాండ్స్ అమెరికా అంగీకరించేలా చూస్తామని పాక్, సౌదీ, ఈజిప్ట్, లిఖిత పూర్వక హామీ ఇవ్వాలి...ఇంతవరకు యుద్ధలో ఇరాన్ ఆర్థికంగా చతికిల పడింది, నష్ట పరిహారం అందేలా చూడాలి...ఆంక్షలు ఎత్తివేసి, హార్ముజ్ జలా సంధి పై ఇరాన్ కే హక్కు ఉండేలా చూడాలి... ఇవి ఇరాన్ షరతులు. దీనికి అమెరికా సమ్మతి తెలుపుతుందో లేదో చూడాలి. అయితే అమెరికా వీటికి సూత్ర ప్రాయంగా సమ్మతి తెలియజేసినదని తెలుస్తోంది. ఇరాన్ సంధి సూత్రాలు బాగా వున్నప్పటికి వీటికి అమెరికా ఒప్పుకుంటుందా అనే అనుమానం ఉంది. అందుకే కాబోలు ఇరాన్ స్పీకర్ అమెరికాను నమ్మే స్థితిలో లేము అనే మాట అందరిని ఆలోచింప చేస్తోంది. వాస్తవానికి యుద్ధం వలన ఇరాన్ నష్ట పోయిన దరిమిళ నష్ట పరిహారం అడగటం లో తప్పు లేదు. అమెరికా ఊహిస్తున్నట్లు ఇరాన్ దగ్గర భయానక అణు బాంబులు లేవు. దేశ భద్రతకు, రక్షణకు ప్రతి దేశంనిల్వ చేసుకుంటుందని, మేము అదే చేశాం అని ఇరాన్ వైఖరి గా ఉంది. అమెరికా దాడి కంటే ఇజ్రాయెల్ దాడి వలనే మేము నష్ట పోయాం. అమెరిక దాడికి విరామం ప్రకటించిన ఇజ్రాయెల్ ప్రకటించకపోవడం శోచనీయం. అందుకు అనుగుణంగా మేము వారి రసాయానిక స్టావరంపై దాడి చేసింది. స్వదేశంలో అమెరికా లో యుద్ధం పట్ల అమెరికా పౌరులు, ఈ యుద్ధం మా కొద్దు, శాంతి కావాలి అని నిరసనలు చెలరేగాయి. భారీ ర్యాలీ తో అమెరికాలోని మొత్తం 50 రాష్ట్రాలలో ప్రజలు రోడ్లు ఎక్కికదం తొక్కారు. చర్చలతోనే శాంతి, మాకు 'నో కింగ్స్ ' అని ఉద్యమించారు. స్వదేశంలోనే ట్రంప్ సర్కార్కు ఆటంకాలు ఉండటంతో ఇరాన్తో చర్చకు అంగీకరించడం. ఒక వేళ చర్చలు ఫలించి అమెరికా యుద్ధవిరమణ చేస్తున్నట్లు ప్రక టిస్తే, ఇజ్రాయెల్ వైఖరి అంతు బట్టడం లేదు. ఇజ్రాయెల్ కూడా ఒప్పుకుంటే యుద్ధం ఆగుతుంది. లేకపోతే యుద్ధం భీకర రూపం దాల్చడం ఖాయం. ఇటువంటి విపత్కర పరిస్థితుల లో పాక్లో రాయబారం ఏమేరకు ఫలిస్తుందో వేచి చూడాలి.ఇరాన్ దాడులతో అమెరికా, పశ్చిమ ఆసియా దాని మిత్ర దేశాలపై నష్టం తీవ్రంగా ఉంది. అందుకు పాక్,అమెరికా, ఇరాన్ దేశాలు తమపై ఎంతో నమ్మకం ఉంచాయని పాక్ విదేశాంగా మంత్రి ఇషాక్ దార్ సంతోషం వ్యక్తం చేశాడు. పాక్ చర్చలు ఏమాత్రం ఫలిస్తాయోన ని

భారత్ నిశితంగా గమనిస్తోంది. పాక్, భారత్ కు శత్రు దేశమే అయినా ఒక మంచి పనికి పాక్ పూనుకుంటోంది.

మంచి కార్యక్రమాలకు భారత్ ఎప్పుడు మద్దతు ఇస్తుంది. ఈ దిశలో పాక్ రాయబారం ఏ మేరకు ఫలిస్తుందో వేచి చూడాలి.

**- కనుమ ఎల్లారెడ్డి**
93915 23027

# నిజాయితీకి నిదర్శనంగా నిలిచిన మహిళ

## డబుల్ బెడ్ రూమ్ గృహాన్ని తిరిగి అప్పగించిన దంపతులను ప్రశంసించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి, మార్చి 30 (మనం ప్రతినిధి)ః పెద్దపల్లి జిల్లాకు చెందిన శ్రీమతి వరహగిరి శైలజ, భర్త వెంకటరావు దంపతులు సోమవారం కలెక్టరేట్ లో ప్రభుత్వంచే మంజూరైన డబుల్ బెడ్ రూమ్ గృహాన్ని స్వచ్ఛందంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కు తిరిగి అప్పగించారు.తమ పిల్లలు సాఫ్ట్వేర్ ఉద్యోగం లో స్థిరపడిన నేపథ్యంలో తమకు ఈ గృహం అవసరం లేదని భావించి, వేరే నిరుపేద కుటుంబానికి కేటాయించాలని సోమవారం రోజున పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గృహాన్ని తిరిగి అప్పగించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, అవసరం లేకపోయినా ప్రభుత్వ ఆస్తిని తిరిగి ఇచ్చిన శ్రీమతి శైలజ దంపతులు నిజాయితీకి నిదర్శనమని పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తి సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని ఆయన అభినందించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజంగా అవసరమైన వారికి అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్
- ప్రజావాణికి 74 ఫిర్యాదులు




జగిత్యాల, మార్చి 30(మనం ప్రతినిధి)ః ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ ఆర్డీఓలతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూపలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 74 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ బి.ఎస్.లత,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్, జగిత్యాల, కోరుట్ల,మెట్ పెల్లి ఆర్డీవోలు మధు సూదన్, జీవాకర్రెడ్డి, నరసింహారావు,వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# అతివేగం, ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం వల్లనే రోడ్డు ప్రమాదాలు

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్.
- డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలి
- పోలీస్ కళాబృందం ద్వారా ట్రాఫిక్ నియమాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం




జగిత్యాల మార్చి 30(మనం ప్రతినిధి)ః రోడ్డు ప్రమాదాలను నియంత్రించి, ప్రతి పౌరుడు సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు జగిత్యాల పట్టణంలోని ఓల్ బస్ స్టాండ్ వద్ద రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో ఇతర ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలతో పాటు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రజల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం ముఖ్య లక్ష్యమని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం, ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వంటి కారణాల వల్లనే జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనం నడిపి, తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా పోలీస్ కళాబృందం సభ్యులు పాటలు, నాటికల ద్వారా ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపకూడదనే నిబంధనలు, అతివేగం వల్ల కలిగే ప్రమాదాలు వంటి అంశాలను ప్రభావవంతంగా ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది యమధర్మరాజు మరియు చిత్రగుప్తుడు వేషధారణలో ప్రదర్శించిన నాటిక. ఈ నాటికలో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తుల జీవితాలను ప్రతిబింబిస్తూ, వారి నిర్లక్ష్యం ఎలా ప్రాణాంతక పరిణామాలకు దారితీసిందో హృద్యంగా చూపించారు. యమధర్మరాజు, చిత్రగుప్తుడు పాత్రల ద్వారా ప్రతి మనిషి తన చర్యలకు తానే బాధ్యత వహించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తూ, చిన్న పొరపాటు కూడా ఎంతటి పెద్ద నష్టానికి కారణమవుతుందో సందేశాత్మకంగా తెలియజేశారు.

వినోదంతో పాటు విలువైన సందేశాన్ని అందించిన ఈ ప్రదర్శన అక్కడున్న విద్యార్థులు, ప్రజలను విశేషంగా ఆకట్టుకుని, రోడ్డు భద్రతపై లోతైన ఆలోచన కలిగించింది. ముఖ్యంగా యువతలో ట్రాఫిక్ నియమాల పట్ల బాధ్యతాభావం పెంపొందించడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషించింది. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘు చందర్, మున్సిపల్ చైర్మన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు సుధాకర్, కరుణాకర్, ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 300 మంది విద్యార్థులు, ప్రజలు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన పొందారు.

# యువతకు చెల్లింపు ఇంటర్న్షిప్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా పరిశ్రమల అధికారి ఎ. కీర్తి కాంత్

పెద్దపల్లి, మార్చి 30 (మనం ప్రతినిధి): జిల్లా పరిశ్రమల కేంద్రం, పెద్దపల్లి పరిధిలోని అర్హత కలిగిన యువతకు ప్రైమ్ మినిస్టర్ ఇంటర్న్షిప్ స్కీమ్ (రౌండ్-3) కింద దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయని జిల్లా పరిశ్రమల అధికారి ఎ. కీర్తి కాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆధ్వర్యంలో అమలు చేయబడుతూ, దేశంలోని ప్రముఖ కంపెనీలలో చెల్లింపుతో కూడిన ఇంటర్న్షిప్ అవకాశాలు కల్పించబడుతున్నాయని, దీని ద్వారా యువతకు పరిశ్రమల అనుభవం మరియు నైపుణ్యాభివృద్ధి పొందే అవకాశం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం కింద ఎంపికైన అభ్యర్థులకు చేరిక సమయంలో ఒకమారు 6,000 గ్రాంట్, ప్రతి నెల రూ9,000 ఆర్థిక సహాయం అందించబడుతుందని తెలిపారు. ఇంటర్న్షిప్ కాలం 6 లేదా 9 నెలలు ఉండి, ప్రముఖ సంస్థల్లో ప్రత్యక్ష అనుభవం పొందే అవకాశం ఉంటుందని వివరించారు.

అభ్యర్థుల వయస్సు 18 నుండి 25 సంవత్సరాల మధ్య ఉండాలని, పూర్తికాల ఉద్యోగంలో ఉండకూడదని సూచించారు. 2026-27 సంవత్సరానికి దరఖాస్తులు ప్రారంభమైనందున అర్హత కలిగిన యువత https://pminternship.mca.gov.in వెబ్సైట్లో నమోదు చేసుకోవాలని తెలిపారు. మరింత సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1800 116 090 ద్వారా సంప్రదించవచ్చని, జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పరచుకోవాలని జిల్లా పరిశ్రమల అధికారి ఎ. కీర్తి కాంత్ ఆ ప్రకటనలో కోరారు.

# బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వొడ్నాల రవీందర్




సుల్తానాబాద్ మార్చి 30 (మనం న్యూస్): సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికలను సోమవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. హోరాహోరీగా జరిగిన ఎన్నికలలో 46 మంది న్యాయవాదులు ఓటు హక్కు వినియోగంచుకున్నారు. అధ్యక్ష స్థానానికి మేకల తిరుపతి రెడ్డి, వొడ్నాల రవీందర్ లు , ఉపాధ్యక్ష పదవికి ఆవుల శివకృష్ణ, మల్యాల కరుణాకర్ పోటీపడ్డారు. అధ్యక్షుడు గా వొడ్నాల రవీందర్ కి 24 ఓట్లతో విజయం సాధించారు. ఉపాధ్యక్షుడు గా ఆవుల శివకృష్ణ కు 24 ఓట్లతో విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా ఆవునూరి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శిగా గుడ్ల వెంకటేష్, కోశాధికారిగా చీకటి సంతోష్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా వడ్లకొండ రవి కిరణ్, లైబ్రరీ కార్యదర్శిగా బొబ్బిలి శ్యాం, మహిళా ప్రతినిధి గా పి. సంధ్యారాణి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా గూడూరి దివాకర్ రావు, ఆవుల లక్ష్మి రాజం, మాడూరి ఆంజనేయులు, డి, భూసారపు బాలకిషన్ ప్రసాద్, పదాల శ్రీరాములు, ఆకారపు సరోత్తం రెడ్డి ,, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా సామల రాజేంద్ర ప్రసాద్, ఆరెల్లి రాములు, వేముల స్నేహ, మాడూరి పృథ్వీ, పూజ, ఆకారపు రామకృష్ణారెడ్డి లను ఎన్నుకున్నారు. పడాల అంజయ్య, రుద్రారపు నర్సయ్య లు ఎన్నికల అధికారుల పర్యవేక్షణ లో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఓడ్నాల రవీందర్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, సుల్తానాబాద్ కు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా గెలిచిన నూతన కార్యవర్గాన్ని శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

# సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం డ్రైవర్ల ప్రధాన బాధ్యత

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్.
- వాహనాలకు రేడియం స్టిక్కర్లు తప్పనిసరి



జగిత్యాల మార్చి 30(మనం న్యూస్)ః రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కొరుట్ల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో కొరుట్ల, మెట్పల్లి ప్రాంతాలకు చెందిన లారీ, ఐచర్ మరియు ఇతర భారీ వాహనాల డ్రైవర్లు, యజమానుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ట్రాఫిక్ నియమాలు, డిఫెన్సివ్ డ్రైవింగ్ ప్రాముఖ్యత, రహదారి భద్రతపై మార్గదర్శకాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో ఇతర ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రజల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం అరైవ్ అలైవ్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు ఎప్పుడు, ఎలా జరుగుతాయో ముందుగా ఊహించలేమని, కాబట్టి నివారణ చర్యలు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయని, అలాంటి సంఘటనల వల్ల కుటుంబాలకు తీరని నష్టం కలుగుతుందని అన్నారు. ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. రాత్రి సమయంలో వాహనాలను రోడ్డు పక్కన నిలిపే సందర్భాల్లో రేడియం స్టిక్కర్లు తప్పనిసరిగా అమర్చుకోవాలని, తద్వారా ఇతర వాహనదారులకు వాహనాలు స్పష్టంగా కనిపించి ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. అధిక ప్రకాశం ఉన్న ఎల్ఈడి లైట్లు ఎదురుగా వచ్చే వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తాయని, వాటిని నియంత్రణలో వినియోగించాలని సూచించారు. అలాగే అధిక లోడ్తో లారీలు, ఐచర్ వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ స్వయంగా లారీలు, వ్యాన్ వాహనాలకు రేడియం స్టిక్కర్లను అతికించి డ్రైవర్లకు భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, మెట్పల్లి డీఎస్పీ అడ్డూరి రాములు, కొరుట్ల సీఐ సురేష్ బాబు, ఎస్త్స చిరంజీవి, మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్, ఎంవిఐ శ్రీనివాస్ తదితరులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో మెట్పల్లి డీఎస్పీ అడ్డూరి రాములు, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్, స్థానిక ప్రజాప్రతినిధులు, కొరుట్ల సీఐ సురేష్ బాబు, మెట్పల్లి సీఐ అనిల్ కుమార్, కొరుట్ల ఎస్త్సలు చిరంజీవి, రామచంద్రం, మెట్పల్లి ఎస్త్స కిరణ్, మేడిపల్లి ఎస్త్స శ్రీధర్ రెడ్డి, కథలాపూర్ ఎస్త్స రవికిరణ్, అలాగే లారీ, వ్యాన్ అసోసియేషన్ సభ్యులు, డ్రైవర్లు, యజమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోగులకు ఆసుపత్రిలో సత్వర వైద్య సేవలు అందించేలా చర్యలు



- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, మార్చి 30 (మనం ప్రతినిధి)ః రోగులకు ఆసుపత్రిలో సత్వర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో వైద్యశాఖ పని తీరు పై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రతిరోజు ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకు ఓ.పి. రిజిస్ట్రేషన్ చేయడం వల్ల ఎక్కువ మంది రోగులకు సేవలు అందించ లేకపోతున్నామని, ప్రతి విభాగంలో రోజుకు నిర్దిష్ట సంఖ్యలో టోకెన్ లు జారీ చేసి ఓపి సేవలు నిర్వహించాలని, అనంతరం వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిలో ఆర్థో , డెంటల్, జనరల్ మెడిసిన్, గైనిక్, చిన్నపిల్లల స్పెషలిస్ట్, కంటి చికిత్స మొదలగు వివిధ విభాగాలలో ఎన్ని ఓపి టోకెన్లు ఉన్నాయో తెలియజేస్తూ డిస్ ప్లే బోర్డు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ల్యాబ్ టెస్ట్ పరీక్షల ఫలితాలు రోగులకు త్వరగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రతిరోజు జరిగే వైద్య పరీక్షలకు సంబంధించి నివేదిక అందజేయాలని, ఉదయం జరిగే పరీక్షలకు సాయంత్రం వరకు ఫలితాలు రోగులకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిలో ల్యాబ్, ఎక్స్ రే రూమ్, వివిధ ఓపీ రూమ్, ఇతర విభాగాలకు దారి చూపే విధంగా సింబల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.ఆసుపత్రిలో ప్రతిరోజు ఎన్ని ఎక్స్ రే, స్కానింగ్ పరీక్షలు, రక్త పరీక్షలు జరుగుతున్నాయో నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్స్ రే యంత్రం, అవసరమైన స్టాఫ్ నియామకం కోరుకో ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ తెలిపారు. రోగులకు వైద్యులు ఆసుపత్రిలో పని వేళలో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్,డి సి హెచ్ ఓ డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలి




ములుగు,, మార్చి 30, మనం ప్రతినిధి, 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2వ తేదీన అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామసభల నిర్వహణపై జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పురోగతిని, రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణమాఫీ, సాయిల్ హెల్త్ కార్డ్, వ్యవసాయ తదితర ప్రభుత్వ పథకాల గురించి, ప్రజలకు వివరించాలని అన్నారు. గ్రామసభల్లో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల వివరాలను పారదర్శకంగా ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. గ్రామ సభలు నిర్వహణకు ముందస్తుగానే షెడ్యూల్ తయారు చేసి పంచాయతి కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రతి గ్రామ పంచాయతీలో జరిగే సభకు అగ్రికల్చర్, ఎడ్యుకేషన్, హౌసింగ్, ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు, తహశీల్దార్, ఎంపి డి ఓ లు తప్పనిసరిగా గ్రామ సభలకు హాజరు కావాలని స్పష్టం చేశారు. గ్రామ సభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా టెంట్లు, కుర్చీలు, తాగునీరు ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారి కోసం గ్రామ సభలో ప్రత్యేకంగా దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి వారి నుంచి దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. ఈ సమావేశం లో ఆర్డిఓ వెంకటేష్, జిల్లా అధికారులు, ఎం పి డి ఓ లు, ఎంపి ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి



- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, మార్చి 30 (మనం ప్రతినిధి)ః అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పెద్దపల్లి మండలం రంగా పూర్ గ్రామానికి చెందిన గండు రాజయ్య గ్రామంలో తనకు ఎకరం 5 గంటల వ్యవసాయ భూమి ఉందని, వి ఎస్ బి బ్రిక్స్ నుంచి వచ్చే దుమ్ము ధూళి బూడిద వల్ల తన పొలంలో పండే కూరగాయల పంటకు నష్టం వస్తుందని, వి ఎస్ పి బ్రిక్స్ పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ పెద్దపల్లి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పెద్దపల్లి పట్టణం హనుమాన్ నగర్ కు చెందిన ఎర్రం వర లక్ష్మి తనకు ఇద్దరు కుమారులు ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, తనను ఎవరు చూసుకోవడం లేదని వృద్ధుల పోసిన సంరక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఆర్డిఓ పెద్దపల్లి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన కుమారస్వామి తమకు అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సుల్తానాబాద్ మండలం నీరుకుల గ్రామానికి చెందిన ఎర్రబెల్లి రాజేశ్వర రావు గ్రామ శివారు సర్వే నెంబర్ 330 నుంచి 331 లో గల కాలువలో మట్టి తీయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఈఈ ఇరిగేషన్ అధికారి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి పట్టణం విద్యానగర్ కు చెందిన విటల్ తమకు గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అమలు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా మున్సిపల్ కమిషనర్ కు రాస్తూ విచారించి అర్హత మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవాణి పిజి కళాశాలలో వార్షికోత్సవ సంబరాలు



- డిగ్రీ విద్యార్థులకు చదువుతోపాటు స్కిల్స్ కూడా ముఖ్యం
- రేకులపల్లి శశాంక సెక్రటరీ, కరస్పాండెంట్

సుల్తానాబాద్ మార్చి 30 (మనం న్యూస్): పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం నర్సయ్య పల్లి లోని విజయ ఏసి ఫంక్షన్ హాల్ (ఫోటో ఫామ్) శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాల వార్షికోత్సవ సంబరాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు అన్ని రకాల స్కిల్స్ పెంపొందించడానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలలో విజేతలు గా నిలిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమంలతో ఆహుతులను అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బండారి కమలాకర్, బాలసాని శ్రీనివాస్, అధ్యాపక బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కొండగట్టు శ్రీ చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు



జగిత్యాల, మార్చి 30 (మనం ప్రతినిధి)ః జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలు ఏప్రిల్ 01 నుండి 03 తేది వరకు జరగనున్న సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు.

సోమవారం రోజున కొండగట్టు ఆలయ పరిసరాల్లో నిర్వహించనున్న జయంతి ఉత్సవాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న ఏర్పాట్లను ప్రత్యక్షంగా సమీక్షించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ**

ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారని భావించి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవాలయం పరిసర ప్రాంతాల్లో 64 సీసీ కెమెరాలతో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండేలా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. హెల్ప్ సెంటర్, ప్రత్యేక ఆరోగ్య కేంద్రాలు 6 ప్రదేశాల్లో ఏర్పాటు, ప్రత్యేక స్థలాల్లో భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక టెంట్ ల ఏర్పాటు, మెట్ల దారి మార్గంలో లైటింగ్ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. దీక్ష విరమణ, ప్రసాదాల కౌంటర్ ల వద్ద క్యూ లైన్ల వద్ద బందోబస్త్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా, పార్కింగ్ సదుపాయాలు సరిపడా ఉండేలా చూడాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని అధికారులకు సూచించారు. భక్తులకు తాగునీరు (చలి వేంద్రాలు), మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కొండ పైన వైద్య సిబ్బందిని నియమించి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని, వడదెబ్బ నివారణకు గాను ఓ. ఆర్. ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతూ, 108 అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచాలని ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించామని తెలిపారు.

జయంతి ఉత్సవ రోజుల్లో నిరంతరంగా 24 గంటల విద్యుత్ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. కోనేరు యందు ఎప్పటికప్పుడు నీరు నింపుటకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. భక్తులు మరియు దీక్ష స్వాముల సౌకర్యార్థం వేములవాడ జగిత్యాల మరియు కరీంనగర్ నుండి ప్రత్యేకంగా బస్సుల నడుపనున్నట్లు తెలిపారు. దేవస్థానం పరిధిలో మరియు గుట్ట కింద గల వీధులలో పారిశుధ్య సిబ్బందిని అవసరం మేరకు కేటాయించి నిరంతరం శానిటేషన్ చేయనున్నట్లు తెలిపారు. ఆయా విధులు కేటాయించిన అధికారులకు వసతులు కల్పించిన చోటే బస చేసి అప్పగించిన విధులను భాద్యతగా నిర్వర్తించి జయంతి ఉత్సవాలు ఘనంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డిపివో మదన్ మోహన్, ఆలయ ఏవో అంజనా రెడ్డి, ఎమ్మార్వోలు , ఎంపిడివోలు, సంబంధిత శాఖల అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ద వహించాలి




- **టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**

సంగారెడ్డి మార్చి 30 మనం న్యూస్ ప్రతిని ధి : సంగారెడ్డి పట్టణంలోని 15వ వార్డు రాజంపేట్ భవాని మందిర్ వద్ద కౌన్సిలర్ సుష్మిత ప్రశాంత్ ఆధ్వర్యంలో మహేశ్వర మెడికల్ కాలేజీ సహకారంతో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీజీఐఐ సీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్యాంపు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ హెల్త్ క్యాంప్లో వైద్యులు రోగులకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్ ,కౌన్సిలర్ లు సంగీత మహేష్, వీణా కిరణ్, వంశీ, శ్రీకాంత్ గౌడ్, సతీష్ రెడ్డి నాయకులు కూన సంతోష్ , మహేష్. ముదిరాజ్ , కసిని రాజు, రాజంపేట శ్రీను, ఆరిఫ్, శాంతి కుమార్, చిత్తరీ యాదగిరి వైద్య సిబ్బంది , ప్రజలు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఆదివాసుల ఉద్యమాన్ని ఆపలేరు



- **మంగపేట మండల ఆదివాసి ప్రజా సంఘాలు జాయింట్ యాక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి తాటి నాగరాజు**

మంగపేట, మార్చి 30, మనం న్యూస్: ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలో కొమరం భీమ్ విగ్రహం వద్ద ఆదివాసి ప్రజా సంఘాలు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆదివాసి ప్రజాసంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి తాటి నాగరాజు మాట్లాడుతూ భద్రాద్రి జిల్లా నుండి మహబూబాబాద్ జిల్లా లో గూడూరు వస్తున్నా క్రమంలో ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ₹మైపతి అరుణ్ కుమార్₹ దారం రమేష్ ముక్తిరాజు మహబూబాబాద్ జిల్లా కమిటీ నిర్మాణం కోసం వెళ్తున్న సమయంలో, బయ్యారం పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారు ఆదివాసి సంఘాలుగా తీవ్రంగా ఖండిస్తున్నాము. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆదివాసుల హక్కులను అణచివేయడం, వారి గొంతును నొక్కివేయడం దురదృష్టకరం. ఈ విధమైన చర్యలు ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజల్లో అనుమానాలు కలిగిస్తాయి. ఆదివాసుల హక్కులను కాలరాయడానికి జరుగుతున్న కుట్రలను తక్షణమే ఆపాలి. అక్రమ అరెస్టులను వెంటనే రద్దు చేసి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని మేము డిమాండ్ చేస్తున్నాం.

## 2న ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక గ్రామ,వార్డు సభలు

- **పకడ్బందీగా నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలి**
- **షెడ్యూల్ ప్రకారం కార్యక్రమం నిర్వహించాలి**
- **కలెక్టర్ గరిమ అగ్రవాల్**



రాజన్న సిరిసిల్ల, మార్చి -30(మనం ప్రతినిధి)ః ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక₹ 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా వచ్చే నెల (ఏప్రిల్) 2వ తేదీన గ్రామ పంచాయతీ ల్లో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వచ్చే నెల (ఏప్రిల్) 2వ తేదీన గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభల నిర్వహణపై జిల్లాలోని మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రతి గ్రామ పంచాయతీలో, మున్సిపల్ పరిధిలో వార్డు సభలో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి గ్రామసభ, వార్డు సభకు వివిధ మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆదేశించారు. వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలతో కరపత్రం రూపొందించాలని, దానిని కార్యక్రమంలో అందజేయాలని తెలిపారు. ప్రగతి ప్రణాళిక కోసం గ్రామ స్థాయి, వార్డు స్థాయి అభివృద్ధి ప్రాధాన్యతలను గుర్తించాలని, గ్రామం, వార్డులో ఉన్న సమస్యలను గుర్తించాలని, పరిష్కారాలపై చర్చించాలని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో ఇప్పటిదాకా చేపట్టిన పనులు, ఎన్ని పెండింగ్ ఫైళ్లు పరిష్కరించారో వివరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సభలకు సర్పంచ్, మున్సిపాలిటీలో చైర్ పర్సన్, ఉప సర్పంచ్, వైస్ చైర్ పర్సన్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సంబంధిత శాఖల అధికారులు, గ్రామ పెద్దలు స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువత రైతులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులను, వివిధ పథకాల లబ్ధిదారులను ఆహ్వానించాలని ఆదేశించారు.

## నేటి నుండి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మేళ్లచెరువు మార్చి 30 మనం న్యూస్ః మేళ్లచెరువులోని శ్రీ భూనీలా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి మరియు నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు నేటి నుండి ప్రారంభమవుతున్నట్లు, ఆలయ అర్చకులు శ్రీ నరగిరి నాధుని రాఘవాచార్యులు తెలిపారు. మంగళవారం స్వామివారికి అర్చన, పుణ్యా వచనం, రక్షాబంధనం, అంకురార్పణ, వాస్తు హోమం, ద్వజారోహణ, తదితర పూజాది కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. బుధవారం సుప్రభాత సేవ, నిత్య హోమం, సుదర్శన సంపుటిత నవనారసింహ హోమం, స్వామి వారి బ్రహ్మోత్సవం, రాత్రి 8 గంటలకు స్వామివారి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. గురువారం వసంతోత్సవం, చక్రస్నానా పూర్ణాహుతి, పవళింపు సేవ అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అర్చకులు తెలిపారు.

## నేడు కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి - గిరివాణి కార్యక్రమం



ములుగు, మార్చి 30, మనం ప్రతినిధిః ఈ నెల 30వ తేదీన సోమవారం ములుగు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి - గిరివాణి (గిరిజన దర్బార్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం ఐటీడీఏ ఏటూరు నాగారం లో నిర్వహించే గిరివాణి (గిరిజన దర్బార్) కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఈనెల 30వ తేదీన కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని గిరిజనులు, గిరిజనేతరులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకొని తమ అర్జీలను సమర్పించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# గృహ సముదాయాల బ్లాక్ల గుర్తించి సి.యం.యం.ఎస్ పోర్టల్లో నమోదు చేయాలి

- **అధికంగా ఎన్యుమేటర్లు, సూపర్వైజర్ల నియామకం చేపట్టాలి**
- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**




పెద్దపల్లి, మార్చి 30 (మనం ప్రతినిధి)ః జన గణన-2027కు సంబంధించి గృహ సముదాయాల బ్లాక్లు (హౌజ్ లిస్టింగ్ బ్లాక్లు) గుర్తించి సి.యం.యం.ఎస్ (సెన్సస్ మేనేజ్మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్) పోర్టల్లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. సోమవారం హైదరాబాద్ నుండి డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతీ హోలికేరి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జనగణన-2027పై పలు సూచనలు చేశారు. మే 11 నుండి ప్రారంభం కానున్న జనగణన-2027 కోసం అన్ని జిల్లాల్లో అవసరానికి మించి 10 శాతం అధికంగా ఎన్యుమేటర్లు, సూపర్వైజర్లను గుర్తించి నియమించాలని డైరెక్టర్ ఆదేశించారు. నియమితులైన సిబ్బంది వివరాలను సి.యం.యం.ఎస్ పోర్టల్లో నమోదు చేయాలని తెలిపారు. జనాభా ఆధారంగా రెవెన్యూ గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్లను ముందుగా రూపొందించి, వాటి ప్రకారం హౌజ్ లిస్టింగ్ బ్లాక్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ఇళ్ల వివరాలను సేకరించి హౌజ్ లిస్టింగ్ చేయాలని, పోర్టల్ ద్వారా ఈ ప్రక్రియపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.ప్రతి హౌజ్ లిస్టింగ్ బ్లాక్లో 700 నుండి 850 వరకు జనాభా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా బ్లాక్లు రూపొందిస్తే ఇళ్లు మిస్ అయ్యే ప్రమాదం లేదా జనాభా అసమానతలు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. హౌజ్ లిస్టింగ్ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. స్పందించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష హౌజ్ లిస్టింగ్ పనులను నిబంధనల ప్రకారం పూర్తి చేయడంతో పాటు, ఎన్యుమేటర్లు మరియు సూపర్వైజర్లను 10 శాతం అధికంగా నియమించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సమావేశంలో సిపిఓ రవీందర్, కలెక్టరేట్ సూపరిండెంట్ కుమారస్వామి, ఈ.డి.యం. కవిత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు గ్యాస్ సరఫరాపై అపోహలు పడవద్దు

- **జిల్లాలో సరిపడా గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయి**
- **కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు :: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**




ములుగు, మార్చి 30, మనం ప్రతినిధిః ప్రజలు గ్యాస్ సరఫరా పై ఎలాంటి అపోహలు పడవద్దని, జిల్లాలో సరిపడా గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా అక్రమంగా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. సోమవారం ములుగు లిటిల్ ఫ్లవర్ స్కూల్ సమీపంలోని ఎల్ పి జి లక్ష్మీ హెచ్ పి గ్యాస్ గోదాం ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గోదాం లో నిల్వ ఉన్న ఎల్పిజి హెచ్ పి గ్యాస్ సిలిండర్ లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎప్పటికప్పుడు స్టాక్ నిలువలు రిజిస్టర్లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. గ్యాస్ సరఫరాలో అక్రమాలకు పాల్పడిన ప్రజల నుంచి అధిక రుసుము వసూలు చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎల్పిజి గ్యాస్ సరఫరాలో ప్రజలు ఎలాంటి ఆందోళనలకు, అపోహలకు గురికావద్దని,గ్యాస్ కొరత ఉందంటూ వస్తున్న పుకార్లను నమ్మవద్దని స్పష్టం చేశారు. సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా డిస్ట్రిక్ట్ ఎనర్జీ సప్లై, మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో పౌర సరఫరాల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ ఎనర్జీ సప్లై, మానిటరింగ్ కమిటీ కన్వీనర్, సివిల్ సప్లై అధికారి సయ్యద్ షా ఫైసల్ హుస్సేని , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ అనంతరం జీవితం సజావుగా సాగాలి



సుల్తానాబాద్, మార్చి 30 (మనం న్యూస్): పూసాల ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ మిర్యాల సుజాత పదవి విరమణ అనంతరం జీవితం సజావుగా సాగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకాంక్షించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సుల్తానాబాద్ మండలం పూసాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పదవీ విరమణ పొందిన హెడ్ మాస్టర్ కు సిబ్బంది ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, పూసాల ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ మిర్యాల సుజాత తన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ఎదురయ్యే సమస్యలను చిరునవ్వుతో ఎదుర్కొన్నారని తద్వారా మంచి ఫలితాలను రాబట్టగలిగారని అన్నారు. పదవి విరమణ పొందిన తరువాత మంచి ఆరోగ్యంతో జీవితంలో ఏర్పర్చుకున్న లక్ష్యాలను సాధించాలని, ప్రశాంతమైన జీవితం గడపాలని, సుఖ సంతోషాలతో ఉండాలని కలెక్టర్ కోరుకున్నారు.అనంతరం పదవి విరమణ పొందుతున్న పూసాల ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ మిర్యాల సుజాత ను జిల్లా కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## జనగణన కార్యక్రమం సమర్ధవంతంగా నిర్వహించాలి




- **డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోళీకేరి**

ములుగు,మార్చి 30,మనం ప్రతినిధిః జనగణన-2027 మొదటి విడతలో భాగంగా చేపట్టనున్న ఇండ్ల గణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జనగణన సంచాలకులు భారతి హోళీకేరి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా జనగణన అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో జనగణన, ఇండ్ల గణన, మ్యాప్ తయారీ, ఎన్యుమరేటర్లు మరియు సూపర్వైజర్ల నియామకంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇండ్ల గణన ప్రక్రియను సక్రమంగా నిర్వహించేందుకు అధికారులందరూ పూర్తి అవగాహనతో పని చేయాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గణన చేపట్టాలని సూచించారు. దేశంలో తొలిసారిగా జనగణనను పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 11 నుండి జూన్ 9 వరకు ఇండ్ల గణన కార్యక్రమం కొనసాగుతుందని, ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని పేర్కొన్నారు. సన్నాహక చర్యలను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. యాప్ నిర్వహణలో ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించాలని, గణన ప్రక్రియ నిరాటంకంగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.మండలాల వారీగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం చేపట్టాలని, ప్రతి 300 ఇళ్లకు లేదా 750-800 జనాభాకు ఒక ఎన్యుమరేటర్ను నియమించాలని తెలిపారు. హౌస్ లిస్టింగ్ బ్లాకులను సిద్ధం చేసి క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, జిల్లాలో జనగణన-2027 మొదటి విడత ఇండ్ల గణన కార్యక్రమాన్ని సమన్వయంతో సక్రమంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, సూపరిండెంట్ మంజుల, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## షాపింగ్ కాంప్లెక్స్ గదులు వేలం పాట



మహాదేవపూర్ మార్చి 30మనం న్యూస్ ః జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ గ్రామపంచాయతీ కార్యాలయములో సర్పంచ్ హసీనా బానో అధ్యక్షత న మరియుమండల పంచాయతి అధికారి శ్రీ వీరస్వామి పర్యవేక్షణ లో బహిరంగం వెలము తైబజార్ మరియు గ్రామపంచాయతీ షాప్పింగ్ కాంప్లెక్స్ గదులను వెలము వేయడం జరిగింది. తైబజార్ ప్రభుత్వ పాట రూ: 320000 లకు గడ్డం నగేష్ రూ: 475000/-లకు కైవసం చేసుకున్నారు. మరియు షాప్పింగ్ కాంప్లెక్స్ రూ౹౹నెంబర్:23 గొండ్రాల రాజు కుమార్ రూ:7100 కైవసం చేసుకోగా రూ౹౹నెంబర్:24 గొండ్రాల రాజు కుమార్ రూ:11500/-, రూ౹౹నెంబర్:25 మాన్యం అరుణ రూ:14000/- రూ౹౹నెంబర్:26 పోతుగంటి నాగరాజు రూ:14500/- మరియు రూ౹౹నెంబర్:27 భూషనబోయిన శ్రీకాంత్ రూ:9000/- గాను కైవసం చేసుకున్నారు. మరియు 1 నుండి 21 గల రూమ్స్ కు ఎవరు వెలం పాటలో పాల్గొనలేదు కాబట్టి వాటి కోసం 0 7-03-2026 రోజున మరల బహిరంగ వేలం పాట నిర్వహించ బడును, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుంగల శ్రీజ సంతోష్ ,పంచాయతీ కార్యదర్శి కల్పన, మరియు పాలకవర్గం , గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గోన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలి



- **గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలి**
- **జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**

ములుగు, మార్చి 30,మనం ప్రతినిధిః 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2వ తేదీన అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామసభల నిర్వహణపై జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పురోగతిని, రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణమాఫీ, సాయిల్ హెల్త్ కార్డ్, వ్యవసాయ తదితర ప్రభుత్వ పథకాల గురించి, ప్రజలకు వివరించాలని అన్నారు. గ్రామసభల్లో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల వివరాలను పారదర్శకంగా ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. గ్రామ సభలు నిర్వహణకు ముందస్తుగానే షెడ్యూల్ తయారు చేసి పంచాయతి కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన ప్రాంతంలో గ్రామసభలు నిర్వహణతో పాటు గ్రామంలో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల జాభితా చదివి పినిపించాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో జరిగే సభకు అగ్రికల్చర్, ఎడ్యుకేషన్, హౌసింగ్, ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు, తహశీల్దార్, ఎంపి డి ఓ లు తప్పనిసరిగా గ్రామ సభలకు హాజరు కావాలని స్పష్టం చేశారు.గ్రామ సభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా టెంట్లు, కుర్చీలు, తాగునీరు ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.ఈ సమావేశం లో ఆర్డిఓ వెంకటేష్, జిల్లా అధికారులు, ఎం పి డి ఓ లు, ఎంపి ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

# నేటితో కేంద్రం డెడ్ లైన్ ముగింపు

- మావోయిజంపై నేడు అమిత్ షా కీలక ప్రకటన
- అమిత్ షా ప్రకటనపై తీవ్ర ఉత్కంఠ
- ఇంకా అజ్ఞాతంలోనే గణపతి, బెస్రా, నరహరి



చర్ల, మార్చి 30 (మనం న్యూస్): దేశంలో మావోయిజం నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం విదించిన డెడ్ లైన్ నేటితో ముగియనుంది. ఈ విషయమై కేంద్ర హోం మంత్రి అమిత్ షా లోక్‌సభలో కీలక ప్రకటన చేయనున్నారు. ఇంకా మావోయిస్టు అగ్రనేతలు గణపతి, మిసిర్ బెస్రా, నరహరితో పాటు అనేక మంది ఉద్యమంలోనే ఉన్న నేపథ్యంలో అమిషా ప్రకటనపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అంతర్గత భద్రత, మారుమూల ప్రాంతాల అభివృద్ధికి ఆటంకంగా మారిన మావోయిజాన్ని నిర్మూలించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2024 జనవరి నుండి ఆపరేషన్ కగార్ పేరిట ఆపరేషన్ ప్రారంభించింది. 2026 మార్చి 31 నాటికి దేశంలో మావోయిజం లేకుండా చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకొని వేల సంఖ్యలో భద్రతా బలగాలను రంగంలోకి దింపింది. మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలయిన ఛత్తీస్గడ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిషా, జార్ఖండ్ లలో పెద్ద ఎత్తున పోలీస్ బేస్ క్యాంప్ లను ఏర్పాటు చేసింది. సిఆర్పిఎఫ్, డి ఆర్ జి, బస్తర్ ఫైటర్స్, ఎస్ టి ఎఫ్, సి 60, గ్రేహండ్స్, ఎస్ వో జి, ఐటిబిటి తదితర బలగాలను రంగంలోకి దింపింది. 27 నెలల పాటు కొనసాగిన కగార్ ఆపరేషన్ ఫలితంగా దేశంలో మావోయిజం దాదాపు అదుపులోకి వచ్చిందనే చెప్పాలి. వరుస ఎన్ కౌటర్లతో గత రెండేళ్లలో జాతీయ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు తో సహా 12 మంది పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ సభ్యులతో పాటు పెద్దసంఖ్యలో మావోయిస్టులు మృతిచెందారు. ఏడుగురు కేంద్ర కమిటీ సభ్యులు లొంగిపోయారు. 2019 నుండి 2026 జనవరి వరకు 7409 మంది మావోయిస్టులు అరెస్ట్ అయ్యారు. అదే సమయంలో 5580 మంది లొంగుబాట పట్టారు. గత ఏడాది అత్యదికంగా 2337 మంది లొంగిపోగా అదే సంఖ్యలో అరెస్ట్ అయ్యారు. మరో 800 మంది వరకు వివిద ఎన్ కౌంటర్లలో మృతిచెందారు. ఈ నేపథ్యంలో మావోయిస్టు పార్టీ పూర్తిగా బలహీన పడింది. ప్రస్తుతం ఛత్తీస్గడ్ లో 100 నుండి 150 లోపు, తెలంగాణలో 17 మంది, ఒడిషాలో 8 మంది, మహారాష్ట్రలో 10 మంది, జార్ఖండ్ లో 10 మంది లోపు మావోయిస్టు లు ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. వీరిలో కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యులు గణపతి, మిసిర్ బెస్రా, కీలకనేత పసునూరి నరహరి లతో పాటు పలువురు డివిసిఎం, ఏసిఎంలు ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం విధించిన గడువు నేటితో ముగియనున్న నేపథ్యంలో అమిషా ప్రకటనపై ఉత్కంఠ నెలకొంది. తెలుగుదేశం, శివసేన సభ్యులు లేవనెత్తిన మావోయిస్టు సమస్యపై నేడు లోక్‌సభలో చర్చ జరగనుంది. ఈ సందర్భంగా హోంమంత్రి అమిత్ షా మావోయిజంపై కీలక ప్రకటన చేయనున్నారు. దేశంలో మావోయిజం పూర్తిగా నిర్మూలన అయిందని ప్రకటిస్తారా లేదా అజ్ఞాతంలో ఉన్న నేతలు, కేడర్ లొంగుబాటుకు మరింత గడువును పొడిగిస్తారా అనే అంశంపై తీవ్ర చర్చజరుగుతోంది.


# మావోయిజం నిర్మూలనకు ఆరంభం ఇక్కడి నుండే..

## రెండేళ్ల క్రితం ధర్మారం బేస్ క్యాంప్‌పై మావోయిస్టుల మెరుపుదాడి

## ప్రతిష్టాత్మకంగా తీసుకున్న భద్రతా బలగాలు

## వెంటాడి వేటాడి తుదముట్టించిన వైనం





చర్ల, మార్చి 30 (మనం న్యూస్) : మావోయిజం నిర్మూలనకు ఆరంభం ఛత్తీస్గడ్ రాష్ట్రంలోని బీజపూర్ జిల్లా పామేడ్ పోలీస్ స్టేషన్ పరిధి ధర్మారం బేస్ క్యాంప్ నుండే ప్రారంభమయింది. ఆపరేషన్ కగార్ 2024 జనవరి 1 వ తేదీ నుండి ప్రారంబించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో 2023 డిసెంబరులో ధర్మారం, చింతవాగు, పామేడ్ లలో ఒకేసారి మూడు బేస్ క్యాంప్ లను ప్రారంబించారు. తమ కంచుకోటయిన ఈ ప్రాంతంలో భద్రతా బలగాలు బేస్ క్యాంప్ లను ఏర్పాటు చేయడాన్ని మావోయిస్టులు జీర్ణించుకోలేకపోయారు. కేంద్ర కమిటీ సభ్యుడు మడివి హిడ్మా, బార్సె దేవా నేతృత్వంలో 600 మందికి పైగా మావోయిస్టులు పామేడ్ పోలీస్ స్టేషన్ పరిధి పాలగూడలో సమావేశమయ్యారు. దాదాపు 20 రోజులపాటు అక్కడే ఉండి ధర్మారం బేస్ క్యాంప్ పై దాడికి ప్రణాళిక రచించారు. 15 నుండి 20 సార్లకు పైగా రెక్కీ నిర్వహించారు. చివరకు 2024 జనవరి 16 వ తేదీ రాత్రి 10 గంటల నుండి ధర్మారం, చింతవాగు, పామేడ్ బేస్ క్యాంప్, పామేడ్ పోలీస్ స్టేషన్ లను చుట్టుముట్టి ఏకకాలంలో భీకరదాడికి దిగాయి. బేస్ క్యాంప్ లపై 15 వందల నుండి 2 వేల వరకు బిజిఎల్ రాకెట్ లాంచర్స్, ఇతర ఆయుధాలతో విరుచుకుపడ్డారు. అప్రమత్తమైన భద్రతా బలగాలు వెలుతురు బాంబుల సహాయంతో చిమ్మచీకటిలో మావోయిస్ట్ లకు ధీటుగా బదులిచ్చి దాడిని తిప్పికొట్టాయి. ఆ రోజు రాత్రి 10 గంటలకు ప్రారంభమైన దాడి తెల్లవారుజాము 3 గంటల వరకు కొనసాగింది. ఈ దాడిలో నలుగురు మావోయిస్టు లు మృతిచెందగా అనేకమంది గాయపడ్డారు. భద్రతా బలగాల వైపు నుండి ప్రాణనష్టం లేకపోయిన 10 మందికి పైగా జవాన్లకు గాయాలయ్యాయి. తెల్లవారిన తర్వాత అక్కడి పరిస్థితిని చూసిన వారికి యుద్ధభూమి తలపించింది. వందల సంఖ్యలో పడి ఉన్న పేలిన, పేలని రాకెట్ లాంచర్లను భద్రతా బలగాలు స్వాదీనపరుచుకున్నాయి. ఈ దాడిని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కేంద్రం, ఛత్తీస్గడ్ రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు లపై ముప్పేటదాడికి దిగాయి. జీడిపల్లి 1, జీడిపల్లి 2, కవరగట్ట, కొండపల్లి, గుండం, తదితర ప్రాంతాలలో ప్రతి 5 కిలోమీటర్లకు ఒక బేస్ క్యాంప్ లను ఏర్పాటు చేసాయి. మరోవైపు సుక్మా జిల్లాలో కిష్టారం, గొల్లపల్లి, జేగరుగొండ, పూవర్తి వైపు అడుగడుగునా సిఆర్పిఎఫ్ క్యాంప్ లను ఏర్పాటు చేసారు. పూసుగుప్ప, బీమారం, పూజారి కాంకేర్, నంబి, ఊసూరు వైపు పలు క్యాంప్ లను ఏర్పాటు చేసి మావోయిస్టులపై ముప్పేటదాడికి దిగారు. బీజపూర్, సుక్మా, దంతెవాడ జిల్లాలలోని దండకారణ్యం, నేషనల్ పార్క్, కర్రెగుట్టలపై పట్టు సాదించి వారి కంచుకోటలోకి చొచ్చుకెల్లాయి. మావోయిస్ట్ లను చెల్లాచెదురు చేసారు. వరుస ఎన్ కౌంటర్లలో పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ, రాష్ట్ర కమిటీ, వివిద కేడర్లకు చెందిన వందలమందిని హతమార్చారు. భద్రతా బలగాల దాటికి మావోయిస్టు లు కకావికలమయ్యారు.

పెద్ద ఎత్తున అరెస్టులు చేస్తూనే లొంగుబాట్లను ప్రోత్సహించారు. భద్రతా బలగాల దెబ్బకు దండకారణ్యంపై మావోయిస్ట్ లు పూర్తిగా పట్టు కోల్పోయారు. మావోయిజం నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం విదించిన గడువు ముగిసేందుకు ఒక్కరోజు ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం ఇక్కడ 100 నుండి 150 లోపు మావోయిస్టులు ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. దండకారణ్యంలో నాయకుడిగా ఉన్న పాపారావు ఇటీవల లొంగిపోవడంతో మావోయిస్టు పార్టీకి అక్కడ నాయకుడే లేకుండా పోయారు. ఏసిఎం కేడర్ కు చెందిన కొద్దిమంది ఉన్నా వారుకూడా అతి త్వరలో లొంగిపోతారని పోలీసులు భావిస్తున్నారు.

# భద్రాద్రి జిల్లాలో 'రేడియాలజీ' సేవల్లో నూతన రికార్డ్

- డి సి చ్ ఎస్ డాక్టర్ రవి బాబు
- అన్ని ఏజెన్సీ ఆసుపత్రుల్లో అందుబాటులో రేడియాలజిస్టులు
- టిఐఎఫ్ఎఫ్ఎ స్కాన్ సేవలు
- గిరిజన గర్భిణి మహిళలకు వరంగా మారనున్న స్కానింగ్ సేవలు



భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 30 (మనంప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రభుత్వ వైద్యరంగం మరో కీలక మైలురాయిని అధిగమించింది. జిల్లా వ్యాప్తంగా అన్ని ఏజెన్సీ ఆసుపత్రుల్లో రేడియాలజిస్టులను నియమించి, టిఐఎఫ్ఎఫ్ఎ స్కాన్ (టార్గెటెడ్ ఇమేజింగ్ ఫైర్ ఫెటల్ అనొమలిస్) వంటి అత్యాధునిక స్కానింగ్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి భద్రాద్రి వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులు నూతన రికార్డును నెలకొల్పాయని డి సి చ్ ఎస్ డాక్టర్ రవి బాబు తెలిపారు దూర ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన మాతృశిశు వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జిల్లా అధికారులు దశలవారీగా తీసుకున్న చర్యలు ఫలితాన్నిస్తున్నాయి. గతంలోనే అన్ని ప్రధాన ఆసుపత్రుల్లో ప్రసూతి వైద్యులను నియమించడం ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రసూతి సేవలు గణనీయంగా మెరుగుపడ్డాయి. ఫలితంగా ప్రతి నెల డెలివరీలు, సిజేరియన్ శస్త్రచికిత్సలు, ట్యూబెక్టమీలు, ఇతర మాతృసేవలు పెరిగాయి. ఈ క్రమంలో రేడియాలజీ సేవలను మరింత బలోపేతం చేస్తూ, భద్రాచలం, ఎల్లందు, పాల్వంచ, మణుగూరు ఆసుపత్రుల్లో ఇప్పటికే టిఐఎఫ్ఎఫ్ఎ స్కాన్ సేవలు అందుబాటులో ఉండగా, అశ్వారావుపేట మరియు చర్ల ప్రాంతాల్లో రేడియాలజిస్ట కొరత ఒక ప్రధాన సవాలుగా నిలిచింది. గత కలెక్టర్ జితేష్ పాటిల్ మరియు డీసీహెచ్ఎస్ డా. రవి బాబు ప్రయత్నాలతో ఖీఐఊఊఅ స్కానింగ్ యంత్రాలు సమకూర్చబడగా, ప్రస్తుత జిల్లా కలెక్టర్ అంకిత్ చొరవతో కొత్త రేడియాలజిస్టు అశ్వారావుపేట, చర్ల ఆసుపత్రులకు నియమించి ఈ లోటును పూర్తిగా అధిగమించారు. సహజంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రేడియాలజిస్టను నియమించడం అత్యంత క్లిష్టమైన పని అయినప్పటికీ, జిల్లా పరిపాలన పట్టుదల, సమన్వయంతో ఈ సవాల్ను విజయవంతంగా ఎదుర్కొని, జిల్లాలోని ఆరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తి స్థాయిలో రేడియాలజీ సేవలను అందుబాటులోకి తీసుకురావడం విశేషం. ఇప్పటి వరకు అన్ని మాతృసేవలు అందుబాటులో ఉన్నప్పటికీ టిఐఎఫ్ఎఫ్ఎ స్కాన్ లేకపోవడం ఒక లోటుగా ఉండగా, ఇప్పుడు ఈ సౌకర్యం అందుబాటులోకి రావడంతో గర్భిణీలు పూర్తి స్థాయి మాతృసేవలను తమ ప్రాంతాల్లోనే పొందగలుగుతున్నారు. గర్భంలోని శిశువు అవయవాల అభివృద్ధిని వివరంగా పరిశీలించి, పుట్టుకలో వచ్చే లోపాలను ముందుగానే గుర్తించేందుకు టిఐఎఫ్ఎఫ్ఎ స్కాన్ ఎంతో ఉపయోగపడుతుంది. ఇది గర్భిణీకి సకాలంలో సరైన వైద్య నిర్ణయాలు తీసుకునేందుకు సహాయపడుతూ తల్లి-శిశువు భద్రతను మెరుగుపరుస్తుంది.అలాగే గర్భిణి స్త్రీలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ప్రయాణ సమయాన్ని, ఖర్చులను తగ్గిస్తుంది. ప్రత్యేకంగా పేద మరియు గిరిజన గర్భిణీలకు ఈ సేవలు ఎంతో మేలు చేస్తాయని, ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని డి సి చ్ ఎస్ డాక్టర్ రవి బాబు తెలిపారు.



# గంజి నారాయణకు పలువురి నివాళి

మధిర, మార్చి 30(మనం న్యూస్): తెలుగుదేశం సీనియర్ నాయకులు గంజి నారాయణరావు సంస్మరణ సభ సోమవారం శ్రీరస్తు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేశారు. ఈ సంస్మరణ సభలో మధిర తెలుగుదేశం నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం పాల్గొని గంజి నారాయణ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. అనంతరం గంజి నారాయణ ఫోటో మెమరీస్ ని తిలకించి వారితో ఉన్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తూమాటి నర్సిరెడ్డి, దేవిశెట్టి రంగారావు, ఐతం ప్రసాద్ చుంచు విజయ్, పగిలిపల్లి శ్రీనివాసరావు, గుర్రం గోపాలకృష్ణ, అనుములు బుద్ధిసాగర్, గంగరాజు, రాయల ప్రసాద్, భాజా నరసింహారావు, గుర్రం వీరప్రసాద్, కోట వెంకటకృష్ణ లు పాల్గొని నివాళులర్పించారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

## కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

## ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం, మార్చి 30(మనం బ్యూరో): ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన పి. నాగుల్ మీరా తమ గ్రామంలో వారం రోజులుగా పిచ్చి కుక్కలు తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని, ఇట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎంపిడిఓ/ ఎంపిఓ లకు రాస్తూ వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

కామేపల్లి మండలం శివారు లాల్లతండ నివాసులు, గ్రామంలో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతూ, అమ్మకాలు చేస్తున్నారని, ఈ భూమిని కాపాడి ప్రభుత్వ అభివృద్ధి పనులకు వినియోగించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ, తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం కార్పొరేషన్ శ్రీరామ్ నగర్ రోడ్ నెంబర్ 13 కు చెందిన ప్రజలు తమకు సీసీ రోడ్లుతో పాటు సైడ్ డ్రైనేజీ, మిషన్ భగీరథ పైప్ లైన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ఢాడి లంబాడి హక్కుల సాధన సమితి కార్యదర్శి డీ. శేఖర్ నాయక్ ఖమ్మం గ్రామీణ ప్రాంతంలో మున్నేరు నది సమీపంలో ఉన్న ఢాడి లంబాడ సమాజానికి చెందిన పూర్వీకుల సమాధి స్థలాన్ని రక్షించుటకు ప్రతిపాదిత రిటైనింగ్ వాల్ కు అనుబంధంగా ఉన్న సర్వీస్ రోడ్డు, డ్రైనేజ్ కాలువ నమూనా డిజైన్ మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం ఆర్డీఓ కు రాస్తూ పరిశీలించి తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ఖమ్మం అర్బన్ మండలం బుర్హాన్ పురంకు చెందిన పి. కృష్ణమూర్తి తనకు పక్షవాతం వచ్చి పది సంవత్సరాలు అవుతుందని దివ్యాంగుల పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నానని ఇప్పటివరకు మంజూరు కాలేదని తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డీఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 30(మనం ప్రతినిధి): ప్రజావాణి లో స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించే విధంగా వేగవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, గృహ నిర్మాణ శాఖాధికారి రవీంద్రనాథ్లతో కలిసి కలెక్టర్ ప్రజల వినతిపత్రాలను స్వయంగా స్వీకరించారు. జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా సమర్పించగా, వాటిని శ్రద్ధగా విన్న కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి తక్షణ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో స్వీకరించిన పలు దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై శాఖాధిపతులు వ్యక్తిగత పర్యవేక్షణ చేపట్టి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులో చర్యలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా సమర్థవంతమైన పరిపాలన అందించడం లో అధికారులు కట్టుబడి ఉండాలని తెలిపారు.

### ప్రజావాణి దరఖాస్తులలో ముఖ్యమైనవి..

కొత్తగూడెం మేదరబస్తీకి చెందిన మహమ్మద్ అబ్దుల్ వహాబ్, అశ్వరావుపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 911/33లో 5.00 గుంటల రిజిస్టర్ భూమి తన పేరున ఉన్నప్పటికీ, ఆర్ఎస్ఆర్ (ఖీఖీఖ) సమస్య కారణంగా పట్టాదారు పాస్పుస్తకం అందలేదని తెలిపారు. తన పేరున పట్టాదారు పాస్పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం భూభారతి విభాగానికి ఎండార్స్ చేశారు. టేకులపల్లి మండలం బేతంపూడి గ్రామానికి చెందిన ఆంగోతు సంతులాల్, సర్వే నంబర్ 239/282లో వ్యవసాయ భూమి ఉన్నదని, గతంలో ఇంద్రజల ప్రభ పథకం కింద బోరు మరియు విద్యుత్ మంజూరు అయినప్పటికీ, మోటార్ మీటర్కు సర్వీస్ నంబర్ ఇవ్వలేదని తెలిపారు. తన విద్యుత్ కనెక్షన్ కొనసాగించేలా సర్వీస్ నంబర్ మంజూరు చేయాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి విద్యుత్ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు. అళ్ళపల్లి మండలం చెలగట్టు గ్రామానికి చెందిన కొమరం సారమ్మ, తన భర్త మరణంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని, పీజీ (ఎంఏ) వరకు చదువుకున్న తన కుమార్తెకు ఉపాధి కల్పించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కు ఎండార్స్ చేశారు.

కొత్తగూడెం మేదరబస్తీ 53వ డివిజన్కు చెందిన శ్రీనివాస్, గత ఎనిమిదేళ్లుగా తమ ఇంటికి కిన్నెరసాని మంచినీటి సరఫరా నిలిచిపోయినప్పటికీ నీటి బిల్లులు విధిస్తున్నారని తెలిపారు. నీటి బిల్లులను రద్దు చేసి కొత్త కనెక్షన్ మంజూరు చేయాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్కు ఎండార్స్ చేశారు. పినపాక, ఏడుళ్ల బయ్యారం, జానంపేట మరియు టి. కొత్తగూడెం పరిసర ప్రాంతాలకు చెందిన ముస్లిం సోదరులు, రంజాన్ మరియు బక్రీద్ పర్వదినాలలో సామూహిక నమాజ్ నిర్వహించేందుకు తగిన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈద్గా స్థలం కేటాయించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి పినపాక తహసీల్దార్కు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యమాలతో సింగరేణిని కాపాడుకుందాం..

- ప్రభుత్వం నుండి రావాల్సిన 50 కోట్ల బకాయిలను యాజమాన్యం వసూలు చేయాలి
- పాత పద్ధతిలోనే మెడికల్ బోర్డును కొనసాగించాలి
- సిపిఐ పార్టీ జాతీయ నాయకులు డాక్టర్ కే.నారాయణ
- సింగరేణి పరిరక్షణ కోసం హెడ్ ఆఫీస్ ముందు భారీ ధర్నా

కొత్తగూడెం సింగరేణి, మార్చి 30(మనం న్యూస్):ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్న సింగరేణి కాలరీస్ కంపెనీని ఉద్యమాలతో పరిరక్షించుకుంటామని సిపిఐ పార్టీ జాతీయ నేత డాక్టర్ కె.నారాయణ అన్నారు. సింగరేణి కార్మికుల హక్కుల సాధన సింగరేణి పరిరక్షణ కొరకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)ఆధ్వర్యంలో సోమవారం సింగరేణి హెడ్ ఆఫీస్ ముందు జరిగిన ధర్నా విజయవంతమైంది. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఐ పార్టీ జాతీయ నాయకులు డాక్టర్ కే.నారాయణ మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని విమర్శించారు. సింగరేణి ఆధ్వర్యంలో కొత్త పరిశ్రమలు లేకపోవడం వల్ల సింగరేణి కంపెనీ విస్తరించిన ప్రాంతాలలో నిరుద్యోగ సమస్య తీవ్రతరమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త పరిశ్రమలను స్థాపించినట్లయితే నిరుద్యోగ సమస్య కొంతమేరకు తీరుతుందన్నారు. సింగరేణి సొమ్మును గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఎంతో దోచుకుందని అదే తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దోచుకోవడం విచారకరమన్నారు. సింగరేణి కంపెనీని పరిరక్షించాల్సింది పోయి రేవంత్ రెడ్డి ప్రభుత్వం భక్షిస్తుందన్నారు.

### నూతన బొగ్గు గనులను ప్రారంభించాలి..

సింగరేణి కాలర్స్ కంపెనీ ఆధ్వర్యంలో నూతన బొగ్గు గనులు ప్రారంభించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన నాయకులు రాజ్ కుమార్, వాసిరెడ్డి సీతారామయ్యలు కోరారు. పెరక్స్ పై ఇంకామ్ టాక్స్ కంపెనీనే చెల్లించాలన్నారు. మెడికల్ బోర్డు పాత విధానంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలను ఇవ్వాలన్నారు. ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.50 వేల కోట్ల బకాయిలను యాజమాన్యం రాబట్టాలని కోరారు. మారు పేర్లు, డిస్మిస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. స్వంత ఇంటి పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్ట్రక్చర్ కమిటీలో ఒప్పుకున్నవాటిని అమలు చేయాలని సూచించారు. మెడికల్ అయిన డిపెండెంట్ ఉద్యోగులకు వెంటనే ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను హైదరాబాదులో ఏర్పాటు చేసి సింగరేణి కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. సహజ మరణం పొందిన కార్మిక కుటుంబాలకు 25 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి హెడ్ ఆఫీస్ ముందు చేపట్టిన భారీ ధర్నాకు 11 ఏరియాలనుండి పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని హక్కుల కోసం నిన్నందించారు.



### నేలపై పడుకుని నిరసన తెలిపిన సిపిఐ పార్టీ జాతీయ నేత నారాయణ...

సింగరేణి కార్మికుల విషయంలో ఇటు యాజమాన్యం అటు కాంగ్రెస్ సర్కార్ అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ పార్టీ జాతీయ నాయకులు కే.నారాయణ సింగరేణి హెడ్ ఆఫీస్ ముందు చేపట్టిన ధర్నా కార్యక్రమం సందర్భంగా అక్కడ నేలపై పడుకొని నిరసన తెలిపారు. ఆయనతో పాటుగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషాతో సహా ఇతర సిపిఐ నాయకులు ఏఐటీయూసీ నాయకులు కార్మికులు సైతం నేలపై పడుకుని తమ నిరసనను తెలియజేశారు. కార్మికుల హక్కులను హరించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతుందని నినాదాలు చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి సింగరేణి అభివృద్ధికి తోడ్పడాలని హితవు పలికారు. లేకుంటే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని పలువురు నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన నాయకులతో పాటు కిందిస్థాయి నాయకులు అభిమానులు సిపిఐ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అగ్రనేతలకు..ఆఖరి ఆహ్వానం

- లొంగుబాట పట్టాలని గణపతికి డీజీపీ పిలుపు
- రెండేళ్లలో 721మంది మావోయిస్టుల లొంగుబాటు
- ప్రతీ ఒక్కరికీ పునరావాసం కల్పించాం
- నేటితో కేంద్ర ఇచ్చిన గడువు పూర్తి
- అగ్రనేతలు ఆలోచించి సరెండ్ కావాలి
- రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడి








హైదరాబాద్,మార్చి 30(మనం,ప్రత్యేక ప్రతినిధి) అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు కీలక నేత గణపతితో సహా మిగిలిన అగ్రనేతలు వెంటనే లొంగిపోవాలని డీజీపీ శివధర్ రెడ్డి పిలుపు నిచ్చారు. కేంద్ర ప్రభుత్వం విధించిన గడువు నేటి(మార్చి 21)తో ముగియనున్న నేపథ్యంలో డీజీపీ మీడియాతో మాట్లాడారు. మావోయిస్టు అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ్ రావు ఆరోగ్యం క్షీణించిందని తమకు సమాచారం ఉందని వెల్లడించారు. దాదాపు నాలుగున్న దశాబ్దాల పాటు మావోయిస్టు పార్టీకి వివిధ హోదాలలో సేవలందించిన గణపతి వెంటనే లొంగిపోవాలి. ఆయన లొంగిపోతే ప్రభుత్వ ఖర్చులతోనే పూర్తిస్థాయిలో మెరుగైన వైద్యం అందిస్తామని డీజీపీ భరోసానిచ్చారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు హింసా మార్గాన్ని విడనాడి, జనజీవన స్రవంతిలో కలిసి గౌరవప్రదమైన జీవితం కొనసాగించాలన్నారు.

గణపతితో పాటు అజ్ఞాతంలో ఉన్న ముఖ్య నేతలు కూడా వెంటనే లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. గడచిన రెండేళ్ల కాలంలో సుమారు 721 మంది మావోయిస్టులు లొంగిపోయారని, ప్రతి ఒక్కరికీ పునరావాసం కల్పించామని వెల్లడించారు. సరెండర్ అయిన ప్రతి ఒక్కరికీ హోదాలతో సంబంధం లేకుండా ప్రభుత్వం తరపున అన్ని రకాల ప్రయోజనాలతో పాటు మెరుగైన పునరావాసం కల్పించామని గుర్తు చేశారు. ఆయుధాలు వీడి వస్తే, సమాజంలో తలెత్తుకుని జీవించేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. కాగా మావోయిస్టులకు కేంద్ర ప్రభుత్వం విధించిన గడువు మంగళవారం నాటితో ముగియనుందని అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు పార్టీ అగ్రనేతలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని లొంగిపోవాలని డీజీపీ శివధర్ రెడ్డి కోరారు.

**అజ్ఞాతంలో...అగ్రనేతలు :**

కేంద్ర విధించిన గడువు ముగుస్తున్నప్పటికీ తెలంగాణకు చెందిన ఏడుగురు మావోయిస్టులు ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నారని డీజీపీ వివరించారు. వారిలో జగిత్యాల జిల్లాకు చెందిన ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, హనుమకొండ జిల్లాకు చెందిన పసునూరి నరహరి అలియాస్ సంతోష్ , సికింద్రాబాద్‌కు చెందిన వర్త శేఖర్ అలియాస్ మంగ్తు, గద్వాలకు చెందిన జోడే రత్నబాయి అలియాస్ సుజాత(గణపతి భార్య), హైదరాబాద్‌కు చెందిన నక్క సుశీల అలియాస్ రేలా, సిద్దిపేట జిల్లాకు చెందిన రంగబోయిన భాగ్య అలియాస్ రూపి ఉన్నారని డీజీపీ వెల్లడించారు. వీరంతా ఆయుధాలు వీడి జనంలోకి రావాలని విజ్ఞప్తి చేశారు. ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి జనంలోకి తిరిగి వస్తే తగిన వైద్యం అందిస్తామని ప్రభుత్వం తరపున హామీ ఇచ్చారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు కీలక మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిశారని, ఈ నేపథ్యంలో మిగిలిన ముఖ్య నేతలు సైతం లొంగుబాటు పట్టే అవకాశాలున్నాయని డీజీపీ ఆశాభావం వ్యక్తం చేశారు.

**గడువు...దాటితే..!**

కేంద్రం హెచ్చరికల మేరకు మార్చి 31న మావోయిస్టులకు 'డెడ్'లైన్ పూర్తవుతుంది. తాము అజ్ఞాతం వీడి జనం మధ్య, ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్య విధానంలో పోరాటాలు చేస్తామని ఇప్పటికే లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యులు తెలిపారు. అదే సమయంలో మావోయిస్టు పార్టీపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని కోరుతున్నారు. కేంద్రం స్పందించి మావోయిస్టు పార్టీపై నిషేధం ఎత్తివేస్తే అజ్ఞాతంలో ఉన్న మిగిలిన మావోయిస్టులంతా ఆయుధాలు వీడి లొంగిపోయేలా తాము కృషి చేస్తామని చెబుతున్నారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డితో సమావేశంలోనూ కీలక మావోయిస్టు నేతలు ఈమేరకు ప్రతిపాదించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇదే విషయాన్ని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను ఢిల్లీలో కలిసి చెప్పారు. వీరి ప్రతిపాదనలకు కేంద్రం నుంచి సానుకూలత రావడం, తాజాగా డెడ్‌లైన్ ముగియనున్న నేపథ్యంలో అజ్ఞాతంలో ఉన్న గణపతి సహా ఏడుగురు మావోయిస్టులు లొంగిపోనున్నట్టు తెలుస్తోంది. మొత్తం మీద మావోయిస్టుల లొంగుబాటులో రాష్ట్ర ప్రభుత్వం, ఎస్ఐబీ పోలీసుల కృషిపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. కాగా మంగళవారం సాయంత్రం లోపు గణపతితో సహా మిగిలిన నేతలు పోలీసుల ఎదుట లొంగిపోయే అవకాశాలున్నాయని ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి.

## పూర్వ ప్రాథమిక విద్యకు ప్రాధాన్యం అంగనవాడి కార్యకర్తలకు మార్గ నిర్దేశం



పోడూరు మార్చి 30 మనం న్యూస్ : పాలకొల్లు ప్రాజెక్టు పరిధిలోని పోడూరు మండలం పోడూరు, జిన్నూరు సెక్టార్లకు సంబంధించిన సమీక్షా సమావేశం ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఓ ఉమా అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశానికి ప్రాజెక్టు డైరెక్టర్ డి. శ్రీ లక్ష్మీ ముఖ్య అతిథిగా హాజరై అంగనవాడి కార్యకర్తలకు పలు ముఖ్య సూచనలు చేశారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ డి. శ్రీ లక్ష్మీ మాట్లాడుతూ, పూర్వ ప్రాథమిక విద్య పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది వంటిదని తెలిపారు. ఆర్ఎల్ఎం, ఎంఎస్జి వంటి రిమోట్ లెర్నింగ్ మెసేజ్లను మదర్స్ గ్రూప్కు తప్పనిసరిగా పంపించాలని, పిల్లలతో వర్క్బుక్స్ వ్రాయించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి నెల నాలుగవ శనివారం నిర్వహించే సిసిఈ డే కార్యక్రమంలో సంబంధిత పుస్తకాలను చూపించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు.అలాగే ప్రీ స్కూల్ నమోదు సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని, ఏప్రిల్ నెలలో సర్వే నిర్వహించి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఎఫ్ఆర్ఎస్ ద్వారా పౌష్టికాహారం అందించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న తీవ్రమైన ఎండల నేపథ్యంలో ప్రీ స్కూల్ పిల్లలను జాగ్రత్తగా చూసుకుంటూ తరచూ మంచినీరు త్రాగించేలా చూడాలని, అనంతరం వారిని తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించాలని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏసిడిపిఓ పి. నాగరత్నం, సెక్టార్ సూపర్వైజర్లు ఎం.డి. హసీనా, కె. మోహన రాణి, పి. సత్యవేణి, అంగనవాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల భద్రత కోసం పోలీసుల ప్రత్యేక చొరవ

- ప్రజా సేవలో పోలీస్ శాఖ మరో ముందడుగు
- పసరలో భారీ స్థాయిలో ఉచిత కంటి పరీక్ష వైద్య శిబిరం
- 500 మందికి సేవలు, 300 మందికి కళ్ల అద్దాలు పంపిణీ
- ములుగు డీఎస్పీ కిషోర్




ములుగు, మార్చి 30,మనం ప్రతినిధిః ములుగు జిల్లా, పసర లో సోమవారం.రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ ప్రోగ్రామ్లో భాగంగా పసరలో ఉచిత కంటి చూపు వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ కేకన్ ఆదేశాల మేరకు, డీఎస్పీ కిషోర్ సూచనలతో, సీఐ దయాకర్ పర్యవేక్షణలో పసర ఎస్ఐ తాజుద్దీన్ ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది. పసరలోని ఎస్ఎస్ గార్డెన్స్లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి శరత్ మాక్సి విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి హాస్పిటల్ వరంగల్ వైద్య నిపుణుల బృందం సహకారం తో. ఈ శిబిరంలో సుమారు 560 మంది డ్రైవర్లు, వాహన యజమానులు, యువత, వృద్ధులు, గ్రామస్తులు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు నిర్వహించిన పరీక్షల అనంతరం 300 మందికి ఉచితంగా కళ్ల అద్దాలు పంపిణీ చేయడం జరిగింది. మరో 200 మంది రోగులను ప్రత్యేక వైద్య పరీక్షలు మరియు శస్త్రచికిత్సల కోసం ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేయడం జరిగింది. ఈ కారకానికి ముఖ్యఅతిథిగా ములుగు డిఎస్పి కిషోర్ సార్. పసర సిఐ దయాకర్ సార్ ఎస్ ఐ తాజుద్దీన్ సార్ లు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో కంటి చూపు కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ముఖ్యంగా డ్రైవర్లు కంటి ఆరోగ్యంపై నిరంతరం శ్రద్ధ వహించాలని సూచించారు. సరైన చూపు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆయన హెచ్చరించారు.



### రాకాప విజయలక్ష్మి నీ సన్మానించిన మాజీ ఎంపీ

అల్లవరం మార్చి 30 మనం న్యూస్ ప్రతినిధి: రాష్ట్ర వ్యాప్తంగా 24 గ్రామ పంచాయతీలను అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాల (ఐఖి) సర్టిఫికేట్ కోసం ఎంపిక చేయగా, అందులో అల్లవరం మండలం కొమరగిరిపట్నం గ్రామ పంచాయతీకి ఈ ప్రతిష్టాత్మక ఐఖి సర్టిఫికేట్ లభించడం గర్వకారణమని పేర్కొంటూ, గ్రామ సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి ని అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి , సర్పంచ్ బ్రె సీతారత్నం , తదితరులు పాల్గొన్నారు.

## సమాజ అభివృద్ధిలో పీ4 కీలక పాత్ర

- ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్



నరసాపురం, మార్చి 30 (మనం న్యూస్) : సమాజ అభివృద్ధిలో సేవా కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ 4 పథకం మొదటి వార్షికోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీ4 కార్యక్రమంలో భాగంగా నరసాపురం నియోజకవర్గంలో బంగారు కుటుంబాలకు అందించిన సేవలకు గాను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజుతో కలిసి పీ4 మార్గదర్శులను శాలువాలతో సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో పి4 కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ పథకం ద్వారా గత సంవత్సర కాలంలో ప్రజలకు ఉపయోగకరమైన అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూమంచి గుర్తింపు సాధించిందని అన్నారు. ముఖ్యంగా బంగారు కుటుంబాల అభ్యున్నతికి చేసిన కృషి అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమం మరింత విస్తృతంగా కొనసాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## పేదలకు గూడు – మోదీ గ్యారెంటీ : డాక్టర్ ఏలూరి



మార్కాపురం,మార్చి,30,(మనం న్యూస్): ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పంతో పేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించే లక్ష్యంతో అమలు చేస్తున్న ప్రధానమంత్రి అవాస్ యోజన దేశవ్యాప్తంగా విశేష ఫలితాలను అందిస్తున్నదని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ పథకం ద్వారా పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే కాకుండా, వారికి భద్రతతో కూడిన భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతోందని పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలో వేలాదిగా పక్కా ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ఆనందదాయకమని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభం కావడం అభినందనీయమని అన్నారు. ఇది కేవలం ఇళ్ల నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాకుండా, పేదల భవిష్యత్తు నిర్మాణానికి కీలక అడుగుగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి పేదవాడికి సొంత ఇల్లు కల్పించడం మోదీ హామీ అన్నారు, కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఈ సంకల్పం సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధికి నిదర్శనమని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. ప్రధానమంత్రి అవాస్ యోజన ద్వారా దేశంలోని లక్షలాది కుటుంబాలు తమకంటూ ఒక గూడు ఏర్పాటు చేసుకుని హాయిగా జీవనం సాగిస్తున్నారని ఏలూరి అన్నారు.

### శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి సన్నిధిలో కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ



పాలకొల్లు, మార్చి 30,మనం ప్రతినిధి : పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు లో వేంచేసి ఉన్న, ప్రసిద్ధ పంచరామ క్షేత్రం శ్రీ క్షీరారా రామలింగేశ్వర స్వామి ని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ సోమవారం దర్శించుకున్నారు. ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, దేవస్థానం కమిటీ చైర్మన్ మీసాల రామచంద్రరావు,వేద పండితులు, ఆలయ మర్యాదలతో శ్రీనివాస్ వర్మకు స్వాగతం పలికి, స్వామివారి దర్శనం అనంతరం చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాంటిసోరి స్కూల్ అధినేత కె. వి కృష్ణ వర్మ, బిజెపి నాయకులు జక్కంపూడి కుమార్, ఎర్రం శెట్టి పద్మారావు కొల్లి కొండ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాసాలో బుధవారం జాబ్ మేళా

కాత్రేనికోన మార్చి 30 మనం ప్రతినిధి :శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల చెయ్యేరు నందు ఏప్రిల్ 01 వ తేదీ బుధవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ జాబ్ మేళా నందు ఫోస్కాన్ , టాటా ఎలక్ట్రానిక్స్ , కంపెనీలో మొబైల్ ఆపరేటర్, సుందరం ఫాస్ట్నర్ (టీవీఎస్), అపోలో టైర్స్ లిమిటెడ్ లో నాప్స్ టెక్నీషియన్, బ్రేక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ లో ట్రైనీ ఉద్యోగులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారన్నారు ఈ ఉద్యోగాలకు డిప్లమో , మరియు బీటెక్ ఉత్తీర్ణులై 25 సంవత్సరాలు లోపు గల అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ. 16500/- నుండి 23000/- వరకు జీతం మరియు ఇన్సెంటివ్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఉంటుందని ఆసక్తిగల అభ్యర్థులు ఏప్రిల్ 01 వ తేదీన కళాశాలలో జరిగే మేళాకు ఉదయం 9.30 గంటలకు సర్టిఫికెట్ జిరాక్స్ తో హాజరు కావాలని తెలిపారు.

## చెయ్యేరు సుబ్బరాజును సన్మానించిన ప్రభుత్వ విప్




కాత్రేనికోన మార్చి 30 మనం ప్రతినిధి : తెలుగు దేశం పార్టీలో కార్యకర్తలే వెన్నెముక అని,కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు, పదవులు లభిస్తాయని ప్రభుత్వ విప్ ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు తెలిపారు, కాత్రేనికోన మండల పరిధిలో చెయ్యేరు గ్రామంలో జరిగిన సమావేశంలో సుమారు 40 సంవత్సరాల పాటు తెలుగుదేశం పార్టీలో వివిధ పదవులు చేసిన మండల టిడిపి మాజీ అధ్యక్షులు నడింపల్లి సుబ్బరాజును సన్మానించారు,పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తల త్యాగాలే కారణమన్నారు, అందుకే కార్యకర్తే అధినేత అనే కొత్త సంప్రదాయాన్ని తెదేపాలో తీసుకు వచ్చినట్లు ఎమ్మెల్యే బుచ్చిబాబు పేర్కొన్నారు.కష్టపడే వారికి సర్టిఫికెట్లు కాకుండా,రాజకీయ అవకాశాలు కల్పించబడుతాయన్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద,ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్,జిల్లా టీడీపీ అధ్యక్షుడు గుత్తుల సాయి,కాత్రేనికోన మండల టిడిపి అధ్యక్షుడు చెల్లి సురేష్,ఐ పోలవరం టీడీపీ అధ్యక్షుడు సాగరాజు సూరిబాబు రాజు,మురమళ్ళ వీరేశ్వర స్వామి దేవస్థానం ఆలయ కమిటీ సభ్యులు త్సవటపల్లి నాగేంద్ర రావు(నాగు),సొసైటీ చైర్ పర్సన్ త్సవటపల్లి శ్రీనివాస్,కాత్రేనికోన మండల తెలుగు రైతు అధ్యక్షులు సుధా రాఘవేంద్ర, నాయకులు సుధా బాబురావు,సలాది నానాజీ,నామా వెంకటేశ్వర రావు,కొంకి శ్రీనివాస్ రావు,తదితరులు పాల్గొన్నారు.

### ద్వారకాతిరుమలను నియోజకవర్గం కేంద్రంగా ఏర్పాటు చేయాలి



ద్వారక తిరుమల మార్చి 30 మనం ప్రతినిధి: నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమలను నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలని ద్వారకాతిరుమల జనసేన పార్టీ అధ్యక్షులు దాకారపు నరసింహమూర్తి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అసెంబ్లీ స్థానాలు 50 శాతం పెంచాలని నిర్ణయం తీసుకుని ఈ బిల్లును ఆమోదించడానికి పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టాలని ద్వారకాతిరుమల శ్రీవారి పుణ్యక్షేత్రం ,పారిశ్రామికంగా అభివృద్ధి చెందిందన్నారు. ద్వారకా తిరుమల చుట్టూ ఉన్న కామవరపుకోట, భీమడోలు ,మండలాలు కలుపుకుని ద్వారకాతిరుమల నియోజకవర్గం కేంద్రంగా ఏర్పాటు చేయాలని దీనికి పార్టీలు అతీతంగా అందరూ కృషి చేయాలని నియోజకవర్గ కేంద్రంగా ద్వారకాతిరుమలను ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల ఉన్నటువంటి రైతాంగం కూడా అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు.

## రహదారి పనులను ప్రారంభించిన శాసనసభ విప్ దాట్ల సుబ్బరాజు



ముమ్మిడివరం,మార్చి 30,మనం న్యూస్: ఐ.పోలవరం మండలం గుత్తినదీవి గ్రామంలో సుమారు రూ. 191.69 లక్షల భారీ వ్యయంతో నిర్మించిన సీసీ రహదారి మరియు గ్రావెల్ మెటల్ రోడ్ను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు సోమవారం ప్రారంభించారు.ఐ పోలవరం మండలం కేసనకుర్రు గ్రామంలో బీటీ రహదారి సీసీ రోడ్ మరియు డ్రైన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గౌరవ ప్రభుత్వ మరియు ముమ్మిడివరం శాసనసభ్యులు శ్రీ దాట్ల సుబ్బరాజు గారు.ఐ.పోలవరం మండలం కేసనకుర్రు గ్రామంలో సుమారు రూ. 228.39 లక్షల భారీ వ్యయంతో నిర్మించిన బీటీ రహదారి మరియు సీసీ రోడ్ మరియు డ్రైన్ పనులను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐ.పోలవరం మండల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తూ రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ పనుల ద్వారా ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా అందుబాటులోకి వస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు చెలి వివేకానంద, కూటమి నేతలు కార్యకర్తలు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## లబ్ధిదారులకు గృహాలను అందజేసిన శాసనసభ విప్ దాట్ల సుబ్బరాజు



ముమ్మిడివరం,మార్చి 30,మనం న్యూస్: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన గృహప్రవేశాల కార్యక్రమంలో భాగంగా, కాలనీలలో లక్షన్నర గృహాలు మరియు మరొక లక్ష టిడ్కో గృహాలు కలిపి మొత్తం సుమారు 2.5 లక్షల గృహాలను సోమవారం శాసనసభ విప్ మరియు శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా ముమ్మిడివరం నియోజకవర్గం, ముమ్మిడివరం మండలం పల్లిపాలెం గ్రామంలో నిర్మించిన గృహాలను ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు గృహాలను అందజేస్తూ, వారి జీవితాల్లో కొత్త ఆశలు నింపే ఈ కార్యక్రమం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. పేదలకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా వేలాది కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ రవివర్మ,సీనియర్ నాయకులు తాడి నరసింహారావు, కూటమి నేతలు ,కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతి అక్రమ వలసదారునూ పంపేయాలి

## అమిత్ షా వ్యాఖ్య



డిస్పూర్, మార్చి 30: గత పదేళ్లుగా అస్సాంలో అక్రమ చొరబాట్లను బీజేపీ ప్రభుత్వం అడ్డుకుందని, ఇదొక్కటే సరిపోదని, ప్రతి అక్రమ వలసదారునూ వెనక్కి పంపాల్సిందేనని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. రానున్న ఐదేళ్లలో దేశంలోని ప్రతి అక్రమ వలసదారును పంపించివేస్తామని పేర్కొన్నారు. అస్సాంలోని ఢెకియాజులీలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. అక్రమ వలసదారులు అస్సాం యువత ఉపాధిని లాక్కుంటున్నారని, పేదల ఆహారాన్ని కొల్లగొడుతున్నారని తెలిపారు. చొరబాటుదార్లను రక్షించడానికే ఓటర్ల జాబితాల సవరణను (సర్) కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు.అస్సాంలో హ్యాట్రిక్ సాధిస్తామని బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ స్పష్టం చేశారు. మార్గరిటాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాలు చేశాయని విమర్శించారు.

# ఇరాన్‌లో అణుకేంద్రాలు పూర్తిగా ధ్వంసం..!

## ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ వెల్లడి



టెహ్రాన్, మార్చి 30: ఇరాన్‌లోని రెండు ప్రధాన అణుకేంద్రాలపై ఇటీవల దాడులు జరిగాయి. అందులో ఒకటి అరాక్లోని భారజల రియాక్టర్. ఆ దాడిలో ఈ భారజల ఉత్పత్తి కేంద్రం తీవ్రంగా ధ్వంసమైందని తాజాగా ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ వెల్లడించింది. ప్రస్తుతం అక్కడ ఉత్పత్తి నిలిచిపోయిందని పేర్కొంది. అయితే, ఇక్కడ అణుధార్మిక పదార్థాలు ఉన్నట్లు అధికారికంగా ఎటువంటి సమాచారం లేదని తెలిపింది.

మార్చి 27న జరిగిన ఈ దాడులను ఇరాన్ ధ్రువీకరించింది. అయితే ప్రాణనష్టమేమీ జరగలేదని, రేడియేషన్ వ్యాప్తి ముప్పు కూడా లేదని స్పష్టంచేసింది. ఈ దాడులకు పాల్పడింది తామేనని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. మరోవైపు, ఉత్తర ఇరాన్‌లోని తబ్రిక్ పెట్రో కెమికల్ కర్మాగారం పైనా దాడి జరిగింది. ఇక్కడ చమురు, గ్యాస్, ప్లాస్టిక్ వంటి కెమికల్ ఉత్పత్తులను తయారుచేస్తున్నారు. ఈ దాడిలో ప్లాంట్ ధ్వంసమైనట్లు తెలుస్తోంది.

ఇదిలాఉండగా.. తమపై నిరంతర దాడులకు ప్రతీకారం తీవ్రంగా ఉంటుందని ఇరాన్ మరోసారి గట్టి హెచ్చరికలు చేసింది. పశ్చిమాసియాలోని అమెరికా ఇజ్రాయెల్ కమాండర్లు, రాజకీయ ప్రముఖులే లక్ష్యంగా దాడులు చేస్తామని ఐఆర్జీసీ హెచ్చరించింది. ''వేల కిలోమీటర్ల దూరం నుంచి అమెరికా మాపై బెదిరింపులకు పాల్పడుతోంది. వాటిని మేం గట్టిగా ఎదుర్కొంటాం. బెదిరింపులు ఇలాగే కొనసాగితే వారి కమాండర్లు, సైనికులు పర్షియన్ గల్ఫ్‌లోని షార్క్‌లకు ఆహారమవుతారు'' అని ఐఆర్జీసీ అధికార ప్రతినిధి వార్నింగ్ ఇచ్చారు.

# హార్ముజ్లో సీమైన్ల పనిపట్టేందుకు..

## యూకే అండర్ వాటర్ డ్రోన్లు..!



లండన్, మార్చి 30: హర్మూజ్ జలసంధిలో శత్రునౌకలను టార్గెట్ చేసేలా 'సీమైన్స్' లేదా 'నేవల్ మైన్స్'ను ఇరాన్ ఉపయోగిస్తోన్న సంగతి తెలిసిందే. అమెరికా మిత్రదేశాల నౌకలు అడుగుపెడితే పేలిపోయేలా జలసంధిలో వాటిని పరిచింది. ఇప్పుడు వాటి పనిపట్టేందుకు అండర్ వాటర్ డ్రోన్లను రంగంలోకి దింపాలని యూకే యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ డ్రోన్లను తమ రాయల్ ఫ్లీట్ నౌకల్లో అమర్చేందుకు ప్రణాళిక చేస్తోంది. ఆ డ్రోన్ల సాయంతో ఆ సీమైన్స్‌ను గుర్తించి, నిర్వీర్యం చేయనుంది. అమెరికా తన మిత్రదేశాలతో కలిసి చేపట్టే భద్రతా మిషన్‌లో భాగంగా యూకే తన ఆర్‌ఎఫ్‌ఏ లైమ్‌బే నౌక (సపోర్ట్ షిప్)ను పశ్చిమాసియాకు పంపేందుకు సన్నాహాలు చేస్తోంది. బ్రిటన్‌కు చెందిన రాయల్ నేవీ ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడించింది. ఆ నౌక మైన్‌హంటింగ్ సామర్థ్యాలను పెంచుతున్నట్లు పేర్కొంది. ఆర్‌ఎఫ్‌ఏ లైమ్‌బేలో మామూలుగా నేవీకి సంబంధించిన పరికరాలు, వాహనాలు, బలగాలను తరలిస్తుంటారు. ఇప్పుడు దీనిని అప్‌గ్రేడ్ చేయనున్నారు. ఆ సీమైన్స్‌ను తొలగించడానికి చేపట్టనున్న ఆపరేషన్‌లో మామూలుగా వాడే మైన్ క్లియర్ షిప్లతో పాటు ఏఐతో నడిచే స్వయంప్రతిపత్తిగల డ్రోన్లను ఉపయోగించాలన్నది ప్లాన్.

ఈ డ్రోన్లు సెన్సర్లను వాడి సముద్రగర్భాన్ని స్కాన్ చేస్తాయి. సీమైన్స్‌ను గుర్తించి నిర్వీర్యం చేస్తాయి. అదే సమయంలో ఈ ఆపరేషన్‌లో భాగంగా యుద్ధ నౌకలు, ఎయిర్ క్రాఫ్ట్‌లను పంపి ఇంధన నౌకలకు సురక్షిత కారిడార్లను ఏర్పాటు చేయనున్నారు. ఇక అమెరికా పశ్చిమాసియాలో వేలాది మంది మెరైనర్లను మోహరించింది. గ్రౌండ్ ఆపరేషన్ లక్ష్యంగా వారిని పంపినట్లు వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే.

కాగా.. ఇరాన్ వద్ద దాదాపు 2,000 నుంచి 6,000 వరకు సీమైన్స్ ఉన్నట్లు అంచనాలు ఉన్నాయి. వీటిని చైనా, రష్యా నుంచి కొనుగోలు చేయడంతోపాటు.. సొంతంగా కూడా ఉత్పత్తి చేస్తోంది. 1980ల్లో ట్యాంకర్ వార్ వేళ భారీ సంఖ్యలో సీమైన్లను వాడి నౌకలను ధ్వంసం చేశారు. అదే సమయంలో సీమైన్స్ను తొలగించే మైన్‌స్వీపర్స్ పనితీరు చెప్పుకోదగ్గస్థాయిలో లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే అండర్ వాటర్ డ్రోన్లను దింపాలనుకున్నట్లు తెలుస్తోంది.

# అస్సాంలో కాంగ్రెస్ 5 గ్యారంటీలు

- తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లలో అమలు చేశాం
- ఇక్కడ కూడా అమలు చేస్తాం..
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే



డిస్పూర్, మార్చి 30: అస్సాం ప్రజలకు కాంగ్రెస్ పార్టీ 5 గ్యారంటీలను ప్రకటించింది. వీటిని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. నావోబోయిచాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో విడుదల చేశారు. ప్రతి మహిళకు నెలనెలా ఆర్థిక సాయం. వ్యాపారాన్ని ప్రారంభించాలనుకునే, విస్తరించాలనుకునే మహిళలకు ఒకేసారి రూ.50,000 సాయం...ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా... 10 లక్షల మందికి శాశ్వత భూపట్టాల పంపిణీ... సీనియర్ సిటిజన్లను నెలకు రూ.1,250...

100 రోజుల్లో ప్రముఖ గాయకుడు జుబిన్ గార్గ్ అనుమానాస్పద మరణం కేసు పరిష్కారం. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్లలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేశామని, అస్సాంలోనూ తప్పకుండా అమలు చేస్తామని ఈ సందర్భంగా ఖర్గే తెలిపారు. అస్సాంలో బీజేపీ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. అధికార పార్టీకి చెందిన ఒక కుటుంబానికే రాష్ట్రంలో 12,000 బిగాల భూమి (3,960 ఎకరాలు) ఉందని విమర్శించారు. ప్రభుత్వ భూములను అదానీ, రాందేవ్‌లకు దోచిపెడుతున్నారని ఆరోపించారు.

# కువైట్ పవర్ ప్లాంట్‌పై క్షిపణి దాడి..

- భారతీయుడు మృతి



బాగ్దాద్, మార్చి 30 : పశ్చిమాసియాలో యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాలుస్తోంది. తాజాగా కువైట్లోని విద్యుత్, నీటి శుద్ధి కర్మాగారాలపై ఇరాన్ దాడికి పాల్పడింది. ఈ ఘటనలో భారత్‌కు చెందిన ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ మేరకు కువైట్ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ క్షిపణి దాడి కారణంగా విద్యుత్, నీటిశుద్ధి కార్మాగారం వద్ద ఓ సర్వీస్ భవనం దెబ్బతిందని కువైట్ అధికారులు తెలిపారు. అయితే, ఈ ప్లాంట్ ఏ ప్రాంతంలోనిదో మాత్రం బయటపెట్టలేదు. ఘటన నేపథ్యంలో టెక్నికల్, ఎమర్జెన్సీ సహాయక బృందాలు అక్కడికి చేరుకున్నాయి. ప్లాంటు నిర్వహణ, అక్కడి పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇదిలాఉండగా, యూఏఈలో ఇటీవల ఓ భారతీయుడు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఇరాన్ క్షిపణులను యూఏఈ గగనతల రక్షణ వ్యవస్థ అడ్డుకోవడంతో.. దాని శకలాలు ఓ వీధిలో పడి భారతీయుడు సహా మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు.

# స్టాలిన్, విజయ్ నామినేషను



చెన్నై, మార్చి 30: తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతోంది. ఈ క్రమంలోనే ప్రచారం, నామినేషన్ల పర్వం జోరందుకుంది. తాజాగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, డీఎంకే నేత నామినేషన్ దాఖలు చేశారు. అటు టీవీకే అధినేత, నటుడు విజయ్ కూడా నామినేషన్ సమర్పించారు.

వరుసగా మూడు సార్లు కొలతూరు నియోజక వర్గం నుంచి గెలుపొందిన స్టాలిన్ మరోసారి అక్కడ నుంచే తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. నామినేషన్ పత్రాలు సమర్పించిన అనంతరం.. సీఎం రోడ్ షో నిర్వహించారు. ''ఢిల్లీకి వ్యతిరేకంగా తమిళనాడు పోరాడుతోంది. ఈసారి గొప్ప విజయాన్ని అందుకోబోతున్నాం'' అని స్టాలిన్ పేర్కొన్నారు.

ఇక, తమిళగ వెట్రి కళగం అధినేత, నటుడు విజయ్ ఈ ఎన్నికల్లో రెండు అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేస్తోన్న సంగతి తెలిసిందే.. పెరంబూర్, తూర్పు తిరుచ్చి నుంచి బరిలో దిగుతున్నారు. తాజాగా పెరంబూర్ స్థానంలో నామినేషన్ దాఖలు చేశారు. ఆయనను చూసేందుకు అభిమానులు, పార్టీ నాయకులు పెద్దఎత్తున వచ్చారు. ''నేను ఎంపిక చేసిన వారు కేవలం ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులు మాత్రమే కాదు. ప్రజల రక్షకులు కూడా. వారికి మీ మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నా'' అని విజయ్ కోరారు.

234 శాసనసభ స్థానాలున్న తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో డీఎంకే 164 స్థానాల్లో బరిలో దిగుతోంది. మరో 70 స్థానాలను కాంగ్రెస్ సహా తమ మిత్రపక్షాలకు కేటాయించింది. అటు టీవీకే అన్ని స్థానాల్లో పోటీ చేస్తోంది. ఇప్పటికే పలు పార్టీలు తొలి విడత అభ్యర్థుల జాబితాలను విడుదల చేశాయి.

# పాక్ మధ్యవర్తిత్వం మాకొద్దు

## నో చెప్పిన ఇరాన్



టెహ్రాన్, మార్చి 30: పశ్చిమాసియాలో ఘర్షణల ముగింపు కోసం అమెరికా-ఇరాన్ మధ్య ప్రత్యక్ష చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తామని పాకిస్థాన్ ప్రకటనలు చేసింది. అయితే పాక్ ప్రయత్నాలకు ఇరాన్ నో చెప్పింది. ఆ విషయంలో తమ ప్రమేయం ఏమీ లేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు ముంబయిలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ఏ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.''అమెరికాతో ప్రత్యక్ష చర్చలు ఏమీ లేవు. అవన్నీ మధ్యవర్తుల ద్వారా బయటకు వచ్చిన అసమంజసమైన డిమాండ్లు మాత్రమే. దౌత్యం విషయంలో అమెరికా తరచూ మాటమారుస్తోంది. మా వైఖరి మాత్రం స్పష్టంగా ఉంది. పాక్ మధ్యవర్తిత్వ ప్రణాళికలు వారి సొంతమే. వాటిలో మా ప్రమేయం లేదు. యుద్ధం ముగింపు కోసం ఇస్తున్న పిలుపు స్వాగతించదగినవే. కానీ యుద్ధాన్ని ప్రారంభించింది ఎవరో గుర్తుంచుకోండి'' అని కాన్సులేట్ జనరల్ పేర్కొంది.

ఇటీవల ఇస్లామాబాద్లో పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్తో సౌదీ అరేబియా, ఈజిప్ట్, తుర్కియే మంత్రులు సమావేశమయ్యారు. ఇరాన్, ఇజ్రాయెల్- అమెరికా ఘర్షణల కారణంగా మిగిలిన దేశాలపై పడుతోన్న ప్రభావం గురించి చర్చించారు. పాక్‌లో జరగబోయే ఇరాన్-అమెరికా ప్రత్యక్ష చర్చలకు ఆ దేశాల మంత్రులు పూర్తి మద్దతు ఇచ్చారని ఇషాక్ ప్రకటించారు. ఈ విషయంలో ఇరాన్, యూఎస్ఏ యంత్రాంగంతో చర్చలు జరిపామని చెప్పారు. ఇప్పుడు ఈ ప్రయత్నాల్లో తమ ప్రమేయం ఏమీ లేదని ఇరాన్ చెప్పడం గమనార్హం.

# రెండు విడతల్లో ఏపీ, తెలంగాణలో జనగణన

- వివరాలు వెల్లడించిన సెన్సస్ రిజిస్ట్రార్ జనరల్



ఢిల్లీ, మార్చి 30: ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రెండు విడతల్లో జనగణన జరుగుతుందని సెన్సస్ రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ తెలిపారు. ఏపీలో మే 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జనగణనలో భాగంగా ఇళ్ల సర్వే జరుగుతుందని వెల్లడించారు. ఏప్రిల్ 16వ తేదీ నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు అవకాశం ఇస్తామన్నారు. ఇక, తెలంగాణలో మే 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు ఇళ్ల సర్వే జరుగుతుందని తెలిపారు. ఏప్రిల్ 26వ తేదీ నుంచి మే 10 తేదీ వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు అవకాశం ఉంటుందని అన్నారు. జనాభా లెక్కల వివరాలన్నీ గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

సోమవారం సెన్సస్ రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ మీడియాతో మాట్లాడుతూ.. 'సెల్ఫ్ ఎన్యుమరేషన్‌లో ప్రజలు సొంతంగా జనాభా లెక్కల వెబ్‌సైట్‌లో ఇళ్ల సర్వే వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. ఇళ్ల సర్వేలో ఇంటి పరిస్థితి, ఇంటి వసతులు, వస్తువులు, ఇల్లు ఎస్సీ, ఎస్టీలకు చెందినదా వంటి 34 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. తొలివిడతలో గృహాల లెక్కింపు ఉంటుంది. ప్రతీ ఇంటి పరిస్థితి, సౌకర్యాలు, ఆస్తులు తదితర వివరాలు సేకరిస్తాం. ఏప్రిల్, సెప్టెంబర్ మధ్య 30 రోజులపాటు హౌస్ లిస్టింగ్ జరుగుతుంది. హౌస్ లిస్టింగ్‌కు నెలరోజుల ముందు సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు 15 రోజులపాటు అవకాశం ఉంటుంది'అని తెలిపారు.

# యుద్ధం తమిళనాడు, ఢిల్లీ మధ్యే

## తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్



కాంచీపురం, మార్చి 30: అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే చీఫ్ ఎడప్పాడి పళనిస్వామికి ఉద్వాసన పలకాలని, తద్వారా బీజేపీ మాయమాటలకు తమిళనాడు లొంగదని బలంగా చాటిచెప్పాలని డీఎంకే నేత, తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు తమిళనాడు, ఢిల్లీకి మధ్య జరుగుతున్న పోరుగా తన తండ్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ పేర్కొనడాన్ని ప్రస్తావిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రికి తమిళనాడులో చోటీయరాదని అన్నారు. డీఎంకే వ్యవస్థాపక నేత సీఎన్ అన్నాదురై స్వస్థలమైన కాంచీపురం నుంచి ఉదయనిధి స్టాలిన్ ఎన్నికల ప్రచారాన్ని సోమవారంనాడు లాంఛనంగా ప్రారంభించారు.

అన్నాడీఎంకే చీఫ్ పళనిస్వామి ప్రధానమంత్రి మోడీకి 'కట్టుబానిస' అని ఉదయనిధి ఘాటుగా విమర్శించారు. ప్రధాని మోడీ, అమిత్‌షాలు అన్నాడీఎంకే నేత సైద్ధాంతిక మార్గదర్శకులని అన్నారు. ఆ కారణంగానే అన్నాడీఎంకే చీఫ్ పళనిస్వామికి ఈ ఎన్నికల్లో ఉద్వాసన పలాకాలని అన్నారు. 'మోడీ, అమిత్‌షాను తమిళనాడులో అనుమతిద్దామా? తమిళ ప్రజలు ఎన్నటికీ వారిని అనుమతించరు' అని అన్నారు. తమిళనాడు ఎప్పుడూ ఢిల్లీ కంట్రోల్లో ఉండదని కచ్చితంగా నిరూపించుకోవాల్సి ఉందని, రాష్ట్రాన్ని వంచించిన బీజేపీని పూర్తిగా పక్కకుపెట్టడం తప్పనిసరి అని చెప్పారు. ముఖ్యమంత్రి బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వంటి ఎన్నో సంక్షేమ పథకాలను డీఎంకే ప్రభుత్వం విజయవంతంగా రాష్ట్రంలో అమలు చేస్తోందని ఉదయనిధి స్టాలిన్ పేర్కొన్నారు. కాంచీపురంలో మౌలిక వసతుల ప్రాజెక్టులను పూర్తి చేశామని, డీఎంకే 'ఉదయిస్తున్న సూర్యుడు'కు ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. మరోవైపు, అన్నాడీఎంకే చీఫ్ పళనిస్వామి బీజేపీకి కేటాయించిన మైలాపూర్ నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు.

# ఆ రష్యా చమురు నౌకతో మాకు సమస్య లేదు: ట్రంప్




వాషింగ్టన్, మార్చి 30: చమురు సంక్షోభంలో కూరుకుపోయిన క్యూబాకు అమెరికా ఒకింత ఊరట కల్పించింది. ఆ దేశానికి వెళ్లే రష్యా చమురు నౌకకు అనుమతిస్తామని వెల్లడించింది. గత కొంతకాలంగా క్యూబాకు చమురు రవాణా విషయంలో ట్రంప్ ఆంక్షలు పెట్టగా.. తాజాగా వాటిని కాస్త సడలించడం గమనార్హం.

7.3 లక్షల బ్యారెళ్ల ముడిచమురుతో రష్యా నౌక 'అనాటోలీ కొలోడ్కిన్' మార్చి 8న రష్యా పోర్ట్ నుంచి బయల్దేరింది. ఇంగ్లిష్ ఛానల్ మీదుగా అట్లాంటిక్ చేరుకుంది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఈ నౌక క్యూబాను చేరుతుందా, లేదా అనే సందిగ్ధత నెలకొంది. ఈ క్రమంలోనే దీనిపై ట్రంప్ తాజాగా స్పందించారు. ''ఇప్పటికిప్పుడు క్యూబాకు చమురు చేరవేయాలని ఏ దేశం అనుకున్నా దాంతో నాకు సమస్య లేదు. అది రష్యా అయినా, కాకపోయినా నాకేం ఇబ్బంది లేదు. త్వరలోనే క్యూబా ప్రభుత్వం నేలకూలుతుంది'' అని ట్రంప్ అన్నారు. ఆ తర్వాత రష్యా చమురు నౌకకు అనుమతినిస్తున్నట్లు అమెరికా మరో ప్రకటన చేసింది.ఈ నౌక మంగళవారం క్యూబాకు చేరుకునే అవకాశం ఉంది. వెనెజువెలా అధ్యక్షుడు మదురో నిర్బంధం తర్వాత నుంచి ఆ దేశానికి చమురు రవాణా నిలిచిపోయింది. వారికి చమురు చేరవేసే దేశాలపై అధికంగా సుంకాలు విధిస్తానని ట్రంప్ గతంలోనే హెచ్చరించారు. ఒకానొక సమయంలో క్యూబాను స్వాధీనం చేసుకుంటానన్న వ్యాఖ్యలూ తీవ్ర వివాదాస్పదం అయ్యాయి. ఈ క్రమంలోనే చమురు సంక్షోభం ఏర్పడటంతో అక్కడి ప్రజారవాణాపై తీవ్ర ప్రభావం పడింది. కొన్ని విమానాలూ నిలిచిపోయాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రష్యా నుంచి చమురు నౌక వెళ్లడం క్యూబాకు కాస్త ఊరటనిచ్చే విషయం.

# శబరిమలపై మోడీ మౌనం వెనుక కారణమదే

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపణ



పతనంతిట్ట, మార్చి 30: కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్‌కు బీజేపీ పరోక్షంగా మద్దతిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ఎన్నికల్లో పోటీ యూడీఎఫ్‌కు, సీపీఎం-బీజేపీ కంబైన్‌కు మధ్యే జరగనుందని అన్నారు. పతనాంతిట్ట జిల్లాలోని అదూర్‌లో సోమవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచారసభలో రాహుల్ మాట్లాడుతూ, కేరళలో యూడీఎఫ్ ఉండకూడదని బీజేపీ కోరుకుంటోందని, ఎందుకంటే కాంగ్రెసుకు మాత్రమే జాతీయ స్థాయిలో బీజేపీని సవాలు చేయగలిగే శక్తి ఉందనే విషయం వాళ్లకు బాగా తెలుసునని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో తాము సైద్ధాంతిక పోరాటం చేస్తున్నామని తెలిపారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్కు బీజేపీ పరోక్షంగా మద్దతిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. విపక్ష నేతలను సెంట్రల్ ఏజెన్సీలు టార్గెట్ చేస్తున్నాయని, కానీ ఎల్డీఎఫ్‌పై మాత్రం ఎలాంటి దర్యాప్తులు ఉండవని రాహుల్ విమర్శించారు. తనపై 36 కేసులు పెట్టారని, 55 గంటల సేపు నిర్వరామంగా ప్రశ్నించారని అన్నారు. కేరళ సీఎం పినరయి విజయ్ను మాత్రం ఎలాంటి చర్యలు లేవన్నారు.

### పాలక్కాడ్లో మోదీ మౌనం

ప్రధాని మోదీ ఎక్కడికి వెళ్లినా ఆలయాలు, మతం గురించి మాట్లాడతారని, కానీ ఇటీవల పాలక్కాడ్ పర్యటనలో శబరిమల అంశాన్ని లేవనెత్తడం మరిచిపోయారని రాహుల్ విమర్శించారు. శబరిమలలోని అయ్యప్ప ఆలయంతో ముడిపడి ఉన్న అంశంపై మాట్లాడకపోవడం ద్వారా బీజేపీ, ఎల్డీఎఫ్ కలిసి పనిచేస్తున్నట్టు స్పష్టమవుతోందన్నారు. యూడీఎఫ్ అధికారంలోకి వస్తే ఆలయంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# చిట్టెడు చిట్టెడు... పుట్టెడు..!

**పోస్టుమాస్టర్... చేతివాటం..!**

**ఆసరా పెన్షన్ లో 16 రూపాయలు స్వాహా**

**పింఛన్ల పంపిణీలలో అవకతవకలు**

**మాకు పై రూ 16 ఇవ్వట్లే కలెక్టర్ గారు జర సోచయించండి**

**ఏం తెలివిరా నాయనా రూ 16 తీసుకుంటూ రూ లక్షల్లో పోగు**

**అన్నారం పోస్ట్ మాస్టర్ పై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్**





**తుంగతుర్తి: మార్చి 30,( మనం న్యూస్ )** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతినెల అర్హులైన పేద వారికి ఆసరా పెన్షన్లను అందిస్తున్న విషయం తెలిసిందే దివ్యాంగులకు రూ. 4016, ఒంటరి మహిళలకు రూ. 2016 ,గీత కార్మికులకు ,వృద్ధులకు నెలకు రూ. 2016 చొప్పున ప్రతి గ్రామంలో పోస్ట్ ఆఫీస్ ల ద్వారా అధికారులు పెన్షన్లు అందజేస్తున్నారు. వివరాలకు వెళ్తే... తుంగతుర్తి మండల పరిధిలోని అన్నారం గ్రామంలో విధులు నిర్వహిస్తున్న బ్రాంచ్ పోస్టుమాస్టర్ ఆసరా పెన్షన్ కంపెనీలో తన చేతి వాటానికి అని చెప్పాడు. ఎవరు అడుగుతారు.. ఈ కొద్దీ పైసలు అనుకుంటూ... చిట్టెడు చిట్టెడు... పుట్టెడుగా చేసి డబ్బులు దండుకుంటూ వస్తున్న తీరు ఒక్కసారిగా బట్టబయలైంది.. ఆసరా పెన్షన్ అందజేయాలంటే ఒక్క మనిషికి ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ ఇవ్వడం లో పైన ఇవ్వాల్సిన 16 రూపాయలు వృద్ధులకు వికలాంగులకు ఎగనామం పెడుతున్నట్టు తెలుస్తోంది... ఇది గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న తీరు.. చిల్లర రూపాయాలు అడిగితే చిల్లర లేవు. మేమేం చేయాలని అంటూ పెన్షన్ దారుల పై విసుక్కుంటూ పొంతనలేని సమాధానం చెప్పడం గమనార్హం.తెలంగాణ ప్రభుత్వం సమాజంలోని బలహీనవర్గాలకు ఆర్థిక సహాయం అందించడానికి ఆసరా పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టింది ఈ పథకం వితంతువులు ఒంటరి మహిళలు దివ్యాంగులు, బీడీ కార్మికులు మరియు ఇతర నిరుపేద వర్గాలకు వారి దైనందిన అవసరాలను తీర్చుకోవడానికి ఆదాయ వనరు ఉండేలా మద్దతిస్తుందని ఆసరా పింఛన్ ప్రతి పేదవాడి కడుపు నిండేలా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతినెల పెన్షన్లు అందించడం జరుగుతుంది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తన సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా 2014లో ఆసరా పింఛన్ పథకాన్ని ప్రారంభించింది స్థిరమైన జీవనోపాధి సంపాదించడానికి ఇబ్బంది పడుతున్న బలహీన పౌరులకు నెలవారి పింఛన్ ప్రయోజనాలను అందించడం దీని లక్ష్యం కానీ ప్రతి గ్రామంలో పోస్ట్ మాస్టర్లు అయినా బీపీఎం లు ఒక నెలకు వేలలో రూపాలను సంపాదిస్తున్నారు. ఒక బీపీఎం ఒక్క నెలలో వేల రూపాయలను లబ్ధిదారుల దగ్గర దోచుకోవడం పోస్ట్ ఆఫీస్ లో ఆర్డీల రూపంలో పొదుపుగా జమ చేస్తున్న డబ్బులకు ఖాతా బుక్కులు ఇవ్వడం లేదని , కట్టిన డబ్బులకు రసీదులు ఇవ్వడం లేదని కనీసం బుక్కులు కూడా మా చేతికి ఇవ్వడం లేదని జమ చేసిన డబ్బులు చెల్లించిన సమయం అయిపోయిన తిరిగి ఇవ్వడం లేదని ప్రతినెలా పోస్ట్ ఆఫీస్ లో వివిధ రకాల ఆర్డీలు జమ చేయడం జరుగుతుందని వీటికి ఖాతా బుక్కులు గాని, ఎంత కట్టామనే వివరాలు గానీ చెప్పడం లేదని వాటికి ఎలాంటి రసీదులు ఇవ్వడం లేదని పలువురు గోడు వెళ్లబోసుకుంటున్నారు. ఒక వృద్ధురాలు 33 నెలలుగా ఆర్డి కట్టడం జరిగిందనీ ఆర్డీ కట్టడం పూర్తయిన మాకు డబ్బులు ఇవ్వడం లేదని కనీసం ఖాతా పుస్తకం కూడా ఇవ్వడం లేదని తెలియజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా సుమారు 800 పైగా లబ్ధిదారులు ఆసరా పెన్షన్లు తీసుకుంటున్నారు. పింఛన్దారులకు పంపిణీ చేయాల్సిన మొత్తం డబ్బులు చెల్లించకపోగా పోస్టల్ అధికారి కొందరికి 16 రూపాయలు ఇవ్వకపోవడం మరికొందరికి ఆరు రూపాయలు చిల్లర లేదని ఇవ్వకపోవడం మరి కొంతమంది నెల నెల దాచుకున్న డబ్బులు రెండు సంవత్సరాలు గడుస్తున్నా పూర్తి అయిన నేటి వరకు కూడా వారి కుటుంబాలకు డబ్బులు అందించకపోవడంలో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఇదిలా ఉండగా గత కొన్ని సంవత్సరాలుగా అన్నారం గ్రామానికి చెందిన పోస్ట్ మాస్టర్ కనీసం పింఛన్దారులకు ఆర్డి దారులకు బుక్కులు కూడా ఇవ్వకపోవడం దారుణం మని విమర్శిస్తున్నారు. " ఎన్షన్ బుక్ లో పక్కాగా ఇవ్వాల్సిన మొత్తం రాస్తున్నారు కానీ ఎవరికి పై 16 రూపాయలు ఇవ్వడం లేదనీ ఇది గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యారనీ ఒక్క అన్నారం గ్రామంలోనే పింఛన్దారుల డబ్బులు వేల రూపాయలు మిగులుచుకుంటున్నారన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. దీంతో మొత్తం మండలంలో ప్రతి సంవత్సరం లక్షల రూపాయలు పింఛన్లు నష్టపోతున్నారని ఇలా జరుగుతున్న ఏ అధికారి చూసి చూడనట్టుగా వదిలేస్తున్నారన్నారు మండలంలో వేల మంది పింఛన్దారులకు జరుగుతున్న సమస్యలను జిల్లా కలెక్టర్ జిల్లా పోస్టల్ ఉన్నత శాఖ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి వారిపై చట్టపరమైనటువంటి చర్యలు తీసుకోవాలని అధికారులను వేడుకుంటున్నారు.

జరుగుతున్న ఈ తతంగాన్నిపై సూర్యాపేట జిల్లా పోస్టల్ అధికారి బుచ్చిబాబు ను వివరణ అడగగా ఇది మా దృష్టికి వచ్చిందని లబ్ధిదారులు ఎవరైనా రాతపూర్వకంగా వినతి పత్రం అందించినట్లయితే వెంటనే అక్కడ విధులు నిర్వహిస్తున పోస్ట్ మాస్టర్ పై విచారణ చేసి అనంతరం శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ప్రజల సమస్యలపై పరిష్కారానికి తక్షణ కృషి



**సూర్యాపేట,మార్చి 30 (మనం ప్రతినిధి):** ప్రజల సమస్యల పరిష్కారానికై సిబ్బంది వెంటనే కృషి చేయాలని జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. సోమవారం పోలీసు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఎస్పీ జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఫిర్యాదుదారులఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ....ప్రజల సమస్యల పరిష్కారానికై సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తక్షణ ఆదేశాలు, సూచనలు చేసి సమస్యల పరిష్కారానికి అవసరమైన దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యలపై త్వరితగతిన చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితులకు బరోసా కల్పించాలి అన్నారు.ఎలాంటి సమస్యలు ఉన్న ప్రజలు పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై సత్వరమే చర్యలు



**సూర్యాపేట మార్చి 30 (మనం ప్రతినిధి):** ప్రజావాణి పిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలి అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదారుల నుండి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని, నిర్లక్ష్యం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర స్థాయి గ్రీవిన్స్ లకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఎప్పటికప్పుడు దరఖాస్తు లను పరిష్కరించాలని తెలిపారు.. నేటి ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 33 దరఖాస్తులు, డి ఆర్ డి ఏ 6, డి పి ఓ 5, డి డబ్ల్యూ ఓ 5, మిగిలిన 29 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 78 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కే సీతారామా రావు, సీఈఓ జిల్లా పరిషత్ శిరీష, రెవెన్యూ డివిజన్ అధికారి వేణు మాధవరావు, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కోదండ రాముడీ వార్షిక కల్యాణోత్సవం



**నేరేడుచర్ల మార్చి 30 మనం న్యూస్ :** నేరేడుచర్ల పట్టణంలో గల శ్రీ కోదండ రామాలయంలో సోమవారం వైభవంగా వార్షిక కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు, ఆలయ పూజారి బృందావనం శ్రీరామనసింహ తేజ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలోని కళ్యాణ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా పూలమాలలతో అలంకరించి మొదటగణపతి పూజ చేసి అనంతరం వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా, సాంప్రదాయ సిద్ధంగా కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు వివిధ ప్రసాదాలను అన్నప్రసాద వితరణను చేశారు, ఈ కళ్యాణ మహోత్సవంలో ఆలయ కమిటీ చైర్మన్ కొణతం సత్యనారాయణ రెడ్డి, ఆలయ ధర్మకర్త రాచకొండ నాగ మాధవరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సోమ సుందర్ రెడ్డి, ఎస్ ఐ రవీందర్, మున్సిపల్ కమిషనర్ చెన్నబోయిన నాగరాజు, ఎంపీ ఓ నాగరాజు, కౌన్సిలర్లు దొండపాటి అప్పిరెడ్డి, అరూర్ విజయలక్ష్మి,మాజీ వైస్ ఎంపీపీ తాళ్లూరి లక్ష్మీనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ సరికొప్పుల నాగేశ్వరరావు, ఉప్పల కృపాకర్, తాటికొండ వెంకటరెడ్డి, యడవల్లి వెంకటరెడ్డి, తాటికొండ సత్యనారాయణ రెడ్డి, రాగిరెడ్డి గోపాల్ రెడ్డి, జెట్టి వెంకన్న, నిమ్మగడ్డ సుబ్బారావు, గోళ్ళ సుధాకర్, పొనుగోటి జంగారావు, కత్తి సుధాకర్ రెడ్డి, గుండా సత్యనారాయణ, రాచకొండ శ్రీనివాసరావు, కుంకు మోహన్ రావు,తడకమళ్ళ హేమంత్, తడకమళ్ళ పరమేశం, తాటికొండ శ్రీరామ్ రెడ్డి, తాటికొండ నర్సిరెడ్డి, కందిబండ శ్రీనివాసరావు, తాటికొండ శ్రీనివాస్ రెడ్డి, రాచకొండ అజయ్,మా శెట్టి మోహన్, కొఢతం ఆదిరెడ్డి, కుంకు చిన్నయ్యా, కాంపల్లి నర్సిరెడ్డి, కాంపల్లి నారాయణరెడ్డి, ఉమ్మడి సైదిరెడ్డి, వెంకట్ రెడ్డి, పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదాల నివారణకోసం డ్రైవర్లకు కంటి పరీక్షలు

- **మంచివారికి పోలీసు మిత్రుడు, ఫ్రెండ్లీ పోలీస్**
- **ప్రజల రక్షణలో అనుక్షణం పని చేస్తున్నాం**
- **కె నరసింహ ఐపిఎస్, ఎస్పి**



**కోదాడ, మార్చి 30(మనం న్యూస్):** అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత లో భాగంగా కోదాడ పోలీసుల అధ్వర్యంలో వాహన డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య పరీక్షలు స్థానిక పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రతి ప్రయాణం సురక్షిత గమ్యం చేరడం ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర పోలీసు డిజిపి ప్రారంభించిన ఆరవ్ అలైవ్ మహా ఉద్యమం కార్యక్రమం 3వ విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా కోదాడ పట్టణ, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో కోదాడ పబ్లిక్ క్లబ్ పంక్షన్ హాల్ నందు పోలీసుల అధ్వర్యంలో వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ప్రస్తుత సమాజంలో రోడ్డు ప్రమాదాలు, మాదకద్రవ్యాలు, సైబర్ మోసాలు ప్రధాన సమస్యగా మారాయని, వీటి నివారణకు జాగ్రత్తలు పాటించడం, అవగాహన ముఖ్యం అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఈరోజు పోలీసు అధ్వర్యంలో డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు చేయించాం అన్నారు. రోజంతా శ్రమించి చెమటోడ్చి సంపాదించిన డబ్బు అవగాహన లోపంతో సైబర్ మోసాల బారిన పడుతున్నాయి ప్రజల అత్యాశ అవగాహన లోపాన్ని సైబర్ మోసగాళ్లు అవకాశంగా చేసుకుని డబ్బు దొచేస్తున్నరు, అప్రమత్తంగా ఉండాలి మెసేజ్ రూపంలో వచ్చే బ్లూ లింక్స్ అనుసరించి, అపరిచితులు ఫోన్ కాల్స్ స్పందించి వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ వివరాలు, ఓటిపి వివరాలు తెలపవద్దు, ప్రమాదంలో ఉన్నారు, మీకు భౌమతులు వచ్చాయి అంటే స్పందించి తెలియని వక్తులకు డబ్బులు పమపవద్దు అని కోరారు. మాదకద్రవ్యాల మత్తుకు బానిసలు కావద్దు, మత్తులో నేరాలు చేస్తారు అన్నారు, డ్రగ్స్ లాంటి వాటి కార్యకలాపాల వివరాలు వార్డు, గ్రామ పోలీసు అధికారులకు, డయల్ 100 కు సమాచారం అందించి డ్రగ్స్ నివారణలో భాగస్వామ్యం కావాలని కోరారు. ముందు జాగ్రత్తలు పాటించడంతోనే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చును అన్నారు. డ్రైవర్ వృత్తి చాలా కష్టతరమైన పనిని ఈ వృత్తిని ఎంచుకొని నిర్విరామంగా కష్టపడుతూ డ్రైవర్లు ఆరోగ్యాలను లెక్క చేయడంలేదని ఎస్పి అన్నారు, డ్రైవింగ్ వృత్తిలో కంటి చూపు చాలా కీలకమైనదని డ్రైవర్ యొక్క కంటి చూపు బాగా ఉంటే వాహనాన్ని సమర్థవంతంగా నడపగలుగుతారని తెలిపారు. డ్రైవర్లకు వయస్సు పెరిగే కొద్ది కంటి చూపు మందగించడం జరుగుతుంది అలాంటి వారు కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకొని తగిన జాగ్రత్తలు పాటించాలి, కంటి చూపు స్పష్టంగా ఉంటే ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలు సరిగ్గా గుర్తించి సురక్షితంగా వాహనాలు నడపగలరని అన్నారు. ఈ శిభిరం లో కోదాడ పట్టణానికి చెందిన అశోక్ కంటి హాస్పటల్, పుల్లూరి కంటి హాస్పటల్, సురభి కంటి హాస్పటల్, లక్ష్మి కంటి హాస్పటల్ వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు, మందులు అందించారు.

కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్న 500 లకు పైగా వివిధ వాహనాల డ్రైవర్లు.పరీక్షల అనంతరం అవసరమైన వారికి కంటి అద్దాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, పట్టణ సీఐ శివ శంకర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, ఎస్ఐ సుదీర్, కంటి డాక్టర్లు అశోక్ కుమార్, మల్లీశ్వరి, రామతులసి, రామ్ చరణ్, సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

## వరి పంట పొలాల పరిశీలించిన వ్యవసాయ అధికారులు



**పాలకీడు మార్చి 30 మనం న్యూస్:** మండల పరిధిలోని శూన్యపహాడ్ ,గుడిగుంట్ల పాలెం గ్రామాలలో వరి పంటలను మండల వ్యవసాయ అధికారి కళ్యాణ్ చక్రవర్తి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 120 రోజులు పంట కాలం కలిగిన సన్న రకం వరి రకాలలో అసమాన పూత రావడం జరిగిందని రైతుల ఫిర్యాదు మేరకు జిల్లా వ్యవసాయ అధికారి సూర్యాపేట వారి విజ్ఞప్తి మేరకు సీనియర్ శాస్త్రవేత్త శ్రీధర్, వృక్ష ప్రజానాన్ విభాగం శ్రీమతి కే సంధ్యారాణి, సేద్య విభాగం వ్యవసాయ పరిశోధనా స్థానం కంప సాగర్ నుంచి క్షేత్ర పరిశీలనకు ఆయా గ్రామాలలో సందర్శించి వరి రకాల యొక్క పూర్తి వివరాలను రైతులను అడిగి తెలుసుకుని పరిశీలన చేయడం జరిగింది అని తెలిపారు. సేకరించిన నమూనాలను విశ్లేషించి తుది నివేదికను రెండు రోజుల్లో జిల్లా వ్యవసాయ అధికారికి సమర్పిస్తారని రైతులకు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనకు వివిధ కంపెనీల ప్రతినిధులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు గోపి శ్రీకాంత్ రతన్ సింగ్ కృష్ణ లింగారెడ్డి రామిరెడ్డి వెంకటయ్యా రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పోరేళ్ళ దాస్ వర్ధంతి



**తిరుమలగిరి, మార్చి 30 (మనం న్యూస్):** భారత కమ్యూనిష్టు పార్టీ మార్క్సిస్టు,వీర తెలంగాణ విప్లవ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, దేశ విముక్తి స్వాతంత్ర్య పోరాట యోధుడు, పోరెల్ల దాసు 8వ, వర్ధంతిని తిరుమలగిరి మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా లో సోమవారం నిర్వహించారు. దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా సీపీయం మండల కార్యదర్శి గుమ్మడి వెల్లి ఉప్పలయ్యా మాట్లాడుతూ, 1946 నుండి 1951 వరకు జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రాణాలకు తెగించి తన యవ్వన జీవితమంతా పేద ప్రజల కోసం ధారపోసిన ధీశాలి పోరెల్ల దాసు అని అన్నారు. సూర్యాపేట, తుంగతుర్తి ప్రాంతంలో దొరలు పెత్తందారులు నైజాం రజాకార్లు, యునియన్ సైన్యాల దోపిడీ దౌర్జన్యాలు, భూస్వామ్య గూండాల, అరాచకాలను,దురాగతాలను ఎదిరించి ఆంధ్ర మహాసభ, ఎర్రజెండా పిలుపు అందుకొని స్వతంత్ర పోరాటంలో , తెలంగాణ సాయుధ పోరాటంలో ముందున్నారని తెలిపారు. వెట్టి చాకిరీ నుండి పేద ప్రజలను రక్షించేందుకు వెన్ను చూపని పోరాటాలు చేశారన్నారు. పోరాట విరమణ అనంతరం తొండ గ్రామానికి 26 సంవత్సరాలుగా సర్పంచుగా, మరో ఆరు సంవత్సరాలు తిరుమలగిరి మండల పరిషత్ అధ్యక్షులుగా ఎన్నికై ప్రజా సేవకే అంకితమైన నిఖ్సాన జనం నాయకుడుగా పేరు ప్రతిష్టలు గడించిన నిస్వార్ధ జీవి అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు కొత్త గట్టు మల్లయ్యా, సీపీయం సీనియర్ నాయకులు కడెం లింగయ్యా, కడారి లింగయ్యా, ఆకుల సోమయ్యా, బూర్గుల ప్రభాకర్,మండల నాయకులు లక్ష్మి , యం సీపీఐ రమేష్, చేను శ్రీనివాస్, నాగార్జున, పోరెల్ల లక్ష్మయ్యా, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు రహదారి భద్రత చర్యలు చేపట్టాలి

- **గ్రామ సభలలో ప్రజలకు అవగాహన కల్పించాలి**
- **జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్**

**నల్లగొండ,మార్చి 30 (మనం ప్రతినిధి):** రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు రహదారి భద్రత చర్యలను కట్టుదిట్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ కోరారు.సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో జిల్లా ఎస్ పి శరత్ చంద్ర పవార్ తో కలిసి ఆయన జిల్లా స్థాయి రహదారి భద్రత సమావేశాన్ని నిర్వహించారు.అనంతరం మాట్లాడుతూ సురక్షితంగా చేరుకోండి కార్యక్రమం పై ఏప్రిల్ 2న నిర్వహించనున్న ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక గ్రామ, మున్సిపల్ వార్డు సభల ద్వారా పెద్ద ఎత్తున ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.అంతేకాక లైసెన్స్ రిజిస్ట్రేషన్, లైసెన్సు సేవా పోర్టల్ పై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు.జిల్లాలో జాతీయ రహదారి నిడివి ఎక్కువగా ఉన్నందున ,హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై ట్రామా కేర్ సెంటర్ ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకొని ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన వెల్లడించారు.హైవే పెట్రోలింగ్, హైవేపై ప్రమాదాలు జరిగిన వెంటనే 20 నిమిషాల లోపు పోలీసు లతోపాటు,సంబంధిత శాఖల అధికారులు చేరుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ,పోలీసులు గుర్తించిన రహదారుల బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాలు సంభవించకుండా గట్టి చర్యలు చేపట్టాలని,ఏప్రిల్ మొదటి వారంలోగా గుర్తించిన రహదారులపై బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాలు జరగకుండా ఆర్ అండ్ బి నేషనల్ హైవే ఇతర రహదారి అథారిటీలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ పోలీసు యంత్రాంగంతో పాటు,జిల్లా అధికార యంత్రం తీసుకున్న చర్యల వల్ల గడచిన 18 నెలల్లో ఆయా రహదారులపై బ్లాక్ స్పాట్ల సంఖ్యను 58 నుండి 38 తగ్గించామని, అలాగే మరణాల సంఖ్య 7 శాతానికి తగ్గించగలిగామని తెలిపారు.ఇటీవల కాలంలో చాలామంది మైనర్ యువకులు ద్విచక్ర వాహనాలు నడుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనివల్ల ప్రమాదాలు సంభవించేందుకు అవకాశం ఉందని,అందువల్ల తల్లిదండ్రులు- టీచర్ల సమావేశంలో పాఠశాల విద్యార్థులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించేందుకు విద్యాశాఖ ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ముకుందాపురం, మాడుగులపల్లి, నల్గొండ టౌన్,యా,నకరేకల్, కొండభీమనపల్లి, దేవరకొండ, చింతపల్లి నుండి మాల్ తదితర రహదారులపై సంభవిస్తున్న రోడ్డు ప్రమాదాల




నివారణకు కు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆయన జిల్లా కలెక్టర్ తో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రహదారి ప్రమాదాల నివారణకు కృషిచేసిన అధికారులు ఇతర అధికారులకు జిల్లా కలెక్టర్ ఎస్పీలు అభినందన పత్రాలను అందజేశారు.ఈ సమావేశంలో పోలీస్, రెవెన్యూ, ఆర్ అండ్ బి,పంచాయతీరాజ్ ,జాతీయ రహదారులు ,మున్సిపల్ కమిషనర్లు, ట్రాన్స్పోర్ట్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు.

# ఆర్డీటీకి సహాయపడిన ఏపీ ఐటీ మంత్రి నారా లోకేష్




**అమరావతి, 30 మార్చి :** ఆంధ్రప్రదేశ్ ఐటీ మంత్రి శ్రీ నారా లోకేష్, రాష్ట్రంలో పనిచేస్తున్న లాభాపేక్షలేని సంస్థ అయిన రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ)కి విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్సీఆర్ఏ) రిజిస్ట్రేషన్ను విజయవంతంగా పునరుద్ధరించారు.

ఆంధ్రప్రదేశ్లో అభివృద్ధి ప్రాజెక్టులకు మద్దతుగా అంతర్జాతీయ దాతల నుండి నిధులను పొందడంలో ఆర్డీటీ కీలక పాత్ర పోషించినందున, కేంద్ర ప్రభుత్వం నుండి పొందిన ఈ పునరుద్ధరణ రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలకు ఒక పెద్ద ముందడుగు. ఏడాది పాటు సాగిన పోరాటం తర్వాత మార్చి 23, 2026న లభించిన ఈ ఆమోదం, మార్చి 22, 2031 వరకు రాయలసీమ వ్యాప్తంగా వేలాది మంది లబ్ధిదారులు మరియు ఎన్జీవోల కోసం విదేశీ నిధులను తిరిగి స్వీకరించడానికి మరియు తన సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించడానికి ఈ సంస్థకు అనుమతిస్తుంది.

శ్రీ నారా లోకేష్ స్వయంగా ఢిల్లీలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అధికారులను కలిసి, ఆర్డీటీ తరపున వాదించి, రాష్ట్రంలో విద్య, ఆరోగ్యం మరియు సామాజిక సేవ రంగాలలో ఐదు దశాబ్దాలకు పైగా ఆర్డీటీ చేస్తున్న పనిని వివరించారు.

ఆంధ్రప్రదేశ్లోని అనంతపురం వంటి కరువు పీడిత జిల్లాల్లోని ప్రజల జీవితాలను మార్చడంలో ఆర్డీటీ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సంస్థ క్షేత్రస్థాయిలో ఆరోగ్య సంరక్షణ సేవలు, గ్రామీణ విద్య, మహిళా సాధికారత, దివ్యాంగులకు సహాయం, మరియు సుస్థిర జీవనోపాధి కార్యక్రమాలను అందించడానికి కృషి చేస్తోంది. ఈ కృషి లక్షలాది మంది ప్రజలకు చేరి, ఆర్డీటీని ఈ ప్రాంతంలో అత్యంత విశ్వసనీయమైన అభివృద్ధి సంస్థలలో ఒకటిగా నిలబెట్టింది.

ఆర్డీటీ విశ్వసనీయతను, సమాజానికి దశాబ్దాలుగా అందిస్తున్న సేవలను గుర్తించి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు, మరియు నారా లోకేష్ మద్దతును అందించి, కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాలలో గ్రామీణ జీవనోపాధి, ఆరోగ్య సంరక్షణ, మరియు విద్యను ప్రోత్సహించే ఆర్డీటీ వంటి ప్రభుత్వేతర సంస్థలకు ఇటువంటి జోక్యాలు చాలా కీలకమని అధికారులు నొక్కి చెప్పారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవనోపాధికి బాధ్యత వహించే ఆర్డీటీ వంటి ప్రభుత్వేతర సంస్థల పనితీరులో ప్రభుత్వ నాయకత్వం జోక్యం చేసుకోవలసిన ప్రాముఖ్యతను ఇది స్పష్టం చేస్తుంది.

ఇది ఒక విస్తృత పాలనా నిర్మాణాన్ని ప్రతిబింబిస్తుంది, దీనిలో గరిష్ట ప్రభావాన్ని సాధించడం కోసం, అధిక ప్రాధాన్యత గల పెట్టుబడులతో పాటు స్థానిక సంస్థలకు కూడా మద్దతు ఇవ్వబడుతుంది.

**FCRA** ఆమోదం పునరుద్ధరించబడటంతో, **R–T** ఇప్పుడు రాయలసీమలో సమాజాలను శక్తివంతం చేయడం, గ్రామీణ జీవనోపాధులను బలోపేతం చేయడం మరియు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడం కొనసాగించగలదు. సకాలంలో అందించే నాయకత్వంతో కూడిన నిరంతర సేవ, ప్రధాన అడ్డంకులను ఎలా అధిగమిస్తుందో ఇది నిరూపిస్తుంది.

## వేడుకగా వసంతోత్సవాలు ప్రారంభం



- **వట్టి వేరు మండపంలో సేదతీరిన శ్రీవారు, దేవేరులు**
- **వన్య మృగాల సమూనాలతో శోభిల్లిన వసంతమండపం**

**తిరుమల, మార్చి 30, మనం న్యూస్ :** తిరుమలలోని వసంతోత్సవ మండపంలో శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు సోమవారం వేడుకగా ప్రారంభమయ్యాయి.

వసంత ఋతువులో శ్రీ మలయప్పస్వామివారికి జరిగే ఈ ఉత్సవానికి 'వసంతోత్సవ'మని పేరు ఏర్పడింది. ఎండ వేడి నుండి స్వామివారు ఉపశమనం పొందేందుకు జరిపే ఉత్సవం కావడంతో దీన్ని ''ఉపశమనోత్సవం'' అని కూడా అంటారు. ఈ ఉత్సవంలో సుగంధాన్ని వెదజల్లే పుష్పాలతోపాటు పలురకాల మధురఫలాలను స్వామివారికి నివేదిస్తారు. ఈ వేడుకల కోసం వట్టివేరుతో ఆకర్షణీయంగా మండపాన్ని రూపొందించారు. అలాగే వేలాడే కోతులు, ఏనుగులు, సింహాలు, పులులు, నెమళ్లు, పాముల తదితర జంతువులు, పలురకాల చెట్ల ప్రతిరూపాలతో శేషాచల అడవిని తలపించేలా ఈ మండపాన్ని తీర్చిదిద్దారు.

ఇందులో భాగంగా ఉదయం 6.30 గంటలకు శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామి వారు నాలుగు మాడవీధుల్లో ఊరేగింపుగా వసంత మండపానికి వేంచేపు చేశారు.

**వైభవంగా స్నపనతిరుమంజనం :**

వసంతోత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు శ్రీ భూ సమేత మలయప్పస్వామివారికి స్నపనతిరుమంజనం శోభాయమానంగా జరిగింది.

ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నవకలశాభిషేకం, రాజోపచారం నిర్వహించారు. అనంతరం ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం చేపట్టారు.

అర్ఘ్యపాద నివేదనలో భాగంగా క్షీర(పాలు), దధి(పెరుగు), మధి(తేనె), నారికేళం(కొబ్బరినీళ్లు), హరిద్రోదకం(పసుపు), గంధోదకం(గంధం)తో స్నపనం నిర్వహించారు. శంఖధార, చక్రధార, సహస్రధార, మహాకుంభాభిషేకాలను వైఖనసాగమోక్తంగా అర్చకులు చేపట్టారు.

ఈ సందర్భంగా తైత్తరీయ ఉపనిషత్తు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, పంచశాంతి మంత్రాలు, దివ్యప్రబంధంలోని అభిషేక సమయంలో అనుసంధానం చేసే పాశురాలను వేదపండితులు పఠించారు. ఈ వేడుకలో ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమజాతి పుష్పమాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. ఆ తరువాత స్వామి, అమ్మవార్లు సాయంత్రం అక్కడినుండి బయల్దేరి ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు.

ఈ కార్యక్రమంలో పెద్దజీయర్స్వామి, చిన్నజీయర్స్వామి, టిటిడి ఈవో ఎం.రవిచంద్ర, బోర్డు సభ్యులు భానుప్రకాశ్ రెడ్డి, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి,ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు, విశేషంగా భక్తులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు పని కల్పించాలని పిర్యాదు

**కాట్రేనికోన మార్చి 30 మనం ప్రతినిధి :** కాట్రేనికోన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయితాబత్తుల పండు బాబు ఆధ్వర్యంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు కల్పించాలని, ప్రతి సంవత్సరం తగిన రీతిలో ఉపాధి పనులు కల్పించడం లేదని, అలాగే పని చేసిన చోట మాత్రమే ఫోటో తీయాలని, ఫోటో ఒకచోట పని మరొకచోట తియ్యటం వలన పనికి భారం కలుగుతుందని, పనికి వెళ్లేటప్పుడు కనీసం అర కిలోమీటరు దూరం ఉండటం వలన ఉపాధి కూలీలు సతమతమవుతున్నారు. గత పది సంవత్సరాల కిందట ఉపాధి కూలీలకు రవాణా చార్జీలు ఇచ్చే వారిని పేర్కొంటూ ఉపాధి కూలీల తరపున మండల తాహసిల్దార్ రవి కిరణ్ కు ఫిర్యాదు చేశారు . అలాగే వచ్చేవారం నుండి తప్పనిసరిగా వంద రోజులు పని కల్పించాలని పిర్యాదు లో కోరారు.

## కాకినాడ ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణకు కేంద్రం రూ. 72.42 కోట్లు మంజూరు

- **ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వెల్లడి**



**పిఠాపురం మనం న్యూస్ :** కాకినాడ ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణకు కేంద్ర ప్రభుత్వం రూ. 72.42 కోట్లు మంజూరు చేసినట్లు కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కాకినాడ పరిసర ప్రాంతాల్లో వేలాదిమంది మత్స్యకారులకు జీవనోపాధి అందిస్తున్న ఫిషింగ్ హార్బర్ లో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, ఆధునికరణకు నిధులు కేటాయించాలని గత ఏడాది ఆగస్టులో కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ కు లేఖ రాయడంతో పాటు పలు మార్లు వ్యక్తిగతంగా కలిసి విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. దీంతో పాటు స్థానిక మత్స్యకారులు, నాయకులు అభిప్రాయాలను పరిణలోకి తీసుకుని మత్స్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి అవసరమైన నిధుల కోసం అంచనాలు రూపొందించి నివేదికను ఢిల్లీలో సంబంధిత శాఖ అధికారులకు అందజేయడం జరిగిందన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం సోమవారం ఫిషింగ్ హార్బర్ ఆధునికరణకు రూ.

72.42 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిధుల ద్వారా ఫిషింగ్ హార్బర్ లో రహదారుల నిర్మాణం, డ్రెడ్జింగ్, జెట్టీలు, అధునాతన కోల్ స్టోరేజ్ యూనిట్లు, ప్రాసెసింగ్ యూనిట్లు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఫిషింగ్ హార్బర్ ఆధునికరణ ద్వారా కాకినాడ పరిసర ప్రాంతాల మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు మెరుగవ్వడంతో పాటు కాకినాడ ఫిషింగ్ హార్బర్ ప్రధాన మత్స్యకార అభివృద్ధి కేంద్రంగా మారుతుందని తెలిపారు. ఈ సందర్భంగా త్వరితగతిన నిధులు మంజూరుకు సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

## సీతారామ కళాశాల బస్సును ఢీ కొట్టిన టిప్పర్

- **నలుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలు**
- **విద్యార్థులను పరామర్శించిన టిడిపి నేత పార్వతి సురేష్..**



**శంఖవరం మార్చి 30 మనం ప్రతినిధి :** శంఖవరం గ్రామ రాజుల బాబు గుడి దగ్గర రౌతులపూడి నుండి కత్తిపూడి వైపు వెళ్తున్న భారీ లోడు కలిగి ఉన్న టిప్పర్ లారీ కత్తిపూడి సీతారామ కళాశాల బస్సును బలంగా ఢీకొట్టింది.

కళాశాల ముగించుకుని ఇంటికి వెళుతున్న శృంగవరం గ్రామానికి చెందిన డి వీరలక్ష్మి (18), తోలెం సంధ్య అనురాధ (18), ప్రగడ అంబిక, (18)వై. అభిరామ్ (13), విద్యార్థులు తీవ్ర గాయాల పాలయ్యారు. రౌతులపూడి మండలంలో తనిఖీలు నిర్వహించి కత్తిపూడి వైపు వస్తున్న పెద్దాపురం డివిజన్ డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ప్రశాంతి ఘటన స్థలానికి సమీపనున్న శంఖవరం ప్రభుత్వ ఆసుపత్రి కి విద్యార్థులను తరలించగా ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎస్ రాజీవ్ కుమార్ విద్యార్థులకు ప్రథమ చికిత్స అందించారు.

ప్రమాద ఘటన స్థలానికి లారీ యాజమాన్యాలు రాకపోవడంతో గ్రామ ప్రజలు ఆందోళనలకు దిగారు.

ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆదేశాల మేరకు సంఘటన స్థలానికి అటాహుత్తున తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పర్వత సురేష్ చేరుకుని విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థుల పక్షాన తెలుగుదేశం పార్టీ న్యాయం చేకూర్చదిశగా పోరాడుతుందని హామీ ఇచ్చారు. ప్రతిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చారవాణి ద్వారా విద్యార్థులను పరామర్శించారు. లారీ యాజమాన్యాలతో మాట్లాడి చర్యలు చేపడతానని అన్నారు.

ఈ సందర్భంగా అత్యంత వేగంతో టిప్పర్ లారీలను నడుపుతున్న డ్రైవర్ల పై చర్యలు తీసుకుంటానని లారీ యాజమాన్యాలతో మాట్లాడి విద్యార్థులకు ఉన్నత ఆసుపత్రిలో విలువైన చికిత్స చేయించడం జరుగుతుందని రౌతులపూడి సబ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

- **ఇసుక రవాణా తెలంగాణకి అనుమతి లేదు**
- **అది కూడా మనుషులు ద్వారా లోడింగ్ చెయ్యాలి**
- **పగటి పూట మాత్రమే రవాణాకు అనుమతి**
- **గిరిజన సొసైటీల పేరు తో అక్రమంగా నిబంధనలు ఉల్లగిస్తే చట్టపరమైన చర్యలు**
- **రెవిన్యూ , పోలీస్ శాఖ హెచ్చరిక**



**కుక్కునూరు, మార్చి 30 (మనం న్యూస్) :** మండల పరిధిలో మైనింగ్ శాఖ అనుమతించిన ఇసుక ర్యాంపులలో ఇసుకను సంబంధిత శాఖ జారీ చేసిన నియమ నిబంధన ల మేరకే తరలింపు జరగాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని కుక్కునూరు సిఐ రమేష్, ఎస్ఐ రాజారెడ్డి, తాసిల్దార్ రమేష్ బాబు పేర్కొన్నారు. సోమవారం ఈ విషయమై పోలీసు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి చర్చించిన అనంతరం వారు పత్రికలకు ప్రకటనను విడుదల చేశారు. ఈ సందర్భంగా మండలంలోని దాచారం ఇబ్రహీంపేట ఇసుక రాంపుల నుండి ఇసుకను తీసుకునేందుకు మైనింగ్ శాఖ స్థానిక గిరిజన సొసైటీలకు అనుమతులు మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ ర్యాంపుల నుండి ఇసుకను కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మాత్రమే తరలించాలన్నారు.

ర్యాంపు నిర్వహణ కూడా ఉదయం 6:00 గంటల నుండి సాయంత్రం 6:00 గంటల వరకు మాత్రమే చేపట్టాలని , ఇసుకను తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ రవాణా జరగకుండా పోలీస్ రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో పికెట్లు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.మైనింగ్ శాఖ సూచించిన నియమ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలను ఉల్లంఘించిన పక్షంలో, సంబంధిత గిరిజన సొసైటీలును రద్దు చేసి నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

## నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పనకు కేంద్రం చర్యలు

- **కాకినాడలో 'మోడల్ కెరీర్ సెంటర్' ఏర్పాటుకు ఆమోదం**
- **ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం**

**పిఠాపురం మనం న్యూస్ :** దేశవ్యాప్తంగా యువతకు కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ కెరీర్ సర్వీస్' పోర్టల్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే తెలిపారు. ఎన్.సి.ఎస్ పోర్టల్ ద్వారా నియమించిన ఉద్యోగాలు, ఖాళీల సంఖ్య, మోడల్ కెరీర్ సెంటర్లు ఏర్పాటు తదితర అంశాలపై సోమవారం కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి బదులిచ్చారు. ఎన్.సి.ఎస్ పోర్టల్ ద్వారా దేశవ్యాప్తంగా 8.10 కోట్ల ఉద్యోగ ఖాళీలు సమీకరించగా, 4.47 కోట్ల నిరుద్యోగులు ఉద్యోగాల కోసం పోర్టల్ లో నమోదు చేసుకోగా,ఇందులో ఆంధ్రప్రదేశ్ లో 18.68 లక్షల మంది నిరుద్యోగులు నమోదయ్యారని తెలిపారు. అలాగే దేశవ్యాప్తంగా 407 మోడల్ కెరీర్ సెంటర్లు ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలపగా, ఇందులో ఆంధ్రప్రదేశ్ లో 30 సెంటర్లు ఉండగా, కాకినాడలో ఒక మోడల్ కెరీర్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఎన్. సి.ఎస్ పోర్టల్ ను అన్ని రాష్ట్రాలతో అనుసంధానం చేయడంతో పాటు, ఏఐ ఫీచర్లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం జోడించి మెరుగైన ఫలితాల కోసం ఇతర పోర్టల్స్ తో అనుసంధానం చేస్తున్నామని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వర్క్ షాపులు నిర్వహించడంతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు కేంద్రమంత్రి శోభా కరంద్లాజే వివరించినట్లు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.



## ప్రభుత్వ సొమ్ము వద్దు, మా సొమ్ముమాకు ఇప్పించండి

**పిఠాపురం మనం న్యూస్ :** ప్రభుత్వం డబ్బులొద్దు,మేం కష్టపడి సంపాదించి బ్యాంకులో దాచుకున్న మా సొమ్మునే మాకు ఇప్పించండి.మా ప్రాణాలు పోకుండా ఆదుకోండి.' అంటూ జయలక్ష్మీ బ్యాంకు డిపాజిటర్లు కన్నీరు పెడుతూ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.పిఠాపురం పాడా కార్యాలయంలో పీడీగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎన్వీ.శివరాంప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ప్రజలనుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి.ఏపీడీ వసంతమాధవి,కమీషనర్ నామా కనకారావు,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది హాజరైన ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని పలు ప్రాంతాలనుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు.ఇందులో భాగంగా జయలక్ష్మీ కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంకు బాధిత డిపాజిటర్లు పాడా కార్యాలయం ఎదుట ప్లకార్డులతో ఆందోళన చేపట్టారు.తమ డబ్బులు తమకిప్పించాలని నినాదాలు చేశారు.అనంతరం పాడా పీడీ డాక్టర్ శివరాంప్రసాదుకు ఫిర్యాదు అందించారు.ఈ సందర్భంగా బాధిత డిపాజిటర్లు,బ్రాహ్మణ సేవాపరిషత్ అధ్యక్షుడు యనమండ్ర సూర్యనారాయణ మీడియాతో మాట్లాడారు.కార్యక్రమంలో పళ్ళంరాజు తదితరులు పాల్గొన్నారు.




## కూటమి ప్రభుత్వం లో దళితులపై పెరిగిన దాడులు : చంద్ర నాగ రత్నం



**కాట్రేనికోన మార్చి 30 మనం ప్రతినిధి :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ హయాంలో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని వైఎస్ఆర్సిపి నాయకురాలు, మాజీ మంత్రి మోకా విష్ణు ప్రసాదరావు సతీమణి మోకా చంద్ర నాగరత్నం ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పి గన్నవరం ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గంలోని కుందాల పల్లిలో దళితుడు చనిపోతే కనీసం రోడ్డు పై మృతదేహాన్ని తీసుకెళ్లడానికి కూడా కొంతమంది వ్యక్తులు నిరాకరించడం బాధ కలిగించిందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో అనేక చోట్ల నిత్యం దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ప్రభుత్వం, అధికారులువీటిని అరికట్టవలసి ఉందని డిమాండ్ చేశారు. కేంద్రం లోని ప్రభుత్వం ఎస్ సి లందరూ కలిసి ఉంటే ఎప్పటికైనా రాజ్యాధికారం చేపడతారని గ్రహించి దళితులను విడగొట్టాలని కుట్ర చేసి సుప్రీంకోర్టు తీర్పు ద్వారా వర్గీకరణ చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వాలకు అవకాశం ఇచ్చి దళితులపై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నాయని ఆరోపించారు వర్గీకరణ పేరుతో కులాలు మధ్య కుంపటి పెట్టి అన్న దమ్ముల్లా ఉన్న దళితు ల మధ్య విభేదాలు కు కారణం అయ్యాయని ఆరోపించారు .క్రిస్టియన్ మతంలోకి మారిన దళితులకు రిజర్వేషన్లు వర్తించవని దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పునివ్వడం బాధాకరంగా ఉందన్నారు. ఈ పరిణామాలు చూస్తుంటే ప్రభుత్వాలు దళితులపై కక్ష సాధింపుకు దిగుతున్నాయని, దళితులు అందరూ పార్టీలకతీతంగా ఏకతాటి పైకి వచ్చి వీటిని ఖండించవలసి ఉందని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికీ మేల్కొనకపోతే రాష్ట్రంలోని దళితులకు, పిల్లలకు మరింత అన్యాయం జరిగే అవకాశం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

# ముందే చెప్పాను కదా! : అంపైర్‌తో రోహిత్

టీమిండియా దిగ్గజ కెప్టెన్, ముంబై ఇండియన్స్ స్టార్ రోహిత్ శర్మ ఐపీఎల్-2026 టోర్నీని ఘనంగా ఆరంభించాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ తో ఆదివారం నాటి మ్యాచ్ లో ఈ ఓపెనింగ్ బ్యాటర్ వింటేజ్ హిట్ మ్యాన్ ను గుర్తుచేశాడు. కేవలం 38 బంతుల్లోనే ఆరు ఫోర్లు, ఆరు సిక్సర్ల సాయంతో 78 పరుగులు సాధించాడు. ఇక ఈ మ్యాచ్ లో ముంబై ఇండియన్స్ కోల్ కతా పై ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తద్వారా 2012 తర్వాత తొలిసారి ఐపీఎల్ లో తమ ఆరంభ మ్యాచ్ లో ముంబై గెలుపు జెండా ఎగురవేసింది. ఇదిలా ఉంటే.. ఈ మ్యాచ్ సందర్భంగా అంపైర్ తో రోహిత్ శర్మ వ్యవహరించిన తీరు వైరల్ గా మారింది.

కేకేఆర్ విధించిన 221 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రోహిత్ బ్యాటింగ్ కు వస్తున్న సమయంలో.. అంపైర్ అతడి బ్యాట్ ను పరీక్షించాడు. బ్యాట్ పరిమాణం సరిగ్గా ఉందా అన్న విషయాన్ని తెలుసుకునేందుకు గేజ్ టెస్టు నిర్వహిస్తుండగా.. రోహిత్ తన బ్యాట్ సరిగ్గానే ఉందంటూ రియాక్షన్ ఇచ్చాడు.

అయితే, నిబంధన ప్రకారం బ్యాట్ ను టెస్టు చేసిన అంపైర్ సంతృప్తి వ్యక్తం చేయగా.. 'నేను ముందే చెప్పాను కదా!' అన్నట్లుగా రోహిత్ శర్మ నవ్వులు చిందిస్తూ మైదానంలోకి వెళ్లిపోయాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు హిట్ మ్యాన్ అభిమానులను ఆకర్షిస్తున్నాయి.

కాగా గతేడాది ఎక్కువగా ఇంపాక్ట్ సబ్ స్టిట్యూట్ గా వచ్చిన రోహిత్.. ఈసారి మాత్రం తుదిజట్టులో భాగంగా బరిలోకి దిగుతున్నాడు. దీంతో అతడి ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు.

ఇక టీమిండియాకు టీ20 ప్రపంచకప్-2024, ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025 టైటిల్ అందించిన ఘనత రోహిత్ శర్మది. కెప్టెన్ హోదాలో ముంబైని సైతం ఐదుసార్లు చాంపియన్ గా నిలిపాడు. అయితే, 2024లో ముంబై రోహిత్ ను కెప్టెన్సీ నుంచి తప్పించి హార్దిక్ పాండ్యాకు పగ్గాలు అప్పగించిన సంగతి తెలిసిందే.





## సంజూ తొలి మ్యాచ్‌లోనే ఫెయిల్

టీ20 ప్రపంచకప్-2026 హీరో సంజూ శాంసన్ ఐపీఎల్ తాజా ఎడిషన్ తొలి మ్యాచ్ లోనే నిరాశపరిచాడు. చెన్నై సూపర్ కింగ్స్ తరఫున భారీ అంచనాలతో బరిలోకి దిగాడు ఈ కేరళ స్టార్. ఐపీఎల్-2026లో భాగంగా రాజస్తాన్ రాయల్స్ తో సోమవారం నాటి మ్యాచ్ సందర్భంగా.. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ తో కలిసి సీఎస్ కే ఇన్నింగ్స్ ఆరంభించాడు సంజూ.

జోఫ్రా ఆర్చర్ రాయల్స్ బౌలింగ్ ఎటాక్ ఆరంభించగా.. సంజూ ఐదో బంతికి ఫోర్ బాది ఖాతా తెరిచాడు. అయితే, ఆ తర్వాత బ్యాట్ ఝుళిపించలేకపోయిన ఈ కుడిచేతి వాటం ఆటగాడు.. రెండో ఓవర్ ఆఖరి బంతికే పెవిలియన్ చేరాడు.

రాయల్స్ పేసర్ నంద్రీ బర్గర్ బౌలింగ్లో సంజూ శాంసన్ క్లీన్బౌల్ అయ్యాడు. దీంతో మొత్తంగా ఏడు బంతులు ఎదుర్కొన్న ఈ ఓపెనింగ్ బ్యాటర్.. ఆరు పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద నిష్క్రమించాడు. సీఎస్కే తరఫున అరంగేట్ర మ్యాచ్లోనే సంజూ విఫలం కావడంతో అభిమానులు ఉసూరుమంటున్నారు.

## వైభవ్ విధ్వంసం..

### రాజస్థాన్ రాయల్స్‌దే విజయం..

ఐపీఎల్ 2026లో భాగంగా గువాహటి వేదికగా చెన్నై సూపర్ కింగ్స్తో జరిగిన మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన రాజస్థాన్ రాయల్స్ బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్ కింగ్స్ 19.4 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది. రాజస్థాన్ రాయల్స్ 12.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. వైభవ్ సూర్యవంశీ 17 బంతుల్లో 52 పరుగులతో విధ్వంసం సృష్టించాడు.



## ఆ లుక్‌లోకి మారబోతున్న శర్వా?



యంగ్ హీరో శర్వానంద్ మళ్లీ తన కొత్త సినిమా కోసం సరికొత్త లుక్ లో కనిపించబోతున్నాడు. తన బైకర్ కోసం బాగా సన్నబడ్డ శర్వా.. ఇప్పుడు తన తర్వాత సినిమా కోసం అందుకు భిన్నంగా మారబోతున్నాడు. శర్వా.. శ్రీను వైట్ల దర్శకత్వంలో 'జార్జ్ క్రిష్' అనే సినిమా చేస్తున్నాడు. అయితే, ఈ సినిమా కోసం శర్వానంద్ ఓల్ లుక్ లో కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. ఫ్లాష్ బ్యాక్ లో వచ్చే కథలో శర్వానంద్ 60 ఏళ్ల వ్యక్తిగా కనిపిస్తాడట. సినిమాలో రెండు ఎపిసోడ్స్ లో ఈ లుక్ ఉంటుందట. గతంలో కూడా శర్వానంద్ ఓల్ గెటప్ లో కనిపించిన విషయం తెలిసిందే. ఇప్పుడు మళ్లీ ఆ ఓల్ లుక్ లోకి మారబోతున్నాడు. ఇక జూన్ లో ఈ సినిమా షూట్ ను స్టార్ట్ చేయనున్నారు. మొదటి షెడ్యూల్ లో శర్వానంద్ ఎంట్రీ సీన్స్ ను షూట్ చేస్తారని తెలుస్తోంది. ఇక ఈ సినిమాకి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు కూడా జరుగుతున్నాయి. ఐతే, గోపీచంద్ హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ కామెడీ 'విశ్వం' ఏవరేజ్ గా నిలిచింది. దీంతో, ఎలాగైనా మళ్ళీ టాలీవుడ్ లో తన తర్వాత సినిమాతో బిజీ అయ్యేందుకు శ్రీనువైట్ల తెగ కష్ట పడుతున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మించనుంది.

## ప్రకాశ్ రాజ్‌కు మాతృ వియోగం



నటుడు ప్రకాశ్ రాజ్ ఇంట విషాదం చోటుచేసుకుంది. ఆయన తల్లి సువర్ణలత (86) కన్నుమూశారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతోన్న ఆమె సోమవారం ఉదయం స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. సువర్ణలత మృతిపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంతాపం తెలిపారు. ''శ్రీమతి సువర్ణలత గారు కన్నుమూశారని తెలిసి చింతించాను. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. ప్రకాశ్ రాజ్, ఆయన కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను'' అని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.

## తల్లినయ్యాక ఆడపులిలా మారాను



అమ్మనయ్యాక తను జీవితాన్ని చూసే విధానమే మారిపోయిందని అంటోంది బాలీవుడ్ కథానాయిక కియారా అడ్వాణీ. హీరోలకు దీటుగా యాక్షన్ సీన్స్ తో అదరగొట్టే నాయికీమె. ప్రస్తుతం మాతృత్వ దశను ఆస్వాదిస్తున్న కియారా.. తల్లయిన తర్వాత తన జీవితంలో వచ్చిన మార్పుల గురించి అభిమానులతో పంచుకుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. ''ఇప్పుడు నేను ఆడపులిలా మారానని అనిపిస్తోంది. మునుపటి కంటే నా జీవితాన్ని చూసే కోణం భిన్నంగా ఉంది. ఒక్కోసారి మరేదీ ముఖ్యం కానట్టు అనిపిస్తుంది. కొన్ని సమయాల్లో ప్రతి చిన్న విషయం కూడా ముఖ్యమనే భావన కలుగుతుంది'' అని అంది.

పెళ్లి తర్వాత తన భర్త, నటుడు సిద్ధార్థ్ మల్హోత్రాతో తన బంధం గురించి మాట్లాడుతూ.. ''పెళ్లికి ముందు మా మధ్య ఉన్న సరదా కబుర్లు, కలిసి ప్రయాణాలు చేయడం ఇవేమీ మారలేదు. ఇప్పటికీ మేమిద్దరం కలిసి సినిమాలు చూస్తాం. నటీనటులుగా, సినిమా ప్రేమికులుగా ఆ చిత్రాల గురించి చర్చించుకోవడం మాకు చాలా ఇష్టమ''ని చెప్పుకొచ్చింది.

''నాకు ఎప్పుడూ నటిని అవ్వాలని ఉండేది. చిన్నప్పుడే నాలో ఆ కోరిక ఉందని మా తల్లిదండ్రులు పసిగట్టారు. కానీ ముందుగా చదువు పూర్తి చేయాలని పట్టుబట్టారు. ఆ తర్వాత వారి ప్రోత్సాహంతోనే చిత్రపరిశ్రమలోకి వచ్చాను. వైఫల్యమే ఉత్తమ గురువు అని తెలుసుకున్నా. ఇక సినిమాల విషయానికొస్తే.. కథలు, పాత్రలతో కనెక్ట్ అయితే.. అంతకు మించి ఆలోచించను. వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తాను. నేను దర్శకుడి నటిని. దర్శకుడికి, నటులకి మధ్య ఉండే అనుబంధమే ముఖ్యమని నమ్ముతాను''.

**హద్దు దాటిన అభిమానం..**

## హీరోయిన్ నడుముపై చేయి వేసిన అభిమాని..!



మలయాళ నటి హనీ రోజ్ కు తాజాగా ఓ చేదు అనుభవం ఎదురైంది. ఆమె ఒక షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వెళ్ళగా అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అయితే, ఆ సమయంలో ఒక వ్యక్తి సెల్ఫీ కోసం ఆమె నడుముపై చేయి వేయడం కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో, అభిమానం పేరుతో పరిధులు దాటడంపై నెటిజన్లు మండిపడుతున్నారు.

ఈ పరిస్థితిని హనీ రోజ్ చాలా నిబ్బరంగా, చిరునవ్వుతోనే ఎదుర్కొన్నప్పటికీ, సెలబ్రిటీల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలగడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో నిధి అగర్వాల్ వంటి హీరోయిన్లకు కూడా ఇలాంటి అనుభవాలే ఎదురయ్యాయి. కేవలం ఫోటోల కోసం హీరోయిన్లను అసభ్యంగా తాకడం సరైన పద్ధతి కాదని, వారి భద్రత విషయంలో నిర్వాహకులు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అందరూ అభిప్రాయపడుతున్నారు.

హనీ రోజ్ ప్రస్తుతం సినిమాల కంటే ఎక్కువగా ఇలాంటి ఈవెంట్స్ మరియు సోషల్ మీడియా ద్వారా అభిమానులకు దగ్గరగా ఉంటుంది. కాగా, తాజాగా జరిగిన ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది.



### సల్మాన్ ఖాన్–వంశీ పైడిపల్లి

## కాంబినేషన్ ఫిక్స్

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ తో వంశీ పైడిపల్లి సినిమా చేయనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. నేడు ఈ ప్రాజెక్ట్ పై అధికారిక ప్రకటన వెలువడింది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై ఇది రానున్నట్లు తెలుపుతూ ఓ ఫొటో షేర్ చేసింది. ఏప్రిల్ నుంచి దీని షూటింగ్ ప్రారంభం కానున్నట్లు వెల్లడించింది. ఇందులో హీరోయిన్ గా నయనతారను ఎంపిక చేసినట్లు కూడా ఇటీవల వార్తలు వచ్చాయి. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. త్వరలోనే నటీనటుల వివరాలు పంచుకోనున్నారు. 2027లో దీన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ 'మాతృభూమి'లో నటిస్తున్నారు. దీనితోపాటే వంశీ సినిమాను కూడా మొదలుపెట్టనున్నట్లు తెలుస్తోంది. భారీస్థాయిలో దీన్ని తెరకెక్కించనున్నారు. నిజానికి సల్మాన్ కు మంచి హిట్ పడి చాలాకాలం అయింది. మరోవైపు వంశీ కూడా చివరిగా విజయ్ హీరోగా 'వారసుడు' రూపొందించారు. అది అనుకున్న స్థాయిలో అంచనాలను అందుకోలేకపోయింది. అప్పటినుంచి సల్మాన్ ప్రాజెక్ట్ పైనే వర్క్ చేశారు. దీంతో ఈ ప్రాజెక్ట్ ఇద్దరికీ కీలకంగా మారింది.

## ఫ్యామిలీ ఎమోషన్స్ చుట్టూ 'విశ్వనాథ్ అండ్ సన్స్'!

తమిళ స్టార్ హీరో సూర్య - వెంకీ అట్లూరి దర్శకత్వంలో 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమా రాబోతుంది. ఈ చిత్రంలో మమితా బైజు హీరోయిన్ గా నటిస్తోంది. తాజాగా వినిపిస్తున్న అప్ డేట్ ప్రకారం.. ఈ సినిమా అవుట్ పుట్ చాలా బాగా వచ్చిందని.. సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ చాలా బాగున్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా 20 ఏళ్ల అమ్మాయికి 40 ఏళ్ల వ్యక్తికి మధ్య ప్రేమ పుడితే.. ఆ అల్లరి అమ్మాయి, ప్రేమ అంటూ ఆ మధ్య వయస్కుడి చుట్టూ తిరిగే డ్రామాలో కూడా చాలా బాగా వర్క్ అవుట్ అయిందట.

కాగా రాధికా శరత్ కుమార్, రవీనా టాండన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అలాగే వీళ్లిద్దరి మధ్య ఎమోషన్ తో పాటు ఫన్ ను కూడా చాలా బాగా చూపించారట. సూర్యకి పోటీగా మమితా బైజు నటించిన విధానం చాలా బాగుందట. ఇద్దరి మధ్య కెమిస్ట్రీ కూడా కరెక్ట్ గా సెట్ అయిందట. అన్నట్టు 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రాన్ని జులైలో రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. కాగా తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా గ్రాండ్ గా రిలీజ్ కాబోతుంది. ఈ సినిమా పై భారీ అంచనాలు ఉన్నాయి.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.